
# Deccan Land




January | JAN 2025

జనవరి - 2025

DECCAN LAND, HYDERABAD

149


JANUARY - 2025

₹ 30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

*Unesco Site Inscription : 1984 - MAHABALIPURAM (Tamil Nadu)*



VOL 13వ వసంతంలో
149 ISSUES నూట నలభై తొమ్మిదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- స్త్రీపాత్రల రూపశిల్పి: డైరెక్టర్ శ్యామ్‌బెనగల్
- పుల్లూరుబండ చారిత్రక విశేషాలు
- వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ
- మట్టి మనుషుల పాదయాత్ర



# VOL 13వ వసంతంలో
# 149 ISSUES నూట నలభై తొమ్మిదవ సంచిక
## పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్





దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2025 జనవరి సంచికతో 149 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**


ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

చరిత్రకారులకు, పరిశోధకులకు, పరిశోధాత్మక మరియు విశ్లేషణాత్మక రచయితలకు, విశ్లేషకులకు, పాఠకులకు, శ్రేయోభిలాషులకు...

## నూతన సంవత్సర శుభాకాంక్షలు




**UNESCO SITE**

**Mahabalipuram:** TamilaNadu, India
Date of Inscription: 1984 Category : Cultural (Monument)

## మహాబలిపురం చారిత్రక వారసత్వ కట్టడాలు

మహాబలిపురంలోని చారిత్రక వారసత్వ కట్టడాలు సంప్రదాయ భారతీయ వాస్తుశిల్పంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాయి. మహాబలిపురం ఒకప్పుడు పల్లవ రాజవంశపు ప్రసిద్ధ ఓడరేవు నగరం. ఇక్కడి చారిత్రక వారసత్వ కట్టడాలలో రాతి గుహ దేవాలయాలు, ఏకశిలా దేవాలయాలు, బాస్-రిలీఫ్ శిల్పాలు, అలాగే పురాతన దేవాలయాల తవ్వకాల అవశేషాలున్నాయి. ఈ కట్టడాలన్నీ ఏడు, ఎనిమిదవ శతాబ్దాలలో కోరమాండల్ తీరం వెంబడి రాతితో చెక్కబడ్డాయి. ఈ ప్రదేశం ప్రత్యేకించి రథాలు (రథాల రూపంలోని దేవాలయాలు), మండపాలు, భారీ బహిరంగ ప్రదేశాలు, అనేక అందమైన దేవాలయాలు, వేలకొద్దీ శివుడి శిల్పాలతో ప్రసిద్ధి చెందింది.


ఈ కల్చరల్ మాన్యుమెంటు UNESCO చే 1984లో గుర్తించబడింది.

*ప్రత్యేక వ్యాసం : 29 పేజీలో*

TELANGANA RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com




## పోలవరం ప్రాజెక్ట్ ముంపులో కనుమరుగు కానున్న గిరిజనుల జీవనం

'పర్యావరణను పరిరక్షించు గిరిజనుల కల్ప వృక్షం' అనే వ్యాస రచయిత ఎసికె. శ్రీహరితో నా పరిశీలనలో వచ్చిన కొన్ని అంశాలను పంచుకోవాలని ఈ ఉత్తరం (మెయిల్) రాస్తున్నా. వెదురు యొక్క సాంస్కృతిక ప్రాధాన్యత కూడా చాలా ఉంది. ఆదివాసీలు ముఖ్యంగా కోయ జాతిలో 3 నుండి 7 వరకు గట్లు (గోత్రం) ఉన్నాయి. ప్రతి గట్టు వారికి ఒక ప్రత్యేకమైన ఇలవేల్పు (కోయ భాషలో వేల్పులు) ఉంటుంది. ఇల వేల్పుగా వెదురు కర్రకు, ఎర్రని బట్ట కట్టి ఆరాధన చేస్తారు. గట్టు వారికి మూడు తమ్మేలు (nodes), 4వ గట్టుకు నాలుగు... ఇలా 7వ గట్టుకు 7 తమ్మేలు ఉంటాయి. ప్రతి పుట్టిన బిడ్డతో ttela నుండి చావు వరకు ప్రతిది వెదురు బుట్టను, అంతే కాదు వెదురు లేత మొలకలు కూరలను చేసుకుని తింటారు. ఆదిమ జాతి కొండారెడ్డి వాళ్లు బుట్టలు అల్లి కోయ వాళ్లకు అమ్మి జీవిస్తున్నారు. వీరి ముఖ్యమైన ఆదాయం వచ్చే ఏకైక వనరు వెదురు. ఆ పని తప్ప వేరే పని వీరికి రాదు. కానీ ఇవన్నీ ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు ముంపులో కనుమరుగు కానున్నాయి. కోయ, కొండారెడ్డి వాళ్ల భాషా, సంస్కృతి, విభిన్నమైన జీవన విధానం ఎలా ఉంటుందో ఏమో.

-కె.పాండు కమతేకర్, వరంగల్,
ఫోన్: 6300484726

❖ ❖ ❖

## వైష్ణవానికి ప్రసిద్ధి జీడికల్లు తీర్థం

జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలంలో చివరి గ్రామం జీడికల్లు గురించి రచయిత శ్రీ రామోజు హరగోపాల్‌గారు చాలా చక్కగా వివరించారు. ప్రతి కార్తీకపున్నమి రోజు జరిగే జీడికల్లు జాతర గురించి రామాలయక్షేత్రం గురించి, జీడికల్లు చుట్టూ ప్రక్కల ఉండే దేవాలయాల గురించి, వైష్ణవాలయాలకు కావాలసిన సంభావనలు ఈ జీడికల్లు తీర్థం నుండి వెళ్లేవని మాకు తెలియని ఎన్నో విషయాలను తెలిపారు. నిజాం పాలనకాలంలో ప్రసిద్ధ చారిత్రక, పర్యాటక క్షేత్రంగా కొలనుపాక ఉండేదని అక్కడి గ్రంథాలయం గురించి, జీడికంటి రామశతకం రాత పుస్తకం ముద్రణకు కొలనుపాక వాస్తవ్యుడు నర్సయ్య తనకు ఇచ్చిందని రఘునాథరావు రాసినట్లు అచ్చుకొరకు గంగుల సాయిరెడ్డి ధన సహాయం చేసినట్లు, ఆలేరు దగ్గరున్న ఏడూర్ల పొలిమేర దగ్గర ప్రతి ఆదివారం పశువుల అంగడి, ప్రతి కార్మికపౌర్ణమి శ్రీరామ కల్యాణం జరుగుతుందని ఇలాంటి ఎన్నో విషయాలు ఇప్పటి తరానికి తెలియజేశారు. జీడికల్లు అనే పేరు ఆ పేరు వెనుక ఉన్న కథ గుండం నీళ్లు తెల్లగా ఉంటే అది కల్లు గుండం అని, మరోక గుండం నీళ్లు జీడిగుండం అని ప్రజలు పిలుస్తారు. జీడి అంటే నల్లనిది, కల్లు అంటే రాయి. జీడికల్లు అంటే నల్లటి రాతిబండ అని అర్థం. ఇలాంటి ప్రాశ్యస్తమైన కథలను పురాణాలను తెలియజేసిన రచయితకు ధన్యవాదాలు.

-యాదగిరి, ఆలేరు

❖ ❖ ❖

## పోటీ పరీక్షలకు దిక్సూచి దక్కన్‌ల్యాండ్

సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2 లాంటి ఉన్నతమైన పోటీ పరీక్షలు ఎదుర్కొడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్టులో తెలుగు మీడియం అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న సమయంలో దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో రచయిత పుట్టా పెద్ద ఓబులేసు సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి రాసే వ్యాసాలు ఎంతో ఉపయుక్త కరంగా ఉంటున్నాయి. కఠినమైన సాంకేతిక మరియు సైన్స్ పదజాలాన్ని వీళ్లైనంత సరళంగా మాతృభాషలోకి అనువదించి సులువుగా, సమగ్రంగా రచయిత వివరించి చెప్తుతున్నారు. వీరి రచనలు లోతైన విశ్లేషణతో, సందర్భోచిత ఉదాహరణలతో వ్యాసాలు పోటీ పరీక్షలకు సిద్ధమై విద్యార్థులకు చాలా విలువైనవి. మాలాంటి తెలుగు విద్యార్థులకు ఈ వ్యాసాలు పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రచయిత పుట్టా పెద్ద ఓబులేసును మరింత ప్రోత్సహించాలని దక్కన్‌ల్యాండ్ యాజమాన్యాన్ని కోరుతున్నాను.

-ఎ. సృజన్, హైదరాబాద్ ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com
**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 13 సంచిక : 5 పేజీలు : 60

జనవరి - 2025

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**మహాబలిపురం**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.



కవర్ స్టోరీ
29వ పేజీలో

## లోపలి పేజీల్లో...

వారసత్వ సంపద
పెంబర్తి హస్తకళ



సాంస్కృతిక పండుగ
లోహ్రి




ముకురాల రామారెడ్డి ........ డా॥ జి. చెన్నకేశవరెడ్డి ........ 6
జమిలి ఎన్నికలు - ఫెడరల్ విధానానికి ముప్పు..... (ఎడిటోరియల్) .. వేదకుమార్. యం ........ 7
కాలం చెక్కిలిపై కన్నీటి చుక్క........ చకిలం వేణుగోపాలరావు ........ 9
ప్రత్యేక తెలంగాణా కోసం మట్టి మనుషుల పాదయాత్ర ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13
తెలంగాణలో బయల్పడిన రాతియుగపు పనిముట్లు ........ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ........ 16
ప్రొటీన్ ఇంజనీరింగ్‌లో సంచలనం!! ........ పుట్టా పెద్దఓబులేసు ........ 17
256 మంది ధీరవనితలు - స్ఫూర్తి కాంతులు ........ సీఏ. ప్రసాద్ ........ 19
వ్యాధులు లేని ఉగాదుల కోసం..! ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 21
తెలంగాణలో 15,000 చెస్ బోర్డుల పంపిణీ........ చెస్ నెట్ వర్క్ ........ 22
సాంస్కృతిక పండుగ లోహ్రి ........ ఎసికె. శ్రీహరి ........ 23
ఉమ్మడి కడప జిల్లా శిలా మరియు ఖనిజసంపద ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 25
దేశ ఆర్థిక అభివృద్ధిలో టూరిజం ........ కె. సచిన్ ........ 28
మహాబలిపురం చారిత్రక వారసత్వ కట్టడాలు ........ జాన్విజ్ శర్మ ........ 29
హైదరాబాద్ లింక్ ఆకృతిలో బెనగల్ కథలు ........ డెస్క్........ 31
శక్తివంతమైన స్త్రీ పాత్రల రూపశిల్పి డైరెక్టర్ శ్యామ్ బెనగల్ ఇకలేరు ... దక్కన్ న్యూస్ ........ 33
కొయ్య బొమ్మలాట మోతె జగన్నాథం మృతి ........ టి. స్వామి ........ 35
కవిత్వం కూడా శిక్ష తగ్గిస్తుందా..? ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 37
భారతదేశంలో పట్టనంత చరిత్ర తెలంగాణలో ఉంది ........ ఎ. మల్లేష్ ........ 39
పుల్లూరు బండ ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 41
వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ ........ సువేగా ........ 45
నాణ్యత పాటిస్తూ లక్ష్యాలు సాధించాలి ........ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ........ 49
వ్యవ'సాయ' వర్సిటీ.. ........ కట్టా ప్రభాకర్ ........ 49
సాగులో సాంకేతిక పెంచాలి ........ కె. సచిన్ ........ 51
వనపర్తి శ్రీరంగం ........ సత్యప్రసన్న ........ 53
పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత ........ ఎసికె. శ్రీహరి ........ 55
తెలుగు సాహిత్యానికి యువ రచయితల అక్షరాభిషేకం ........ ఖైజర్ భాష ........ 57
మాట చాతుర్యం ........ వి. మంజురాణి (కథ) ........ 58


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# ముకురాల రామారెడ్డి

కీ.శే. ముకురాల రామారెడ్డి గారు తెలంగాణ ముద్దు బిడ్డలలో ఒకరు. అప్పటి మహబూబునగరం జిల్లా కల్వకుర్తి తాలూక ముకురాల గ్రామంలో 1929వ సంవత్సరంలో జన్మించారు. వారి చదువు ఒక బడిలో గాని, ఒక గురువు దగ్గరగాని స్థిరంగా సాగలేదు. వీధిబడి నుంచి విశ్వవిద్యాలయం చదువుదాకా చాలావరకు స్వయం కృషితోనే సాగింది. ఆంధ్ర (తెలంగాణ) సారస్వత పరిషత్తు నిర్వహించే 'విశారద' పాసై, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ, ప్రైవేటుగా B.A., B.Ed., M.A. చదివి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడై, మహబూబునగర్ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తూ, తెలుగు అకాడమిలో 1970వ సంవత్సరంలో చేరి 17 ఏళ్ళపాటు వివిధ హోదాలలో పనిచేసి, ఉప సంచాలకులుగా రిటైరైనారు. తెలుగు అకాడమిలో ఉద్యోగం చేస్తూ, ఆచార్య సి. నారాయణరెడ్డి గారి పర్యవేక్షణలో 'ప్రాచీనాంధ్ర కవిత్వం ఆదర్శాలు పరిణామాలు' అనే అంశంమీద పరిశోధన చేసి Ph.D. పట్టా పొందారు. 1946-48 ప్రాంతంలో విద్యార్థి దశలోనే గ్రంథాలయోద్యమం. నిజాం వ్యతిరేక పోరాటం వంటి ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. 'దుందుభి' మాస పత్రికకు గంగాపురం హనుమచర్మత్ కలిసి సంపాదక బాధ్యతలు నిర్వహించారు.



ముకురాల స్వయం కృషితో తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషలను గట్టిగా చదువుకొన్న వ్యక్తి. ఉపాధ్యాయ వృత్తి నుంచే ఆయన కవితలు, విమర్శన వ్యాసాలు రాస్తూ వచ్చారు. ప్రచురితమైన వాటిలో ఆయన తొలికృతి 'దేవరకొండ దుర్గం'. ఈ గేయ కావ్యం 1957లో అచ్చయింది. దేవరకొండ దుర్గం 8 పేజీల లఘు కావ్యమైనా, ఆయనకు అమోఘమైన కీర్తిని తెచ్చిపెట్టింది. దేవరకొండ దుర్గం రాచకొండ రాజ్యంలోని భాగం, వెలమ ప్రభువులు పాలించిన ప్రాంతం. ఈ సీమను పాలించిన ప్రభువులలో సర్వజ్ఞ సింగభూపాలుడు ప్రసిద్ధుడు. ఈ కావ్యంలో కథ ఏమీలేదు. కేవలం వర్ణనాత్మకమైన, ప్రశంసాత్మకమైన కావ్యం.

'అలరాచకొండలో
తలిరాకు మొలబాకు నాజోకు భోగినిషోకు
కవిరాజురాజు సింగమనీని దర్బారు కవులకే
వాకట్టు గట్టు వాగ్యుద్ధములు
తిరుగునా కలలో గిరగిరన
నా అంతరంగమే ఒక చిత్రరంగమై భ్రమియించు
ఒకనాడు వెలమలకు ఉనికిరా ఈ కొండ
ఇదియె దేవరకొండ ఇదియె దేవరకొండ
ఇదెకొండ, ఇదెకోట - ఈ కొండ కిదిదండ
ఇట ఎన్నడో ఎగిరెనటరా తెలుగుజెండ
ఏనాటిదీ వీర ధాని దేవరకొండ' అని నాటి పురాణ వైభవాన్ని వర్ణిస్తారు.

'నేలతల్లి కెరుక నింగి సామి కెరుక
నాటి కతలు వెతలు నాటి మాట
మనసు రకగనేడు వినిపించు నొక్కటే
గాలిపిల్ల వాని జీవి మాట' అని నేటి జీర్ణస్థితిని కళ్ళకు కట్టిస్తాడు.

నవ్వేకత్తులు: ముకురాలా రెండో కావ్యం. దీన్ని కవిగారే 'జాతీయ విప్లవ కావ్యం' అని పేర్కొన్నారు. ఈ కావ్యాన్ని రెండు భాగాలుగా రాయడం జరిగింది. సంప్రదాయం చచ్చిపోతున్నదని ఏడుకొండల వాడికి వినతిపత్రం (దరఖాస్తు ద్వారా విన్నవించడం మొదటి భాగం. రెండో భాగం ఎండార్స్‌మెంట్. కొత్త సమాజం కావలసిందేనని, అది కొత్తగా రూపొందవలసిందేనని, దానికి ముఖ్యంగా కావలసింది కొత్త వ్యవస్థేనని ఈ కావ్యంలో ప్రతిపాదించడం జరిగింది.

"హేతుమతి పెరగని సంఘంలో - మతముంటుంది మనిషిని మనిషినీ విడదీయిస్తూ" అని కవి భావం.

భారత విదేశాంగ నీతిలోని లోటే చైనా దాడికీ, పాకిస్తాన్ కోతి చేష్టలకూ కారణమైందని, లౌకిక రాజ్యాంగం అని చెప్పుకొంటూ, వివిధ మతాలకు స్వాతంత్ర్యం ఉండటం దేశంలో మతకలహాలకు ద్విజాతి సిద్ధాంతాలకు మూలకారణమైందని ముకురాల నిశ్చితాభిప్రాయం.

"ఒక జాతిది ఒక సత్యం-
ఒక జెండా, ఒక్క పాట
అడగవోయి సముద్రాల- అలలు తాకినంతమేర
ఒక జాతిది ఒక తత్త్వం ఒక గమ్యం ఒక్క మాట
అడుగు నేటి తత్వం హద్దులు ఏర్పడిన మేర
అని తన జాతీయ తత్త్వమేమిటో తన కవితలో వెల్లడిస్తాడు.

హృదయశైలి: 1957 నుంచి 77 వరకు అప్పుడు వివిధ అంశాలమీద రాసిన 36 కవితల సంపుటి 'హృదయశైలి'.

(తరువాయి 8వ పేజీలో)




# జమిలి ఎన్నికలు - ఫెడరల్ విధానానికి ముప్పు

ఇది ఒక పూలతోట - నిజమే
కాని
పూలన్నీ ఒకటికాదు
పూల పేర్లన్నీ ఒకటికాదు
పూల రంగులన్నీ ఒకటికాదు
పూల వాసనలన్నీ ఒకటికాదు
కానీ
అవన్నీ పువ్వులే
ప్రకృతి ప్రసాదించిన భిన్నభిన్న అందాలే!

'భిన్నత్వంలో ఏకత్వం' మనదేశ విశిష్టత అని మనందరికీ తెలుసు. భిన్నమైన భౌగోళిక, ప్రాకృతిక స్థితులు, ప్రజలు, జాతులు, నాగరికతలు, సంస్కృతులు, సామాజిక, ఆర్థిక స్థితులతో యింత వైవిధ్యమైన భారతాన్ని ఒకేదేశం - ఒకేప్రజ అనడంలో ఔచిత్యం లేదు.

మన రాజ్యాంగం అధికారాన్ని కేంద్రం - రాష్ట్రాల మధ్య విభజించింది. యూనియన్ జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలతో అధికారాలను రాజ్యాంగం నిర్ధారించింది. కేంద్ర రాష్ట్ర సంబంధాలను, హక్కులను, బాధ్యతలను సమన్వయ పరిచే వ్యవస్థనే మనం ఫెడరల్ వ్యవస్థ అంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ విధానాలు రాజ్యాంగాన్ని గౌరవించి ఆచరణతో తమ అధికారాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఫెడరల్ వ్యవస్థ ఉనికిలో వుంటుంది. మనదేశంలో 28 రాష్ట్రాలు, మరికొన్ని కేంద్ర పాలిత ప్రాంతాలు వున్నాయి. దేని ప్రత్యేకత దానిదే.

జీవించే హక్కు, భావప్రకటనా హక్కు, మతహక్కు విద్య, వైద్యం వంటి కొన్ని ప్రాథమిక హక్కుల్ని మన రాజ్యాంగం ప్రజలకు యిచ్చింది. వైవిధ్యపూరిత సామాజిక వ్యవస్థలో ఒకేదేశం ఒకేప్రజ, ఒకేదేశం - ఒకేమతం, ఒకేదేశం - ఒకేఎన్నిక వంటి ఆలోచనలు మన రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా భిన్నమైనవి. పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ జమిలి ఎన్నికల ప్రహసనం ఫెడరల్ వ్యవస్థకు ముప్పు అని మేధావులు ఆందోళన పడుతున్నారు.

ప్రతి రాజకీయ విధానం వెనుక అధికార ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ జమిలి ఎన్నికల విధానం రాజకీయ అధికార ఏకీకరణకు, కేంద్రీకరణకు దారితీస్తుంది. రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయి. రాష్ట్ర ప్రభుత్వాలు అస్థిరతకు గురవుతాయి. రాష్ట్రాల స్వయం నిర్ణయాధికారాలను, స్వయం అభివృద్ధిని కోల్పోతాయి. స్థానికతకు సంబంధించిన అన్ని అంశాలు ధ్వంసమవుతాయి. ప్రాంతీయ పార్టీలు అంతర్ధానమవుతాయి. జాతీయ అంశాలే రాజ్యమేలుతాయి.

ఇప్పటికే ఒకేదేశం - ఒకే పన్ను విధానం జిఎస్టీతో ఆర్థిక కేంద్రీకరణకు తెరలేపింది. ఆర్థిక వనరుల కోసం రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడే విధంగా చేసింది.

కేంద్రం బలపడుతుంది. రాష్ట్రాలు బలహీనపడతాయి.
కేంద్రీకరణ అది ఏదైనా నియంతృత్వానికి పునాది. వికేంద్రీకరణ వికసితానికి ఆలంబన.
స్థానికతను దెబ్బతీసే ఏ చర్యా ఆమోదనీయం కాదు.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

'శాంతి వచనమ్' అనే ఖండికలో

"ఓ శాంతీ! ఎంతమెత్తని పేరు నీది –
నీ విలాసం పాతదే
అయినా నీతో సంధి చేసుకొనే సమయం కొత్తది.
అన్ని దేశాల్లోనూ, అన్ని ఫోటోల్లోనూ నెగ్గిన విశ్వసుందరివిగా"

అని ఛలోక్తి విసురుతారు.

పాలమూరు జిల్లాను వలసల జిల్లా అంటారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా, ఏ రోడ్డు వేసినా, పంట పొలాలకైనా పాలమూరు లేబరు తరలివెళ్ళవలసింది. వలస కూలీలుగా తూర్పు కోస్తాకు వెళ్ళిన పాలమూరు జాలర్లు కొందరు 1977 నాటి తుఫానులో చిక్కుకుని మరణించిన ఉదంతం ముకురాల రామారెడ్డి చేత 'పాలమూరు జాలరీ' అనే గొప్ప పాటను రాయించింది. ఆ పాట ఇది.

కూలి మస్తుగ దొరకుతాదని కోస్తదేశం పోతివా
ఎన్నడొస్తవు లేబరీ పాలమూరు జాలరీ
కోస్త బెస్తల పడవలల్లో కూలివయ్యిన కర్మమెందుకు ఎగువ కృష్ణా ఆనకట్టను ఇంతవరకు వేయనందుకు
ఏడ ఉంటివో లేబరీ ఎన్నడొస్తావు జాలరీ
గుర్తు తెలియని పీనుగులతో గోతి పాలైపోతివా!
ఎక్కడుంటివి లేబరీ – ఎన్నడొస్తవు మళ్ళెందుకొస్తవు జాలరీ

అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది తొలి అడుగు మోపేది పాలమూరు జిల్లాలోనే అయిన, ఈ పాట కాసేనాటికి కృష్ణానదిపై జూరాల ప్రాజెక్టు నిర్మితం కాలేదు. ఈ జిల్లాలో రెండు నదులు పారుతున్నా పాలకుల కుతంత్రాలవల్ల పాలమూరు జిల్లా వలసల జిల్లా అయిన దుస్థితిని ఈ పాటలో రాసి, కన్నీటి ఊటను ఉబికించినాడు ముకురాల.

అందుకే ప్రజల కష్టాలు చూసిన వాడు గానేకాక, స్వయంగా రైతుబిడ్డ అయిన ముకురాల 1969 నాటి తొలి తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ కవులందరూ సమైక్యాన్ని కోరినా, కాళోజి లాగా ప్రత్యేక తెలంగాణాను కోరుతూ కవితలు రాశాడు.

సమైక్య పాలనలో తెలంగాణవారికి నీటి పంపకంలో, ఉద్యోగ నియామకాలలోను జరుగుతున్న అన్యాయానికి, తెలంగాణ భాష, సంస్కృతిపట్ల అవహేళన, అపహాస్యం చూపుతున్న అన్నల ధోరణికి తీవ్రంగా స్పందించి ఎంతో ఆవేదనతో కవితలు రాశాడు.

కాళిదాసు రచించిన 'మేఘ సందేశం' కావ్యాన్ని ముకురాల 'మేఘదూత' అనే పేరుతో గేయానువాదం చేశారు. కావ్యం చివరి ముగింపులో కాళిదాసు మేఘానికి మార్పు తీసుకొనిరావడం జరిగింది. దశేంద్రియ జీవితంకాని 'మేఘం' సందేశాన్ని ఎట్లా తీసుకొనిపోతుంది అని ప్రశ్నించిన కాళిదాసు, చివరికి సందేశాన్ని తీసుకొనిపోయి చెప్పినట్లు రచించడం యుక్తంవాదని, పూర్వాకాలం కార్మికులు విమర్శించినందుకుగాను, రామారెడ్డి సహజమైన రీతిలో ముగించడానికి కొత్తగా సన్నివేశ కల్పన చేసినాడు. యక్షుని భార్య దీనావస్థను గురించి ఆనోటా ఆనోటా కుచేలుని భార్యకు అందంగా ఆమె భర్తతో చెప్పి యక్షుని శిక్ష తగ్గింపజేస్తుంది.

"మనుషులుండేదిదాక – గగన భాగాల మేఘాలు మెదలెడిదాక.
విరహవీణల మీటి వీనగవచ్చునది – కాళీదాసుని విధురకలత కావ్యమిది"

అని కాళిదాసుని ప్రశంసతో కావ్యాన్ని ముగిస్తాడు. ముకురాల 'పుట్ట గోచిలింగ పూలరంగ' అనే మకుటంతో హాస్యపూరితమైన, వ్యూహాత్మకమైన శతకం కూడా రాశారు.

మొత్తంమీద వీరి కవిత్వంలో ముకురప్రాయంగా కనిపించే ప్రధానలక్షణం వక్రోక్తి! సూటిగా దేన్ని చెప్పడు. తెనుగు నుడికారం. జాతీయాలు, తెలంగాణా పలుకుబడి భాష, ముఖ్యంగా పాలమూరు భాష ఆయన కవిత్వంలోని మౌలిక గుణాలు

ముకురాల ఎంతటి కవో అంతటి విమర్శకుడు, పరిశోధకుడు కూడా. వీరి సిద్ధాంత వ్యాసం "ప్రాచీనాంధ్ర కవిత – ఆదర్శాలు, పరిణామాలు" ఒక మౌలికమైన, ప్రామాణికమైన పరిశోధనా గ్రంథంగా గణితి కెక్కింది.

ముకురాల కొన్ని కథలు కూడా రాశారు. అవి 4,5 కథలకంటె మించవు. ముకురాల పుంఖాను పుంకంగా రచనలు చేయకపోయినా, రాసిన ప్రతి రచన ఒక పుత్తడి రచనే. ఆయన కలం ఎంత బలమైనదో, కంఠం కూడా కంచు కంఠం కావడంవల్ల కవిసమ్మేళనాలలో శ్రోతలను ఆకట్టుకొన్నాడు. వక్తగా కూడా రాణించినాడు.

ముకురాల రామారెడ్డి గారికి జరిగిన సన్మానాలలో ఆలిండియా రేడియో న్యూఢిల్లీ నుంచి జాతీయ కవిగా సన్మానం, ఆధునిక పరిశోధకుడిగా తెలుగు విశ్వవిద్యాలయం ప్రత్యేక సన్మానం, కవిరాజు సూతపురాణ వ్యాఖ్యను భారత ఉపరాష్ట్రపతి సన్మానం, పద్యకవితకు మధునాపంతుల అవార్డు ముఖ్యమైనవి.

తెలుగు అకాడమిలో ఉద్యోగిగా ఉంటూ తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవ కూడా ప్రస్తుతించదగినదే. ముఖ్యంగా 'పరిపాలన న్యాయపదకోశం' తయారీ వీరి ఆధ్వర్యంలోనే కొనసాగింది. 'తెలుగు సాహిత్య పదకోశాన్ని' మిరియాల రామకృష్ణగారితో కలిసి రచించారు. కార్యాలయ పదావళి, రెండో భాషగా తెలుగు బోధన కార్యక్రమాలు, వాచక రచనలు (తెలుగు), శబ్ద సంపద పరిశీలన మొదలైన ప్రాజెక్టులను ఎంతో దక్షతతో పర్యవేక్షించి, పని చేయించి తాము పనిచేస్తున్న సంస్థకు పేరుప్రతిష్ఠలను తెచ్చిన ఉన్నతోద్యోగి (వీరు మార్చి 3, 2003 నాడు కల్వకుర్తిలో మరణించినారు).

తెలంగాణ కావ్యాలలో ముకురాల రామారెడ్డిది బలమైన గొంతుక, విశిష్టమైన కవిత్వం. వినూత్నమైన పరిశోధన చేసిన పరిశోధకుడు.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

–డా॥ జి. చెన్నకేశవరెడ్డి

# కాలం చెక్కిలిపై కన్నీటి చుక్క

భారతదేశంలోని ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్, శాశ్వత ప్రేమ మరియు వాస్తు నైపుణ్యానికి చిహ్నం. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన ప్రియమైన భార్య ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థం నిర్మించిన తాజ్ మహల్, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం మరియు ఆధునిక ప్రపంచంలోని ఏడు వింతలలో ఒకటిగా ఉంది. దాని అందమైన సౌందర్యం, సంక్లిష్ట ఇన్‌లేలు (inlays) మరియు కొలతల్లో ఖచ్చితమైన నిష్పత్తులు దానిని ఒక ప్రముఖ సందర్శనీయ ప్రదేశంగా మార్చాయి.

తాను కట్టించిన తాజమహల్ గురించి షాజహాన్ రాసిన కవిత:

*"ఇక్కడ దోషి ఆశ్రయాన్ని ఆపేక్షిస్తాడు,*
*క్షమించబడిన వాడిలా, పాపం నుండి విముక్తి పొందుతాడు.*
*పాపి ఈ సౌధంలోకి ప్రవేశించాలని కోరుకుంటాడు,*
*అతని గత పాపాలన్నీ కడిగివేయబడతాయి.*
*ఈ సౌధం వీక్షణ ఒక విచార నిట్టూర్పుని సృష్టిస్తుంది,*
*సూర్య చంద్రులు తమ కన్నీటిని విడుస్తారు.*
*ఈ ప్రపంచంలో ఈ దివ్య కట్టడం నిర్మించబడింది.*
*ఇది సృష్టి కర్త యొక్క కీర్తిని ప్రదర్శిస్తుంది."*

తాజమహల్ నిర్మాత దృష్టిలో ఇదొక దివ్యసౌధం. సృష్టికర్త కీర్తి. సూర్య, చంద్రులే కన్నీరు విడిచే ఒక నిట్టూర్పు.

గుర్రం జాషువా కవి ఒక పద్యంలో... తాజ్ మహల్‌ను

*"ఏ వన్నె గల తీవకే పచ్చ నవరింప జెలువారునో దాని చిలికిజేసి*
*ఏ పుష్పదళమునకే పుష్యరాగంబు సరిపోవునో దాని సంఘటించి*
*ఏ కిసాలంబునకే కెంపు జోడింప కొమరారునో దాని కూర్చుజేసి*
*ఏ గులాబీ మొగ్గకే రవ్వ బొదిగింప నందగించునొ దాని నతుకబెట్టి*
*ప్రకృతిసిద్ధమైన వన్నెతో వన్నెకు*
*చెలిమి గలిపి భావముల నిమిడ్చి*
*చలువరాతి ఫలకములు దీర్పసాగిరి*
*చిత్ర చిత్ర గతుల శిల్పివరులు"* అని వర్ణించాడు...

అయితే మహాకవి శ్రీశ్రీ...

*"తాజ్ మహల్ నిర్మాణానికి*
*రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?"* అన్నాడు.

తాజ్ మహల్ కవులను, కళాకారులను, చరిత్రకారులను, కళాభిమానులను, ప్రేమికులను... అందరిని ఆకట్టుకుంది.

రవీంద్రనాథ్ ఠాగూర్ తాజ్ మహల్‌ను "కాలం చెక్కిలి మీద కన్నీటి చుక్క" అని వర్ణించాడు.

**తాజ్ మహల్ నిర్మాణ వివరాలు:**

**నిర్మాణ కాలం:** 1632 నుండి 1653 వరకు (22 సంవత్సరాలు) దాదాపు 20,000 మంది కార్మికులు మరియు 1,000 మంది కళాకారులు ఈ నిర్మాణంలో పాల్గొన్నారు.

**ఖర్చు:** అప్పటి రూపాయిలో 3.2 కోట్లు (ప్రస్తుతం దీని విలువ సుమారు 53 కోట్ల రూపాయలకు సమానం). ఇది కేవలం అంచనా మాత్రమే. ప్రపంచంలో ఏడవ వింతగా నిలిచిన ఈ అద్వితీయ కట్టడం యొక్క విలువ కట్టడం ఎవ్వరికీ సాధ్యంకాదు. ఈ అద్భుతనిర్మాణం 1983లో ప్రపంచవారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

**నిర్మాణ సామగ్రి:**

మార్బుల్ ఆగ్రా నుండి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజస్థాన్‌లోని మక్రానా నుండి వచ్చింది. మక్రానా తెల్లని పాల వంటి రంగుకల పాలరాయికి ప్రసిద్ధి.

ఆగ్రానుండి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న పతేపూర్ సిక్రీ ప్రాంతం నుంచి ఇసుకరాయి వచ్చింది. (Voysey 1825). దగ్గరలో ఉన్న రూపబాస్ తాంతపూర్ క్వారీల నుంచి వచ్చినరాయి కూడా వాడినట్లు (Balasubramaniam 2009).



ఇటుకలతో నిర్మించిన గోడలపై పాలరాయి అతికించబడింది. జాస్పర్ మరియు అనేక ఇతర విలువైన రాళ్లు ఈ నిర్మాణంలో ఉపయోగించబడ్డాయి.

**తాజ్ మహల్ ఆర్కిటెక్ట్:**

ఉస్తాద్-అహ్మద్ లహోరీ ప్రధాన ఆర్కిటెక్ట్. అతనితో పాటు ఎందరో గుర్తింపు పొందిన దేశీయ కళాకారులు కూడా శ్రమించి నిర్మించిన తాజ్ మహల్ ఆర్కిటెక్చర్ మొఘల్ వాస్తు నిర్మాణ శైలికి చెందినది. ఈ అద్భుతమైన నిర్మాణం యొక్క రూపకల్పనలో పర్షియన్, ఒట్టోమన్, భారతీయ మరియు ఇస్లామిక్ వాస్తు నిర్మాణ శైలుల ప్రభావం కనిపిస్తుంది.

ఇందులో కేంద్రకట్టడం చుట్టూ నాలుగు మినార్లు ఉన్నాయి. తాజ్ మహల్ గుమ్మటం అనేది ఒక అద్భుతమైన నిర్మాణం, ఇది 80 అడుగుల ఎత్తులో ఉంది. తాజ్ మహల్ మొత్తం విస్తీర్ణం 66.62 ఎకరాలు, పరిరక్షించబడిన ప్రధాన కట్టడం 42 ఎకరాలు. ప్రధాన కట్టడం యొక్క విస్తీర్ణం: 186 చదరపు మీటర్లు తాజ్ మహల్ ప్రధానద్వారం దక్షిణదిశలో ఉంది. ప్రధానకట్టడం తూర్పు-పడమర దిశలో ఉంది. నాలుగు మినార్లు ఉత్తర, దక్షిణ, తూర్పు మరియు పడమరదిశల్లో ఉన్నాయి.

**తాజ్ మహల్ పునాది:**

యమునా నది ఒడ్డున పెద్ద చతురస్రాకారపు గొయ్యితీసి, దానిని మట్టి కలప మెదలైన వాటితో నింపి, పటిష్టంగా తయారు చేశారు. ఆ తరువాత ఇసుకరాయిపలకల వరుస, దానిపై పాలరాతి పలకలు



పేర్చి నది ఒడ్డున 50 మీటర్ల ఎత్తులో దాదాపు 95 చదరపు మీటర్ల ఒక ప్లాట్ ఫాం ఏర్పాటు చేసి దానిపై ఏడు మీటర్లఎత్తుగల చతురస్రాకారపు దిమ్మపై ద్విపార్శ్వ సౌష్టవం కలిగిన ఈనిర్మాణం జరిగింది. తాజ్ మహల్ ముందు ఉన్న ఉద్యానవనంలో నాలుగు కాలువలు ఖురాన్‌లో ప్రస్తావించబడిన నాలుగు నదులకు (Rivers of Paradise) ప్రతీకగా నిర్మించినట్లు చారిత్రకారులు చెబుతున్నారు. (Begley 1979). తాజ్ మహల్ గోడలపై ముఖద్వారం మొదలైన వాటిపై లతలు పూల ఉల్బణ చిత్రాలు, పవిత్రగ్రంథంలోని వాక్యాల కాలిగ్రఫీ, రత్నాలు, రంగురాళ్ల పొదిగిన విస్తృతమైన అలంకారాలు "పియత్రా దురా" (Pietra Dura) మరియు "పర్చిన్ కారీ"అని పిలువబడే రాతి పనితనంతో అమర్చబడి ఉన్నాయి.

వీటితోపాటు షాజహాన్ కాలంలో అభివృద్ధి చెందిన "ఎనామిల్ పనితనం" కూడా ముంతాజ్. మహల్ సమాధి చుట్టూ ఏర్పాటు చేయడానికి తయారు చేయించిన బంగారు తెరలో కనిపిస్తుంది (బాలక్రిష్ణ 2001).

**పర్చిన్ కారి కళ:**

"పర్చిన్ కారి" వంశపారంపర్యంగా వచ్చే కళ ఇప్పటికీ ఈ ప్రక్రియ ద్వారా జీవనోపాధి పొందుతున్న కళాకారులు ఆగ్రాలో ఉన్నారు. ఇందులో ముందుగా పాలరాయిపై గోరింటాకుతో ఆకృతిని వేస్తారు. ఆ డిజైన్ ప్రకారం పాలరాయి ఉపరిభాగం కొంతమేరకు తొలగించి ఆ ఖాళీస్థలంలో సానబట్టిన రత్నాలు, రంగురాళ్ళు జాగ్రత్తగా నింపుతారు. ఇలాచేయటం వల్ల పాలరాయిలో రత్నం సరిగ్గా ఇమిడిపోయి అమర్చబడినట్లు కాకుండా పాలరాయిలో భాగంగా కనిపిస్తుంది. ఇలా పొదిగిన (inlay) విధానాన్ని "పర్చినకారి" అంటారు. ఈ విధంగా పొదిగిన అత్యంత సంక్లిష్ట డిజైన్లు తాజ్ మహల్‌లో కనిపిస్తాయి.

**పిట్రాడురా (Pietre dure):**

ఈ ప్రక్రియ మొదట గ్రీస్‌లో ప్రారంభమై తర్వాత ఇటలీలో వికసితం అయింది. ఇందులో నున్నని పాలరాతి ఉపరితలంపైన సానబట్టిన రత్నపు ముక్కలు, రంగురాళ్ల ముక్కలు ఒకపద్ధతిలో ఒక ప్రత్యేక సేంద్రియ జిగురుతో అమర్చడం ద్వారా పుష్పాలు ఉద్యానం లేదా వివిధ ఆకారాలు ఏర్పడుతాయి.

ఈ రకంగా రత్నాలు పొదిగిన డిజైన్లు తాజ్‌మహల్ కనిపిస్తాయి.

ఇస్లాం పవిత్ర గ్రంథం లోని వాక్యాల బ్లాక్ ఓనిక్స్ పొదుగులు (Inlays) తాజ్ మహల్‌లో కనిపిస్తాయి.

**తాజ్ మహల్‌లో ఉపయోగించిన రత్నాలు, రంగురాళ్లు:**

- యాకుత్ ఎ గులాబ్/గులాబ్ /గులాబీ రంగు నీలం/ శ్రీలంక నుంచి వచ్చింది.
- హ్‌జ్రత్ ఉల్ దమ్/పిటునియా/రక్తశిల/ blood stone/ భారతదేశంలో దొరికింది.
- రుక్మా / Alabaster/ పాలరాయి మక్రానా నుంచి వచ్చింది.
- యాఖూత్ /Amethyst/ కటెల్లా/ జంబుమణి, ఇది భారతదేశంలో ఉంది. మాల్వా నుంచికూడా వచ్చింది.
- నీల్గన్ బిల్లోర్ /Aquamarine/జలనీలం భారతదేశం, శ్రీలంక నుంచి వచ్చింది.
- మర్మరే సియా/నలుపు రంగు పాలరాయి, ఇది భారతదేశంలో ఉంది.
- అకీక్ ఎ జగారి/కార్నేలియన్ భారత దేశంలో ఉంది, యెమెన్ దేశం నుంచి కూడా వచ్చింది.
- సంగ్ ఎ యెమెనీ /Chalcedony భారతదేశంలో ఉంది.
- జైతూని జబర్ జాద్/ Chrysolite/ చైతన్యరత్నం, ఇది నైలు నది ప్రాంతం లోనుంచి వచ్చింది.
- సదఫ్ హలజోని/Conch shell/ శంఖం మున్నార్, పర్షియన్ గల్ఫ్ నుంచి వచ్చింది.
- మర్జాన్ ఎ సార్ Red coral పగడం భారత దేశంలో ఉంది.
- బోలూర్ Crystal quartz/ స్ఫటికం భారతదేశంలో హైదరాబాద్ ప్రాంతం నుంచి వచ్చింది.
- అల్మాస్ Diamond ఇది గోల్కొండ ప్రాంతం నుంచి వచ్చింది.
- జమ్రోద్ Emerald పన్నా / పచ్చ, ఇది దక్షిణ అమెరికా మరియు ఈజిప్టుల నుంచి వచ్చింది.
- లాల్/ Garnet /గోమేధికం గంగానది ప్రాంతం నుంచి వచ్చింది.
- సంగ్ ఎ తలై Golden stone/ golden topaz or citrine భారతదేశంలో ఉంది.
- దాల్చీనీ యాఖూత్ /Hessonite Garnet/ గోమేధికం శ్రీలంక నుంచి వచ్చింది.
- యష్మ్ /Jasper/జటిలం/ పుష్ప రాగం భారతదేశంలో కాంబే ప్రాంతం నుంచి వచ్చింది.
- లాజ్వార్ద్ / Lapis lajuri / రాజావర్తం అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చింది.
- అహన్ రోబా/ Loadstone/మకాంటిస్/చుంబక శిల ఇది భారత దేశంలో గ్వాలియర్ ప్రాంతం నుంచి వచ్చింది.
- మలక్వీట్ / malachite/మార్క్షికం/ ధనేఫరాంగ్ ఇది రష్యా నుండి వచ్చింది.
- సదఫ్ మొర్వారిడీ/mother of pearl/ముత్యపు చిప్ప పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ మున్నార్ నుంచి వచ్చింది.






- నఫరైట్/Nephrite/ వ్యోమశిల చైనా మరియు తుర్కిస్తాన్ల నుండి వచ్చింది.
- మోర్వరిడ్/ దుర్/pearl / ముత్యం, పర్షియన్ గల్ఫ్ మున్నార్ నుంచి వచ్చింది.
- సంగ్ ఎ సురా/Red stone/ సురా భారతదేశంలోని గ్వాలియర్ ప్రాంతం నుంచి వచ్చింది.
- యాఖుత్ /Ruby/మాణిక్య మయాన్మార్, అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చింది.
- యాఖుత్ ఎ కబుడ్/Sapphire/నీలం భారతదేశం తోపాటు మయాన్మార్ మరియు శ్రీలంకనుంచి వచ్చింది. భారత దేశంలో ఉంది.
- సంగ్ ఎ లూహ్ /Slate/ అభ్రశిల అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చింది.
- హజ్ర్ ఎ అబ్రక్/Sodalite/ ఆకాశమణి అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చింది.
- చషమ్ ఎ బాబరీ/Tiger eye/ వ్యాఘ్ర నయనం భారతదేశంలో ఉంది.
- జబర్ జాద్ ఎ హెండీ /Topaz/ పుష్యరాగం శ్రీలంక నుంచి వచ్చింది.
- ఫిరోజా/Turquoise/ పర్షియా మరియు టిబెట్ నుంచి వచ్చింది.

ఈ పర్షియన్/ అరబిక్ భాషలో ఉన్న పేర్లకు సమానమైన ఖనిజ పరమైన పదం దొరకదు. అందువల్ల కొన్ని పదాలు మళ్ళీ మళ్ళీ వాడబడ్డాయి.

ఈ నిర్మాణంలో ఉపయోగించిన రత్నాలు వాటి రంగును బట్టి, వాటికి ఆపాదించిన దివ్య శక్తులను బట్టి ఎన్నిక చేయడం జరిగింది. పర్చన్కారీలో ఎక్కువగా వాడబడిన కార్నేలియన్ (రక్తశిల) ముస్లింలు శుభసూచకంగా భావిస్తారు. ప్రవక్త తన కుడిచేతి చిటికెన వేలుపై వెండి ఉంగరంలో ధరించేవారు అంటారు. మరియు దానిని ముద్రగా ఉపయోగించినట్లు చెబుతున్నారు. ఈ ఉంగరం ధరించడం వల్ల కోరికలు తీరుతాయని ఇమాం జాఫర్ అన్నట్లు కుంజ్ (Kunz 1938) వల్ల తెలుస్తోంది.

జేడ్ మరియు క్లోరైట్ (వ్యోమశిల/హరితమణి/పచ్చపర్వతం) ప్రవక్తకు ఇష్టమైన రంగుగా బ్రిల్ (Brill 1933) అభిప్రాయం. జేడ్ కు జబ్బులు నయం చేసే గుణాలు ఉన్నాయి అని నమ్మకం.

లాపిస్ లాజురి (రాజావర్తం) కూడా చాలా శుభప్రదం అనే నమ్మకం ఉంది (Thomas and Pavitta 1993).

మెసొపొటేమియా నాగరికతలో జాస్పర్ (పుష్ప రాగం/ జటిలం)ను ఒక దివ్యమణిగా భావిస్తారు. ఇది దుష్టశక్తులను పారద్రోలుతుందని విశ్వాసం ఉంది (Horovitz 1998).

చాల్సిడోని (శుక్తిరత్నం) శత్రువులను భయపడేలా చేయడమే కాక ప్రశాంతత చేకూరుతుంది (Budge 1968) అని నమ్మకం.

ఫలాలకు వాడిన ఎరుపు రాయి మృత్యువుకు సూచనగా పసుపురంగు పునరుజ్జీవంకు సూచించేదిగా వాడినట్లు తెలుస్తోంది.

కొన్ని రకాల రంగురాళ్ళు కేవలం వాటి అందం కారణంగా పర్చినకారిలో ఉపయోగించటం జరిగిందని అంచనా.

దాదాపు 40 రకాల రత్నాలు, రంగు రాళ్ళు, పర్చినకారిలో ఉపయోగించటం జరిగినట్లు (Voysey 1825) అభిప్రాయం.

**పర్యాటక దర్శనీయం తాజమహల్:**

అందాల తాజ్ మహల్ పరిరక్షణకు అవసరమైన కృషి జరుగుతోంది. ప్రతిదినం 40వేల మంది, ఏటా 14 లక్షల మంది పర్యాటకులు తాజ్ మహలును చూడటానికి వస్తారు. ఈ అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకుల వల్ల కూడా కొన్నిసమస్యలు వస్తాయి. దీనికితోడు పర్యావరణ కాలుష్యం వల్ల తెల్లని రాయి కాస్తా పసుపు రంగులోకి మారి అందవిహీనంగా తయారవుతుంది.

పూర్వం ఇక్కడ సెక్యూరిటీ సరిగా లేకపోవడంవల్ల కొన్ని విలువైన అలంకరణలు చౌర్యానికి గురియైనట్లు చెబుతున్నారు.

ప్రస్తుతం ఆర్కియాలజికల్ సర్వే వారు సంరక్షణ చర్యలు చేపట్టారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1996 తాజ్ మహల్ నుండి చుట్టూ ఉన్న 10400 చదరపు కిలోమీటర్ల పరిధిలో తాజ్ ట్రెపీజియం జోన్‌గా ప్రకటించి అక్కడ పరిశ్రమలను వేరేచోటికి తరలించడం జరిగింది. వాయుకాలుష్యం అరికట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. తాజ్ మహల్ చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. తాజ్ మహలు పరిసరాల్లో పాదరక్షలకు అనుమతి లేదు.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

ద

# సకల సంతోషాల సంక్రాంతి

తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రీతికరమైన పండుగ. సంవత్సరకాలంలో సూర్యుడు 12 రాశులలో నెలకు ఒక రాశి చొప్పున సంచరిస్తాడని ఖగోళశాస్త్రం చెబుతోంది. ఇలా సంచరించే సమయాన సూర్యుడు ఆంగ్ల సంవత్సరం జనవరి వచ్చేసరికి ధనూ రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతి అంటారు. ఇది పవిత్రమైన కాలంగా ప్రజలు భావిస్తారు. ఎందుకంటే మనకున్న రెండు అయనాల్లో సూర్యుడు దక్షిణాయన కాలం ముగించుకొని ఉత్తరాయణ కాలంలోకి ప్రవేశిస్తాడు. ఇది సంక్రాంతి రోజునే ప్రారంభమౌతుంది. కనుక ఇది ఉత్తరాయణ పుణ్యకాలం అని పెద్దలు నిర్ణయించారు. అందుకనే మహాభారత యుద్ధంలో భీష్ముడు అంపశయ్యపైన్నే ఉండి ఈ ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిన తర్వాతనే నిర్యాణం చెంది కైవల్యప్రాప్తిని పొందాడని చెబుతారు.

### సంక్రాంతి పండుగ క్రమం

సంక్రాంతి పండుగ అనగానే అందరికి గుర్తుకు వచ్చేది రంగవల్లుల ముత్యాల ముగ్గులు. హరిదాసుల కృష్ణార్పణం సంకీర్తనలు. ఈ పండుగను పెద్దపండుగ అని కూడా అంటారు. ఇది పుష్యమాసం (జనవరి)లో వస్తుంది. ఈ సమయంలో రైతులు ఇళ్లకు ధన, ధాన్యరాశులు చేరుతాయి. ప్రజలు పాడి పంటలతో, సుఖశాంతులతో ఉంటారు. ఈ సమయంలో వచ్చే సంక్రాంతి పండుగను వరుసగా మూడు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజు "కామభోగి", రెండోరోజు "సంక్రాంతి", మూడోరోజు "కనుమ" (పశువుల పండుగ), కొందరు నాలుగోరోజును "ముక్కనుము"గా జరుపుకుంటారు.



### మొదటిరోజు భోగి

గ్రామాల్లో తెల్లవారుజామునే నాలుగు రోడ్లకూడలిలో భోగిమంటలు వేస్తారు. గ్రామ, ఇంటి అరిష్టాలు, రోగ, పీడలు తొలిగిపోవడానికి మంటలను కాస్తారు. అలాగే ఇళ్లలో బొమ్మల కొలువులు, చిన్న పిల్లలకు భోగిపళ్లు పోయడం, దిష్టి తీయడం వంటి ఆచారాలు చేస్తారు.

### రెండో రోజు సంక్రాంతి

పంటలు చేతికి రావడంతో ఇళ్లలో ఉన్న పంటల ధాన్యరాసులను చూసుకొని రైతులు మురిసిపోతుంటారు. సనాతన సంస్కృతిలో సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. నెల రోజుల నుంచే ఈ పండుగ హడావుడి మొదలవుతుంది. దీన్ని నెల పట్టడం అంటారు. ధనుర్మాసం ప్రారంభమయ్యేది అప్పుడే. సంక్రాంతి నెల పట్టిన దగ్గర్నుంచి అంటే డిసెంబర్ 14, 15వ తేదీ దగ్గర నుంచి గ్రామాల్లో, పట్టణాల్లో రంగవల్లులు, పండుగ సందడి ఊపందుకుంటుంది. గృహలక్ష్ములు వేకువజామునే లేచి తమ ఇంటి వాకిళ్లను శుభ్రంగా ఊడ్చి, కళ్లాపి జల్లి ఆపై ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెడతారు. ఇక హరిదాసుల నగర సంకీర్తనలు ప్రజల్ని భగవంతుడిపై భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్తాయి. గంగిరెద్దుల వారి సన్నాయి మేళాలు, కొమ్ము దాసరులు, జంగమదేవరలు, బుడబుక్కల వారు తమ కళా రూపాలతో సంక్రాంతి పండుగకు గ్రామ గ్రామాన అలరిస్తూ శోభాయమానం కలిగిస్తూ వినోదాన్ని పంచుతారు. ఎడ్ల పందాలు, బరువులాగుడు పందాలు, కోడి పందాలు, కబడ్డీ క్రీడలు, పతంగులు ఎగరేయుడాలు, గుండాటలతో గ్రామాలను సంబరాల్లో ముంచెత్తు తారు. ప్రతీ ఇంటి ముంగిట విభిన్న రీతుల్లో పెట్టిన ముగ్గుల మధ్యలో గొబ్బిళ్లను అలంకరిస్తారు. వాటిని ఆవుపేడతో చేసి వాటిపై గుమ్మడి, బంతి, చేమంతి తంగేడు వంటి పూలను ఉంచి అలాగే నవ ధాన్యాలను పోసి పూజలు చేస్తారు. నెలరోజులపాటు ఇంటి ముందు రంగుల ముగ్గులు వేసి చివరి రోజు "రథం ముగ్గు" వేస్తారు. కార్తీకమాసం మొదలుకొని సంక్రాంతి పూర్తయ్యే వరకు రహదారులన్నీ రంగుల ముగ్గులతో నిండి సంక్రాంతి శోభను విరాజింపజేస్తాయి.

### కనుమ పండుగ

కనుమ పండుగను మూడోరోజు జరుపుకుంటారు. కనుమ అంటే పశువు అని అర్థం. ప్రధానంగా పశువులను ఆరాధించే రోజు. హిందువుల సనాతన ధర్మంలో గోవులను పూజిస్తున్న నేపథ్యంలో ఏరువాకతో జీవనాధారమైన గోవుల సంతతి అయిన పశువులను పూజించడం ఆచారం. ఈ నేపథ్యంలో కనుమ రోజు పశువులు ఉండే పాకలను శుభ్రం చేస్తారు. పశువులను గ్రామంలోని చెరువులో శుభ్రంగా కడుగుతారు. అనంతరం వాటి కొమ్ములకు పసుపు, కుంకుమలు రాసి, నొసట బొట్టు పెట్టి అందమైన బంతిపూలతో అలంకరించి ఆరాధిస్తారు.

– దక్కన్‌న్యూస్,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# ప్రత్యేక తెలంగాణా కోసం మట్టి మనుషుల పాదయాత్ర

(ఈ నెలలో 18 సం॥లు పూర్తి అయిన సందర్భంగా)

తల్లి తెలంగాణా విముక్తి కోసం భూమి పుత్రుల పాదయాత్ర – నేల తల్లి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం మట్టి మనుష్యుల జైత్రయాత్ర, నడక, నడుస్తున్న చరిత్ర. మా కాళ్ల మీద మేం నడుస్తున్నాం. మా నేల మీద మేం నడుస్తున్నాం. మేం ముందుకు ముమ్ముందుకే నడుస్తాం. ప్రపంచం మా వెంట నడుస్తుంది. నడక, నడక, నడక మా నేస్తం. కంటికి దూరమైతే కాలికి దూరమా? చుట్టు ముట్టు సూర్యాపేట నట్టనడుమ నల్లగొండ, ఆ పైన హైద్రాబాదు అందులో గోలుకొండ – గోలుకొండ ఖిల్లా క్రింద ఆంధ్రుల నయా వలస వాదాన్ని బొంద పెట్టడానికే లాంగ్‌మార్చ్ – పాలేరు వాగు వంతెన మీద నుండి నాంపల్లి బాగే ఆం ఎదురుంగ ఉన్న అమరవీరుల స్థూపం దాకా. ఆ అమరవీరుల ఆత్మల్ని విముక్తం చేసి, వారు కన్న కలలను నిజం చేసే దాకా. మట్టి మనుషుల పాదయాత్ర.



“భూమి కోసమే నడు
భుక్తి కోసమే నడు
విముక్తి కోసమే నడు
బయం గియం విడునడు”

2007 నూతన సంవత్సరం ప్రారంభదినం. ఉదయం పది గంటలు. నల్లగొండ జిల్లా కోదాడ మండలం దగ్గరిలోని నల్లబండ్ల గూడెం గ్రామానికి ఆనుకుని ఉన్న పాలేరు వాగు మీది వంతెన. చరిత్రకు సాక్షీభూమైన వంతెన. మౌనమునిలా కాలాన్ని పరిశీలించే వంతెన. ఆంధ్రా సరిహద్దును దాటి తెలంగాణాకు ముఖద్వారం మాదిరిగానిలిచిన అతి పురాతనమైన వంతెన. కాలానికి కట్టిన కత్తుల వంతెన. నెత్తుటి వంతెన. ఆ రోజు అక్కడి జాతీయ రహదారి నంబర్ నైన్ మట్టి మనుషుల పాదముద్రలతో పులకించి పోయింది. పరవశించి పోయింది.

భాజా భజంత్రీలు, మేళ తాళాలు, తెలంగాణా నినాదాలు, బ్యానర్లు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు మరికొన్ని గులాబీ కండువాలు ఆ మట్టి మనుషులతో కలిసి కదం కదం కలిపి, భుజం భుజం కలిపి తెలంగాణా ఐక్యతను చాటటానికి అక్కడ గుమికూడినారు. సరిహద్దుకు అటు ఇటు ట్రాఫిక్‌జాం. రెండు వైపులా ‘ముసాఫిర్లు’ అక్కడ ఏం జరుగుతుందో అని కుతూహలంతో చూస్తున్నారు. అదొక “లగాన్” టీం. తమ రక్తంతో చెమటతో భూమిని దుక్కిదున్ని ఆరుగాలం కాయకష్టం చేసి “రాజనాలు”పండించే రైతు బిడ్డల టీం. గోసి గొంగడి గాళ్ల దళం. “కఫన్” మాదిరిగా తలలకు చుట్టుకున్న తలపాగాలు భుజాలకు వ్రేలాడే జోలె సంచులు. పాదాలకు కిర్రు చెప్పులు, ఆకు చెప్పులు, చేతి కర్రలకు “జై తెలంగాణ” నినాదాలున్న శ్వేత కేతాలు. ఎవరు వారు? ఎచటివారు? ఎచట నుండి ఇటు కొచ్చినారు?

ఆ పాదయాత్రకు, సారథ్యం వహిస్తున్నది వేనేపల్లి పాండురంగారావు. మిరియాలగూడెం మండలంలోని “అలగడప” గ్రామం మాజీ సర్పంచ్. అతను ఏం చేసినా తనదంటూ ఒక సొంత ముద్ర ఒక ప్రత్యేకత ఉంటుంది. అందులో ఒక భాగమే “పాలేరు వాగు నుండి మూసీ నది దాకా” నడుస్తున్న జనయాత్ర, జైత్రయాత్ర.

ఇక ఆయనను అనుసరిస్తున్నది సుమారు 60, 70 మంది భూమి పుత్రులు. ఆలగడప వారు మరియు దాని చుట్టుప్రక్కల వారు. ఆ బృందంలో అతి పెద్ద వయసున్న వాడు షేక్ జాన్. 75 సం॥లు ఉన్నా నడకలో మాత్రం నవయువకుడు. ఆలగడప గ్రామానికి మస్కూరిగా పనిచేశాడు. అతి చిన్న వయస్సున్న పిల్లగాడు క్రాంతికుమార్ 17 సం॥రాల నునూగు మీసాల ప్రాయం. “మోతె” గ్రామం నివాసి. 5వ తరగతి వరకు చదువుకొని “హాలికుడుగా” మారాడు.

అయితే అంశుల స్వామిది మాత్రం మరో విషాద గాథ. చక్రాల కుర్చీలోనే పాదయాత్రను అనుసరిస్తున్న అతను “ఫ్లోరోసిస్” బాధితుడు. ప్రక్కనే కృష్ణానది పరివాహక ప్రాంతమున్నా త్రాగే నీటికి నోచుకోక కలుషిత జలాల్ని తాగి కుంచించుకొని పోయిన దేహంతో జీవచ్ఛవంలా బ్రతుకీడుస్తున్న వంచితుడతను. ఐదేళ్ళ పిల్లవాడిలాగ కనబడుతున్న 35 సంవత్సరాల యువకుడతను. నడవటం కాదు కదా సరిగ్గా నేల మీదనే కూచోలేని దీన పరిస్థితి అతనిది. పడుకొనే అన్నం తింటాడు. అన్ని పనులు పడుకునే. ఎవరి నిర్లక్ష్యపు ఫలితమిది? అని పెద్ద పెద్ద మూగ కండ్లతో మనల్ని ప్రశ్నిస్తుంటాడు. “ఈ సర్కారు పాలనలో

మన్నుబడ" అని చూపులతోనే శపిస్తుంటాడు.

అతని ప్రక్కనే దుశ్చర్ల సత్యనారాయణ. జల సాధన సమితి నేత. విఫలమైన తెలంగాణా "భగీరథుడు". బిల్కుల్ పైదల్ ఆద్మీలాగ జీబురు గడ్డంతో పిచ్చి పిచ్చిగా పెరిగిన జుట్టుతో తెలంగాణ మీద తప్ప తన మీద తనకే సోయి లేకుండా ఊడిపోయిన ఒక పన్నుతో, వెలుగుతున్న కండ్లతో ముఖమంతా చిరునవ్వులతో ఒక యోగిలా కనబడ్డాడు. అప్పుడెప్పుడో ఐదేండ్ల క్రితమే నెలకు 30 వేల రూపాయల బ్యాంకు ఉద్యోగం వొదులుకొని క్రిష్ణమ్మ జీవజలాల్ని నల్లగొండకు మళ్లించి ఫ్లోరోసిస్ భూతాన్ని ఓడించాలని భంగపడ్డ భగీరథుడతను. "హర్‌దర్ద్‌కా దవా జిందాతిలిస్మాత్" అన్నట్లు అన్ని సమస్యలకు పరిష్కారం "తెలంగాణా" అని యుద్ధ రంగంలోకి దూకిన క్షత్రగాత్ర సైనికుడతను. వేయి యుద్ధముల ఆరితేరిన యోధుడతను.

పాలేరు వంతెన కాడ పాండురంగారావు ఉపన్యాసంతో పాదయాత్ర ప్రారంభమైంది. అది మామూలు ఉపన్యాసం కాదు. మూడు తరాల తెలంగాణా ప్రజల ఆత్మఘోష. సకల విధాల దోపిడీలకు, అన్యాయాలకు గురైన జీవుల వేదన.

"యాభై అరవై సంవత్సరాల క్రింద మీరు ఖాళీ చేతులతో కట్టు బట్టలతో కల్లబొల్లి కబుర్లతోఈ వంతెనను దాటి మా తెలంగాణా లోపలికి వచ్చారు. ఆ తర్వాత ఈ రోజు వరకూ ఈ వంతెన పై నుండే మీరు మా సిరిసంపదలను, భోగభాగ్యాలను మీ ఆంధ్రా ప్రాంతానికి తరలించుకు పోయారు. దానికి ఈ వంతెననే మూగసాక్షి. దాని క్రింద నుండి ప్రవహించేవి నీళ్లుకాదు, మా తెలంగాణా ప్రజలకన్నీళ్లు. మాకన్నీళ్ళ వల్లనే మీ సముద్రంలో ఉన్న నీళ్లన్నీ ఉప్పుగా మారినాయి" అని వేనేపల్లి తన గుండె గొంతుకతో ఘోషిస్తుంటే ఆ ఉపన్యాసం వింటున్న వారి కండ్లల్లో కన్నీళ్లు గుబగుబమని పొంగుకొచ్చాయి. ఆవేశంతో పిడికిళ్లు బిగుసుకున్నాయి. "జై తెలంగాణా" నినాదాలతో మిన్నూ మన్నూ ఏకం అయినాయి.

పాదయాత్ర నల్లబండ్లగూడెం దాటి కోదాడకు చేరుకుంది. ప్రతి రోజు 20-25 కిలోమీటర్ల చొప్పున పది రోజులలో హైద్రాబాదు చేరుకోవాలని వారి ఆలోచన. సడక్ మీద కలిసిన ప్రతి ఒక్కరికి తమ పాదయాత్ర లక్ష్యానికి సంబంధించిన కరపత్రాలను పంచుతున్నారు. ప్రతి చిన్నా, పెద్ద గ్రామంలో నలుగురు కూడిన కాడ తెలంగాణా ఎందుకు కావాలో చిన్న చిన్న ఉపన్యాసాలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు. "రోడ్లకు మా నమస్కారం" అంటూ ఆ మట్టి మనుషుల పాదాలు చందన చర్చిత చల్లని ధూళి పరిమళాలతో పాదప్రక్షాళనం చేసుకుంటున్నాయి. తెలంగాణా కోసం ప్రార్థించే పాదాలు వారివి.

"బాటలు నడిచి పేటలు దాటి" అన్నట్లు 3వ తారీకున ఆ పాదయాత్ర సూర్యాపేట చేరుకుంది. అట్ల 3 తారీఖున ఆ పాదయాత్రీకులకు ఘనంగా స్వాగతం పలుకుతూ సూర్యాపేటలో "తెలంగాణ విద్యావంతుల వేదిక వారు" ఒక సభను ఏర్పాటు చేశారు. అందులో కోదండరాం, విద్యావంతుల వేదిక అధ్యక్షులు ప్రసంగించారు. ఆ రాత్రి అక్కడ నిద్రచేసి తెల్లారంగానే మళ్లీ "తెలంగాణా కారవాన్" నకిరేకల్ వైపు పురోగమించింది. తోవ పొడుగునా వారిచ్చిన నినాదాలు సాదా సీదా నినాదాలే. సామాన్యులకు కూడా తెలంగాణా పోరాటం ఎందుకు జరుగుతుందో బోధ పడేటట్టు!

మా భూములు మాకు గావాలె
మా నీళ్లు మాకు గావాలె
మా కరెంటు మాకు గావాలె
మా బొగ్గు మాకు గావాలె
మా చదువులు మాకు గావాలె
మా ఉద్యోగాలు మాకు గావాలె

గుండె గోడల్లోకి చొచ్చుకొని పోయే ఈ సులభమైన నినాదాలు "రామనామ తారక మంత్రం" లాగా గ్రామీణులపై పనిచేశాయి.

అదే పాండు రంగారావు ప్రత్యేకత. ఏ విషయంలోనూ నేలవిడిచి సాము చేయటం అతనికిష్టం ఉండదు.

వేనేపల్లి జనం ముందు నిలబడి పోటోలకు ఫోజులిచ్చే నాయకుడు కాదు. తెరవెనుక మనిషి జనం వెనుక మనిషి కావుననే ఆయన ఆ మట్టి మనుషులు ముందు నడుస్తుంటే వారి వెనుక నడుస్తున్నాడు. ఆ దృశ్యం చూసే సరికి నాకు చర్చిలో కిరస్తానీ సోదరులు పాడుకునే పాట జ్ఞాపకం వచ్చింది.

"చిన్న గొర్రె పిల్లలము ఏసయ్యా
మెల్ల మెల్లగా నడుపు ఏసయ్యా"

ఆ సాయంత్రం పానుగల్లు దేవాలయం దగ్గర ఆ మట్టి మనుషుల పాదయాత్రకు భాజా భజంత్రీలతో, మేళ తాళాలతో చెవులు గింగురుమనే నినాదాలతో, ఒడలు పులకరించే పాటలతో ఘనంగా ఎదుర్కొళ్ళు జరిగినాయి. నల్లగొండ పట్టణానికి సంబంధించిన కవులు, కళాకారులు, రచయితలు, మేధావులంతా అందులో పాల్గొని వారిని సాదరంగా పట్నంలోకి ఆహ్వానించారు. ఆ ఊరేగింపుతో నల్లగొండ పట్నంలోని పురవీధులన్నీ పులకరించిపోయాయి. తర్వాత ఎన్‌బిఆర్ ఫంక్షన్‌హాలులో బహిరంగ సభ జరిగింది. దుర్గాబాయి ఆహ్వానం పలికి వేదికపై అతిథులను పిలిచింది. తెలంగానా రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి వేణు సంకోజు ఆ సభకు అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో "మట్టి మనుషుల పాదయాత్రీకులకు పేరు పేరునా పాద నమస్కారం చేస్తున్నాను" అని ప్రకటించగానే సభయావత్తు కరతాళధ్వనులతో మారుమోగింది. జై తెలంగాణ నినాదాలు ఆకాశాన్ని అంటినాయి. చాలా మంది ఉత్తేజంగా ప్రసంగించినారు. ముగింపులో పాండు రంగారావు, హృదయాలు ద్రవించి, మనుసులు ఆర్ద్రమయే రీతిలో ఉపన్యాసమిచ్చినాడు.

ఏడవ తారీఖు సాయంత్రం చిట్యాలలో ఒక బహిరంగసభ జరిగింది. "ఈచ్ వన్ టీచ్ వన్" లాగా ప్రచారం సాగింది. చౌటుప్పల్, కొయ్యలగూడెం, కొత్తగూడెం, భూదాన్‌పోచంపల్లి, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ దాటి "మట్టి మనుషులు యల్.బి.నగర్ చౌరస్తా దగ్గర పదో తారీఖు ఉదయాన పది గంటలకు నగర ప్రవేశం చేశారు.

పట్నమొల్లు పల్లెటూరు రైతుబిడ్డలకు "తమదైన పద్ధతిలోనే "వెల్‌కం" చెప్పారు. ఏమైతేనేం నగరంపై మట్టిమనుషుల "ముట్టడి" ప్రారంభమైంది. "లగాన్ టీం" దండయాత్ర నగరవీధులలో కదంతొక్కి మార్చ్ చేసింది. గోసి గొంగడి మనుషుల తలలకు చింపుల పేగుల తలపాగాలు. వడివడిగా నడిచే ఆ కిర్రు చెప్పులు, భుజాలకు వ్రేలాడే జోలెసంచులు, 'జైతెలంగాణా' శ్వేత కేతాలను ఎగురవేసే చేతి ఊతకర్రలు

నగరవాసుల దృష్టిని ఆకర్షించాయి. చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలు అడ్డుదొలిగి పక్కపక్కలకు వొదిగి వారికి దారినిచ్చి వారిని గౌరవించాయి. ఆ నినాదాలలో దాగిన వారి గుండె చప్పుళ్ళను జాగ్రత్తగా విన్నాయి. వారు పంచిన కరపత్రాలను చదివి అర్థం చేసుకున్నాయి.

ముస్లిం సోదరులు మలక్‌పేటలోని ఆజం ఫంక్షన్‌హాల్‌లో వారందరికి భోజనాలు ఏర్పాటుచేసి తెలంగాణా పట్ల తమ సంఘీభావాన్ని తెలియజేశారు. నగర జన నీరాజనాలను అందుకొంటూ పాదయాత్ర సాయంత్రం మూడుగంటలకు బాగేఆం ఎదురుంగ ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుంది.

అలగడప తదితర గ్రామాల నుండి బయలుదేరిన "మట్టి మనుషులు" అమరవీరుల స్థూపానికి పూలదండలు వేసి ఒక్కనిమిషం వారికి శ్రద్ధాంజలి ఘటించారు. పిమ్మట "అమరవీరుల ఆశయాలను సాధిస్తాం. సాధిస్తాం." అని ప్రతిజ్ఞలు చేశారు. అక్కడ గుమికూడిన ప్రజలంతా వారితో గొంతు కలిపారు. ఆ తర్వాత చరిత్రను లిఖించే అద్భుత క్షణాలు" ప్రారంభమైనాయి. ఆ మట్టి మనుషులు తమ వెంట ఒక సంచిలో "అలగడప నేల మీద మట్టిని" తెచ్చారు. వేనేపల్లి ఆ మట్టి సంచిని అందరికీ చూపిస్తూ "ఈ మట్టి నా పూర్వికుల మట్టి. చెమట, రక్తం, కన్నీళ్ళతో తడిసిన మట్టి. ఈ మట్టిలోనే వారంతా పుట్టి పెరిగి తిరిగి ఈ మట్టిలోనే మట్టిగా మారినారు. మట్టిని ఆంధ్రుల వలసవాద పరిపాలన నుండి విముక్తి చేస్తాం. ఈ మట్టికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తాం. రాబోయే తరాల వాళ్ళందరూ ఈ మట్టిలో సుఖశాంతులతో జీవించాలి. వర్ధిల్లాలి" అంటూ ఉద్వేగంగా ప్రసంగిస్తూ సంచిలోని ఆ మట్టిని తన గుప్పిళ్లతో తీసుకొని తన నడినెత్తి మీద పోసుకుంటుంటే ఆ మట్టిని తన ముఖానికి అద్దుకుంటుంటే అందరి కండ్లలో కన్నీటి ఊటలు ఉబికినాయి. గుండెలు గుబగుబలాడినాయి.




ఆయన ఇంకా ప్రసంగిస్తూ "మా పాదముద్రలలో మొత్తం మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల అడుగుజాడలు ఉన్నాయి. వారందరూ మా వెంట ఉన్నట్లే. ఒక వేళ ఢిల్లీ పీఠం వారు తెలంగాణా ఇవ్వకపోతే తెలంగాణా అన్ని దిక్కుల నుండి ఇటువంటి పాదయాత్రలెన్నో బయలుదేరి ఈ నగరాన్ని ముట్టడిస్తాం. అష్టదిగ్బంధనం చేస్తాం. తెలంగాణాను మేం సాధించుకుంటాం.

ఈ స్వామి అంశులస్వామి. నల్లగొండ జిల్లాను ఫ్లోరోసిస్‌నుండి విముక్తం చేయటానికే మేము తెలంగాణాను విముక్తికిప్రయత్నిస్తున్నాం. మాకు నీల్లు కావాలె. ఇక భవిష్యత్తులో మా పిల్లలెవరూ ఇట్లా కావొద్దు.

వేనేపల్లి పాండురంగారావు తన "రాగాలాపన చేస్తుంటే అతని మాట మంత్రంగా మారి శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. తెలంగాణా ఆశయానికి అందరినీ కట్టిపడేసింది. అంకితం చేసింది.

అమరవీరుల స్థూపం దగ్గర అలగడప మాజీ మస్కూరి 75 సంవత్సరాల జాన్‌ను "ఏం తాతా ఎట్లుంది యాత్ర" అని పలుకరించంగనే గొంతులో గురగురలతో "పెద్ద దొరలు రానిచ్చేటట్లులేరు నాయనా అయినా మేము నడుస్తనే ఉంటం. దీని అంతు చూసేదాకా. ఈ రోడ్డు మీద నా తనువు పోయినా పర్వలేదు. నడుస్తనే ఉంటం ఇవి భగవంతుడు ఇచ్చిన కాళ్లు ఆయనే మమ్ములను నడిపిస్తున్నడు" అని అన్నడు. అతన్ని చూస్తుంటే 1969 మొదటి తరం తెలంగానా పోరాటానికి ప్రతినిధిలాగా కనిపించిండు. మూడుతరాల తెలంగాణాపోరాటం. మూడు దశల తెలంగాణా పోరాటం.

చివరికి ముగింపుగా ఆ పాదయాత్ర మంజిల్ ఔర్ మక్సద్ గవర్నర్ గారి నివాసం రాజ్‌భవన్. అయితే ఆయన లేరని తెల్సింది. అయినా పాదయాత్రీకుల ప్రతినిధి బృందం గవర్నర్ గారి ఓ.యస్.డి.ని కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని "తెలంగాణ మాత్రమే కావాలని" సమర్పించింది. వేనేపల్లితో పాటు ప్రతినిధి బృందం సభ్యులు తెలంగాణా ఆవశ్యకతను వివరిస్తుంటే ఆయన ఓపికగా విన్నారు. ఆఖర్లో చక్రాల కుర్చిలో వెంటవచ్చిన అంశుల స్వామిని ఎదురుగా ఉన్న ఆయన టేబుల్‌పై పండబెట్టారు. అతడిని చూసి ఆ అధికారి పరేషాన్ అయినాడు. "నాలాగా మరెవరూ కావొద్దు. మాకు మంచి నీళ్ళు గావాలె. మాకు తెలంగాణా కావాలె అని అంశుల స్వామి రెండు చేతులెత్తి ఆ అధికారికి మొక్కిండు.

గవర్నర్ నివాసం నుండి అందరం ఇవతలికి వచ్చాం. ఇక వీడ్కోలు. ఇక ఆ మట్టి మనుషులకు వారు చేసిన పాదయాత్రకు "అల్విదా" చెప్పే క్షణాలు దగ్గరికి రానే వచ్చాయి.

అందరి హృదయాలు బరువెక్కి ఉన్నాయి. మాటలు కరువయ్యాయి. లక్షల పాదముద్రలతో చరిత్రను లిఖించిన 275 కిలోమీటర్ల పాదయాత్ర "పాలేరువాగు నుండి మూసి నది దాకా" ముగియబోతుంది.

"మరి మీ తిరుగుప్రయాణం ఎట్ల పాండురంగారావ్" అని దిగులుగా అడిగాను.

"ఏముంది ఆర్‌టిసి బస్సులలో" అన్నాడు చిర్నవ్వుతో.

వచ్చి అన్నం తిని రెస్టు తీసుకోవచ్చు గదా"!

"లేదు రేపు మా ఊర్ల ఉండాలె. అక్కడ మిషన్ల పంచే పని ఉంది" అన్నాడు ఈ భూమి పుత్రుడు. అతని నేతృత్వంలో ఆ "లగాన్ టిం" రోడ్డు దాటి వడివడిగా నడిచి పోతుంటే నాకెందుకో అకస్మాత్తుగా గాంధీగారి "దండియాత్ర" సీను గుర్తుకొచ్చింది.

(వ్యాస రచనా కాలం 2007 జనవరి)

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com



# తెలంగాణాలో బయల్పడిన అతిపెద్ద సూక్ష్మ రాతియుగపు పనిముట్టు

*దక్కన్ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, భౌగోళిక, పర్యావరణ అంశాలతో ఒక దశాబ్ద కాలంగా వెలువడుతున్న దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో పురావస్తు, చరిత్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో పండుగలు, పబ్బాలు, అలనాటి మేటి తెలంగాణా శాసనాలు, వారసత్వం- ఆలయాలు (తెలంగాణా శిథిలాలు, వ్యథాభరిత కథనాలు) పేరిట అనేక వ్యాసాలను రచించారు. దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక 2025 జనవరి మాసం నుంచి 'మైలురాళ్లు' (తెలంగాణా చరిత్రలో మైలురాళ్లు) అనే కొత్త శీర్షికను ధారావాహికంగా అందిస్తున్నారు.* *-మణికొండ వేదకుమార్, సంపాదకులు*

ఆదిమ మానవుని అడుగుజాడలతో ప్రపంచ పురావస్తు శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిన ఆఫ్రికా తరువాత, దాదాపు అవే ఆనవాళ్లు గల మనదేశపు వివిధ ప్రాంతాల్లో తెలంగాణా కూడ ఒకటి. ప్రాచీన, మధ్య, సూక్ష్మ శిలాయుగాలకు సంబంధించిన అనేక పురాతన స్థలాలు తెలంగాణాలో వెలుగుచూశాయి. ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లాలోని అమ్రాబాదు, ఆదిలాబాద్ జిల్లాలోని రామగుండం, బోథ్, పొచ్చెర, వేములపల్లి, ఖమ్మం జిల్లా చర్ల ప్రాంతంలో ప్రాచీన శిలాయుగపు పనిముట్లు, అసిఫాబాదు, పద్ర, చలేశ్వరం, ఏలేశ్వరం, దేవరకొండ, లక్సెట్టిపేట, సోమశిలలో మధ్య శిలాయుగపు పనిముట్లు, వాంకిడి, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ, ఏటూరునాగారం, పాకాల, లక్కవరం మొదలైన చోట్ల చివరి పాత రాతి యుగపు (Upper Palaeolithie Age) రాతి పనిముట్లు దొరికి, తెలంగాణాలో ఆదిమ మానవుని బుడిబుడి నడకల గుర్తుల్ని అందించాయి.

క్రీ.పూ. 40,000-10,000 సం॥ల మధ్యకాలానికి చెందిన ఈ యుగం, ప్లీస్టోసీన్ అనే మంచుయుగపు ముగింపు దశగానూ, అలాగే హోలోసీన్ యుగపు ప్రారంభ దశగానూ నిర్ణయించారు. ఈ యుగంలో వేట ప్రధానంగా ఆహారాన్ని సంపాదించుకొన్న అలనాటి మానవుడు, బ్లేడ్లు, పక్క అంచు బ్లేడు అనే పనిముట్లతో పాటు, బ్యూరిన్ అనే రంధ్రాలు చేసే పరికరాలను కూడ తయారు చేసుకొన్నాడు.

వీటితో పాటు పెద్దా, చిన్నా ఆకారపు బ్లేడు, మళ్లీ పదును పెట్టిన బ్లేడ్లు, పెచ్చు బ్లేడ్లు, గోకుడు రాళ్లను ఎక్కువగా క్వార్ట్జెటులో తయారించుకొన్నారు. ఇదే యుగంలో తాము నివసిస్తున్న కొండచరియ ఆవాసాల గోడలు, కప్పులపై సహజసిద్ధంగా లభించే మట్టి రంగులతో వేసిన తొలితరం శిలాయుగపు చిత్రకళ ఆనవాళ్లు కూడా లభించాయి.

శిలాయుగపు చిత్రకళ పాత, మధ్య, సూక్ష్మ శిలాయుగపు స్థావరాలు ఎన్నో ఉన్న తెలంగాణాలో నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపురం మండలం, సోమశిల సమీపంలోని కృష్ణానది తీర గ్రామమైన బొల్లారంలో పురావస్తు శాస్త్రవేత్తలు విస్తు బోయిన ఆధారాలు లభించాయి.


పాత బొల్లారంలో 1984లో అప్పటి పురావస్తుశాఖ, సంచాలకులు డా. వి.వి. కృష్ణశాస్త్రి గారి ఆధ్వర్యంలో, సోమశిల దేవాలయాల పునర్నిర్మాణ బాధ్యతలను చూస్తున్న బి. సుబ్రహ్మణ్యం, ఈమని శివనాగిరెడ్డి రెండు శిలాయుగపు స్థావరాలను గుర్తించారు. పాము పడగ ఆకారంలో గల ఈ ఆదిమ మానవుని ఆవాసాల గోడలు, కప్పులపై ముగ్గుల్ని పోలిన వర్ణచిత్రాలతో పాటు ఒక పక్షి ఆకారం కూడా ఉంది. దీన్ని స్థానికులు కిన్నెర అనీ, ఆ గుండును కిన్నెరసాని గుండు అని పిలుస్తున్నారు. ఈ ఆవాసాల కింద పేరుకుపోయి గట్టిపడిన నేలను గమనించిన బి. సుబ్రహ్మణ్యం గారికి ఒక 17.08 సెంమీ. పొడవు, 5.03 సెంమీ. వెడల్పు సెంటిమీటరు మందంగల క్వార్ట్జెటు రాతితో చేసిన ఒక బ్లేడు దొరికింది. ఇప్పటి వరకూ మనదేశం మొత్తం మీద ఇంత పొడవైన, రెండువైపులా మొనగల అతిపెద్ద సూక్ష్మ రాతియుగపు పనిముట్టు దొరకడం తెలంగాణా చరిత్రలో అందునా ఆదిమ మానవుని చరిత్ర, పురావస్తు అన్వేషణల్లో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు.

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి, m : 9848598446
e : nagireddy@malaxmi.in

# ప్రోటీన్ ఇంజినీరింగ్‌లో సంచలనం...!!
# @ రొసెట్టా, ఆల్ఫా ఫోల్డ్ 2

(ప్రోటీన్ల నిర్మాణాలపై పరిశోధనకు గానూ 2024వ సం॥రానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా..!!)

మనిషి జన్మించిన తరువాత నవజాత శిశువు దశ నుండి వయోజన దశ వరకు ప్రతిదశలోనూ, తన శరీర నిర్మాణం ఒక చక్కటి ఆకృతిని, సౌష్టవాన్ని పొందడంలో "ప్రోటీన్లు" అనబడే పోషక పదార్థాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రోటీన్లనె తెలుగులో మాంసకృత్తులు అని కూడా అంటారు. కేవలం శరీర నిర్మాణానికే కాకుండా, యాంటీబాడీస్ గానూ, రక్తాన్ని సరఫరా చేయడంలోనూ (హిమోగ్లోబిన్), గ్లూకోజ్ నియంత్రణలోనూ (ఇన్సులిన్), చర్మ సంరక్షణలోనూ (కెరటిన్)... ఇలా ప్రోటీన్లు మానవ శరీరానికి బహుళ ప్రయోజనకారులుగా తోడ్పాటునందిస్తున్నాయి. మానవాళి మనుగడలో ఇంతటి ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి కాబట్టే, ప్రోటీన్లపై పరిశోధనకు గానూ 2024 సం॥రానికి రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించడం జరిగింది. కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్ చేసినందుకుగానూ యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన డేవిడ్ బెకర్‌కు, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన డెమిస్ హసాబిస్, జాన్ ఎం. జంపర్‌లు ఆల్ఫా ఫోల్డ్2 అన్న సాఫ్ట్‌వేర్ సహాయంతో ప్రోటీన్ల నిర్మాణాలను అంచనా వేసేందుకు తోడ్పడే పరిశోధనలు చేసినందుకు గానూ.. మొత్తంగా ఈ ముగ్గురికి రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రోటీన్లు, వాటిలోని సంక్లిష్టతలు, ప్రయోజనాలు, ప్రాముఖ్యతను అదేవిధంగా ప్రోటీన్లపై ఈ శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను గురించి మనమూ తెలుసుకుందాం!!




**అసలు ప్రోటీన్లు అంటే..!!**

మానవులకు సంబంధించిన సమగ్ర జన్యు సమాచారమంతా కణంలోపల డీఎన్ఏలో ఇమిడి ఉంటుంది. ఈ డీఎన్ఏ నుండి ట్రాన్స్‌క్రిప్షన్ అన్న ప్రక్రియ ద్వారా ఆర్ఎన్ఏ తయారవుతుంది. ఈ ఆర్ఎన్ఏలోని నత్రజని క్షార అణువుల అమరిక మానవ శరీరంలోని ప్రోటీన్ల నిర్మాణం మరియు వాటి పనితీరును నిర్దేశిస్తుంది. నిర్దిష్టంగా చెప్పాలంటే అమైనో ఆసిడ్‌లతో నిర్మితమైన పాలిమర్‌లనే ప్రోటీన్లు అంటారు. డీఎన్ఏ నుండి ఏర్పడిన ఆర్ఎన్ఏననుసరించి అమైనో ఆమ్లాలు ఒకదాని తరువాత ఒకటి ఒక గొలుసు లాంటి నిర్మాణాలను ఏర్పరుస్తాయి. ఈ గొలుసులాంటి నిర్మాణాలనే పాలిపెప్టైడ్‌లు లేదా ప్రోటీన్‌లు అంటారు. ఆంగ్ల వర్ణమాలలోని 26 అక్షరాల ద్వారా అనంతమైన పదాలను, వాక్యాలను ఎలా ఏర్పరుస్తాయో, మానవశరీరంలో కూడా కేవలం 20 అమైనో ఆమ్లాలు అన్ని ప్రోటీన్లను మరియు చాలా జీవరూపాలను ఏర్పరుస్తాయి.

**ప్రోటీన్లు – వాటి ప్రాముఖ్యత:** మొదట చెప్పుకున్నట్లు ప్రోటీన్లు మన శరీరంలో ఎన్నో సంక్లిష్టమైన విధులను నిర్వర్తిస్తాయి.

i. **కణజాలాల నిర్మాణ మద్దతు:** కణాల నుండి కణ జాలాలు, కణజాలాల నుండి అవయవాలు ఏర్పడడంలో ప్రోటీన్లు కీలకపాత్ర పోషిస్తాయి.

ఉదా॥కు చర్మం, ఎముకలతో పాటు శారీరక కణాలలో ఉండే కొల్లాజెన్ అనే ప్రోటీన్ కణాలను అనుసంధా నించడంతో పాటు, కణజాలాల మధ్య తన్యతను, కణజాలాలు పరిస్థితుల కనుగుణంగా సులభంగా వంగేవిధంగా లేదా మార్పు చెందే లక్షణాన్ని పెంపొందిస్తుంది.

ii. **ఉత్ప్రేరకాలుగా:** ప్రోటీన్లు మానవ శరీరంలో జరిగే అనేక జీవరసాయన చర్యల్లో ఉత్ప్రేరకాలుగా పనిచేస్తూ ఆ జీవరసాయన చర్యల యొక్క వేగాన్ని పెంచుతాయి. ఉదా॥కు ఎంజైమ్‌లు అన్ని ప్రోటీన్లే అమైలేజ్ అన్న ఎంజైమ్ పిండి పదార్థాలను (Starches), చెక్కెరలు( Sugars) గా విడగొడబడే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

iii. **జీవపదార్థాల రవాణాలో:** కొన్ని ప్రోటీన్లు శరీరానికి ఆవశ్యకమైన జీవ పదార్థాలను రవాణా చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఉదా॥ హిమోగ్లోబిన్ అన్న ప్రోటీన్ రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

iv. **కండర సంకోచాల నియంత్రణ:** ప్రోటీన్లు కండరాల సంకోచాన్ని నియంత్రిస్తాయి. తద్వారా ఇవి కండరాల కదలికలోనూ, హృదయ స్పందనలోనూ సహాయపడతాయి. ఉదా॥ ఆక్టిన్ మరియు మయోసిన్

v. **గ్లూకోజ్ నియంత్రణలో:** ప్రోటీన్లు శరీరంలో అధిక


మోతాదులో ఉన్న గ్లూకోజ్‌ను నియంత్రిస్తాయి. ఉదా॥ ఇన్సులిన్

**vi. రక్షణలో:** ప్రోటీన్లు శరీరంలోకి ప్రవేశించిన వ్యాధికారక జీవులతో పోరాడి వాటిని వెలుపలికి పంపించే యాంటీబాడీలుగా ఉపయోగపడతాయి. ఉదా॥ ఇమ్యునోగ్లోబ్యులిన్

**vii. నిల్వచేయడంలో:** శరీరానికి కావలసిన ఆవశ్యక పోషకాలను నిల్వచేసి, వాటిని శరీరానికి అవసరమైనపుడు అందజేయడంలో ప్రోటీన్లు ఇతోధిక పాత్ర పోషిస్తాయి. ఉదా॥ ఫెర్రిటిన్ అన్న ప్రోటీన్ శారీరక కణాలలో ఐరన్‌ను నిల్వచేస్తుంది.

**viii. గ్రాహకాలుగా (Receptors):** కొన్ని ప్రోటీన్లు గ్రాహకాలుగా పనిచేస్తాయి. ఉదా॥ రొడాప్సిన్ అన్న ప్రోటీన్ కంటిలోని రెటీనా అన్న భాగంలో కాంతి గ్రాహకంగా పనిచేస్తుంది.

**ix. నిర్మాణ పరంగా (Structural):** కొన్ని ప్రోటీన్లు నిర్మాణపరంగా ధృఢత్వాన్ని కలిగి, శరీరం బయటి ఒత్తిళ్ళను తట్టుకునేందుకు తోడ్పతాయి. ఉదా॥ స్పైడ్రోఇన్ (Spidroin) లేదా స్పైడర్ సిల్క్ అన్న ప్రోటీన్ నీటిలో కరగదు. అందువల్ల వాటర్‌ప్రూఫ్‌గా పనిచేస్తుంది. ఇది ప్రోటీన్ డీనేచర్ కాకుండా తోడ్పాటు నందించడం వల్ల ఈ ప్రోటీన్ అత్యధిక ఒత్తిడిని మరియు ఉష్ణోగ్రతను తట్టుకుంటుంది.




**ప్రోటీన్లు మరియు వాటి యొక్క విశిష్ఠ అమరిక:** సాధారణంగా ప్రోటీన్లు రెండు రకాలు i ఫైబ్రస్ ప్రోటీన్స్ ii. గ్లోబ్యులార్ ప్రోటీన్స్ ఫైబ్రస్ ప్రోటీన్లు నీటిలో కరగవు మరియు పొడవుగా ఉంటాయి. గ్లోబ్యులార్ ప్రోటీన్లు నీటిలో కరుగుతాయి మరియు కుదించబడి ఉంటాయి. ఫైబ్రస్ మరియు గ్లోబ్యులార్ ప్రోటీన్లు ఒకటి నుండి నాలుగు రకాల ప్రోటీన్ నిర్మాణాలను కలిగి ఉండవచ్చు. వాటిలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ మరియు చతుర్ధ నిర్మాణాలు ఉంటాయి.

**ప్రాథమిక నిర్మాణం:** ఇది అమైనో ఆమ్లాల నిర్దిష్టక్రమం. అమైనో ఆమ్లాలు అన్నీ కలిసి ఒక క్రమబద్ధమైన విధానంలో ఏర్పడుతాయి. ఇలా ఏర్పడిన అమైనో ఆమ్లాల నిర్ధిష్ట క్రమాన్ని జన్యువులతో నిల్వ చేయబడిన సమాచారం ద్వారా కనుగొనడం జరుగుతుంది.

**ద్వితీయ నిర్మాణం:** ఇది ప్రోటీన్ల యొక్క స్థానిక విభాగానికి (Local segment) త్రిమితీయ (3D) రూపం. అవి పాలీపెప్టైడ్ గొలుసులోని అణువుల మధ్య హైడ్రోజన్ బంధాల ద్వారా ఏర్పడతాయి.

**తృతీయ నిర్మాణం:** తృతీయ నిర్మాణం యొక్క నిర్దిష్ట అమరిక ఆర్– సమూహాలచే నిర్ణయించబడుతుంది. ఇది కూడా త్రిమితీయ (3D) ఆకారాన్ని కలిగి ఉంటుంది. తృతీయ నిర్మాణం యొక్క అధిక సంఖ్యాక ముడుతలు (Folds) చతుర్ధ నిర్మాణానికి దారితీస్తాయి.

**చతుర్థ నిర్మాణం:** ఇది బహుళ ఉపవిభాగ సముదాయంలో (Multi subunit complex) బహుళ ముడుతలు పడిన ప్రోటీన్ సబ్ యూనిట్‌ల అమరికగా చెప్పవచ్చు.

కాటన్ నుండి చొక్కా తయారవుతుందను కొంటే ముడిపత్తి ప్రాథమిక నిర్మాణం, పత్తి నుండి దారం రావడం ద్వితీయ నిర్మాణం, దారాలతో బట్ట నేయడం తృతీయ నిర్మాణం కాగా, బట్టతో చొక్కా కుట్టడం ప్రోటీన్లలో చతుర్ధ నిర్మాణంగా పోల్చి చెప్పవచ్చు.

**ప్రోటీన్లు– ముడుతలు పడే విధానం (The protein Folding pattern):** ప్రోటీన్లు వాటి యొక్క త్రిమితీయ (3D) నిర్మాణం ఆధారంగా విభిన్న పాత్రలను నిర్వర్తిస్తాయి. ప్రోటీన్లు ఎలాంటి విధులు నిర్వర్తించాలనేది వాటిలోని అమైనో ఆమ్లాల అమరిక ద్వారా నిర్ణయించబడుతుంది.

ప్రోటీన్ల ముడుతలు సరైన రీతిలో ముడుచుకున్నట్లయితే ప్రోటీన్లు వాటికి కావలసిన నిర్దిష్ట ఆకృతిని పొందుతాయి. అయితే ఆశించిన ఆకృతిని పొందేందుకు ప్రోటీన్లను ఎలా ముడచాలి అన్నది ఒక జటిల సమస్యగా మారి, దశాబ్దాలుగా శాస్త్రవేత్తలను కలవరపెడుతోంది.

మనం కుర్చీలో సవ్యంగా కూర్చో గలగాలంటే కుర్చీ యొక్క నిర్మాణం సరైనరీతిలో ఉండాలి. పెన్నుతో రాయగలగాలంటే పెన్ను యొక్క నిర్మాణం సక్రమంగా ఉండాలి. ప్రోటీన్లు కూడా శరీరంలోని విభిన్న సంక్లిష్ట ప్రక్రియలను సక్రమంగా నిర్వర్తించాలంటే వాటి యొక్క నిర్మాణం, వాటిలోని ముడుతలు సక్రమంగా ఉండాలి. అలా లేకుండా ప్రోటీన్ మిస్ ఫోల్డింగ్ లేదా అన్ ఫోల్డింగ్ జరిగినట్లయితే అల్జీమర్స్, పార్కిన్‌సన్స్, హంటింగ్‌టన్, సిస్టిక్ ఫైబ్రోసిస్ లాంటి సంక్లిష్ట వ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉంది.

కాబట్టి ప్రోటీన్లలోని ఈ ముడుతల అమరికను కనుగొనేందుకు శాస్త్రజ్ఞులు విభిన్న రకాల ప్రక్రియలను అభివృద్ధి చేశారు. అందులో భాగంగా 1952లో న్యూక్లియర్ మాగ్నటిక్ రెజొనెన్స్ స్పెక్ట్రోగ్రఫీ అన్న విధానాన్ని, 1964లో జాన్ కెండ్రూ మరియు మాక్స్ పెరుట్జ్ అనే ఇరువురు శాస్త్రవేత్తలు ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీ అన్న విధానాన్ని కనుగొన్నారు. ఇందుకుగానూ రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. 2017లో ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ఆధారిత విధానం ద్వారా ప్రోటీన్ల నిర్మాణాన్ని అంచనా వేసే ప్రయత్నం చేయడం జరిగింది. అయితే పైన పేర్కొన్న విధానాలన్నీ కూడా సాంప్రదాయ పద్ధతులు మరియు ఖర్చు, శ్రమతో కూడుకొన్నవి. అంతే కాకుండా, వీటిద్వారా ప్రోటీన్ల అమరికను అంచనా వేయడానికి సమయం ఎక్కువ పట్టే అవకాశం ఉంది. అది ఒక సం॥రం నుండి ఒక దశాబ్దం వరకూ ఎంతైనా కావచ్చు.

ప్రకృతిలోని మొత్తం 200 మిలియన్ల ప్రోటీన్లలో పైన పేర్కొన్న పద్ధతుల ద్వారా కేవలం 1,70,000 ప్రోటీన్ల నిర్మాణాలను మాత్రమే గుర్తించగలిగారు.

*(తరువాయి వచ్చే సంచికలో)*

**–పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047

# 256మంది ధీరవనితలు–స్ఫూర్తి కాంతులు

ఏ రంగంలోనైనా తొలి అడుగులు వేసేవారు, తొలి సంతకం చేసే వారు, తొలి రచనలు చేసేవారు, తొలి ప్రశ్నను సంధించిన వాళ్లు, తొలి ప్రయోగాలకు సిద్ధపడేవారు, ప్రజల పోరాటాల్లో ముందు వరుసలో నిలిచేవారు, ఇతరులకు మార్గదర్శ నిర్దేశకులవుతారు. తరువాతి తరాలకు కొత్త దారులు పరిచిని వారవుతారు. అలాంటి వారు ప్రతి సందర్భంలోనూ అసామాన్యులే కారు. చాలా సార్లు సామాన్యులే అసామాన్యులుగా నిలుస్తారు.

అయితే వారిని ఎవరు గుర్తిస్తారు? ఎలా గుర్తిస్తారు అంటే చెప్పలేం. కానీ అలాంటి వారిని గుర్తిస్తేనే, వారి కృషిని వెలికి తీస్తేనే, వారి కృషిని, త్యాగాలను అక్షరీకరిస్తేనే అది చరిత్రలో నిలిచిపోతుంది. రాబోయే తరాలకు వారి అడుగుల జాడలు తెలిసే అవకాశముంటుంది.

కానీ, సమాజ గమనంలో మహిళలు చేసిన కృషి చాలా సందర్భాల్లో అసంపూర్తిగానే రికార్డ్ అవుతుంది. అనేక మంది సామాన్యులు చేసిన అసామాన్య కృషి మరుగున పడిపోతుంది. ఆయా సమయాల్లో, సందర్భాల్లో వారు చేసిన పని ఎంతటి ప్రాముఖ్యతను సంతరించుకుందో, ఆ చరిత్రలోకి వెళ్తే మరింత బాగా అర్థమవుతుంది.

పురుషాధిపత్య సమాజంలో అనేక మంది మహిళల అనేక తరాలుగా అలా మరుగునపడి పోయింది. ఎప్పుడూ హీరోల గురించి మాత్రమే మాట్లాడుకోవడం మామూలై పోయింది. ఇలాంటి సామాజిక, రాజకీయ పరిస్థితిలో అనేక మంది మహిళలు చేసిన కృషిని, వారు చూపిన తెగువను, ప్రదర్శించిన ధైర్య సాహసాలను, వారు అందించిన సేవలను, ఆత్మ గౌరవంతో, ఆత్మ నిబ్బరంతో వారు నిలబడిన తీరును ఈ తరం ఆడపిల్లలకు తెలియచేయాలనే సంకల్పంతో, ఆంధ్రప్రదేశ్ లో పుట్టి పెరిగి, అమెరికా లో స్థిరపడిన డా. జాస్తి శివరామకృష్ణ ఒక నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టిన ఆలోచనకు ప్రతిరూపమే ''షీరోస్''. www.projectabcd.comలో భాగంగా భారతదేశంలోని వివిధ రంగాలలో ప్రముఖ పాత్ర పోషించినటువంటి 256 మంది




మహిళలను పిల్లలకు పరిచయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ పుస్తకానికి సహ రచయితగా 11 ఏళ్ల అయ్యల సోమయాజుల అహల తోడయింది. వీరిద్దరూ కలిసి ఈ పుస్తకాన్ని అక్షరబద్ధం చేస్తే, పిల్లలకు మరింత ఆకర్షణీయంగా ఈ పుస్తకం రూపుదిద్దుకోవడంలో బాబు దుండ్రెపల్లి వేసిన బొమ్మలు అదనపు ఆకర్షణగా మారాయి.

ఈ ఇంగ్లీష్ పుస్తకావిష్కరణ 2024 జనవరి 8న గుంటూరులోని చేతన ప్రాంగణంలో, చేతన సంస్థ వ్యవస్థాపకురాలు మంగాదేవి గారి చేతుల మీదుగాను, అదే సమయంలో షీరోస్ గా తయారయి వచ్చిన దాదాపు 18 స్కూల్స్‌కి చెందిన 289 మందికి పైగా పిల్లల చేతుల మీదుగానూ జరిగింది. ఈ పిల్లలందరూ షీరోస్‌ని అనునయించి ప్రేక్షకులను అబ్బురపరిచారు. అద్భుతంగా సాగిన ఆనాటి వేడుక పిల్లలకు ఒక మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మొదట ఇంగ్లీష్‌లో వచ్చిన షీరోస్ పుస్తకాన్ని, 11 నెలల తరువాత "256 ధీరవనితలు - స్ఫూర్తికాంతులు" పేరుతో తెలుగులోకి స్వతంత్ర జర్నలిస్ట్ పద్మ వంగపల్లి అనువాదం చేశారు. ఈ పుస్తకాన్ని శ్రీనివాస్ చాలా చక్కగా డిజైన్ చేశారు.

ఈ తెలుగు వర్షన్ హైదరాబాద్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్ నగర్, హైదరాబాద్ భాగస్వామ్యంతో 2024 డిసెంబర్ 22న కోలాహలంగా జరిగింది. స్కూల్ ప్రాంగణాన్ని బాలచెలిమి పిల్లల పత్రిక, సంపాదక వర్గం చాలా అందంగా ముస్తాబు చేసింది. దాదాపుగా 42 స్కూల్స్ నుండి వచ్చిన చిన్నారులు షీరోస్ వేషధారణతో తమ ప్రతిభా పాటవాలను చూపారు. అంతేకాదు షీరోస్ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేశారనే చెప్పాలి.

రెండు సందర్భాల్లోనూ ఇతర పుస్తకావిష్కరణలకు భిన్నంగా కార్యక్రమాలు జరపడం షీరోస్ ప్రత్యేకతనే చెప్పాలి. ఇది పిల్లల పట్ల ప్రేమ ఉన్నవారికి, పిల్లలకే పెద్ద పీట వేయాలనుకునేవారికి, ఏ పిల్లలకైతే



ఈ పుస్తకం మరింత చేరువ కావాలని ఆకాంక్షించారో వారికి మాత్రమే సాధ్యమనేలా నిర్వహించారు.

పుస్తకంలో షీరోలుగా పిల్లలకు పరిచయమయిన రచయిత్రి ఓల్గా, ప్రవాస భారతీయురాలు శైలా తాళ్లూరి, డాక్టర్ ఉషాకిరణ్, స్వతంత్ర జర్నలిస్ట్ పద్మ వంగపల్లితో పాటు పిల్లల చేతుల మీదుగా తెలుగు పుస్తకావిష్కరణ వేడుక జరిగింది.




నిరంతరం పిల్లల మధ్యే గడిపే నయితాలీం జాతీయ కమిటీ సభ్యులు C.A.ప్రసాద్ స్కూల్ పిల్లలతో మాట్లాడటం, టీచర్లను ఇందుకోసం సమన్వయం చేయడమే కాదు, ఏ స్కూల్‌కి వెళ్లినా ఈ పుస్తకం ప్రాధాన్యతను తెలియచేసి పిల్లలకు ఈ పుస్తకాన్ని మరింత చేరువగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు.

ఈ వేడుకలో పిల్లలు చిన్నారులుగా అలరించారు, వాళ్లే పెద్దలుగా అభినయించారు, ప్రశ్నించారు, విజేతలుగా నిలిచారు. రాబోయే కాలానికి కాబోయే ధీరవనితలు-స్ఫూర్తికాంతులుగా మారతారనే నమ్మకం కలిగించారు.

నిరంతరం పిల్లల కోసం ఏదో ఒక పని సృజనాత్మకంగా చేయాలనే ప్రయత్నంలో డా. శివజాస్తి గతంలోనూ పిల్లల కోసం "చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు పేరుతోనూ తొమ్మిదేళ్ల క్రితం ఒక పుస్తకం తీసుకొచ్చారు. తెలుగులో పదివేలకు పైగా పజిల్స్ తయారుచేశారు. చదువులోనూ, ఇతరుల పట్ల స్పందించే తీరులోనూ పిల్లల్లో మార్పు తీసుకురావడానికి "లెర్న్ అండ్ హెల్ప్"ని ప్రారంభించారు. ప్రాజెక్ట్ ఏబిసిడి(ఏ బైట్ ఆఫ్ కల్చర్ ఇన్ డ్రెసెస్)పేరుతో భారతదేశంలోని వైవిధ్యమైన సంస్కృతిని పిల్లలందరికీ పరిచయం చేయాలనే పనిలో ఉన్నారు.

షీరోస్ తెలుగు వెర్షన్‌కి, NRIVA (నాన్ రెసిడెంట్ ఇండియన్ వాసవి అసోసియేషన్) సంస్థ ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించింది. ఈ సంస్థ అధ్యక్షులు పందిరి శ్రీనివాస్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఈ ధీరవనితల లిస్ట్ 256 కే పరిమితం కాకుండా మరింత మంది మహిళలను పరిచయం చేస్తూ ముందుకు సాగుతుందని నిర్వాహకులు తెలియచేయడం బాగుంది. ఈ ఆనందంలో కొన్ని గంటల పాటైనా పిల్లల మధ్య గడిపిన వారందరికీ తప్పకుండా ఇదొక మరిచిపోలేని అనుభూతిగా మిగులుతుందనడంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు.

-సీఏ. ప్రసాద్, m : +91 94901 75160



# వ్యాధులు లేని ఉగాదుల కోసం..!

మినామట అనే వ్యాధి గురించి మనం సమీప గతంలో కానీ, సుదూర గతంలోనైనా విన్నామా? ఇదొక పట్టణ ప్రాంతం జపాన్‌లో ఉంది. ఆ ప్రాంతం ఒక రకంగా ఫ్యాక్టరీ టౌన్‌గా వ్యవహరింపబడుతుంది. చేపలు, షెల్‌ఫిష్ లాంటి కలుషితమైనవి తినటం వల్ల సంక్రమించే వ్యాధిగా 1968 నాటికి నిర్ధారణకు రాగలిగారు. షెల్‌ఫిష్ లేదా చేపలు ఎందుకు కలుషితం అవుతున్నాయంటే మిథైల్ మెర్క్యురీ అనే రసాయన పదార్థం ఒక రసాయన కర్మాగారం నుండి వెలువడుతుంది. అది ఆ సమీపాన గల సముద్రమో, నదో, వాగో, వంకల్లోని నీటిలో కలుస్తుంది. ఆ నీటిలో పెరిగే చేపలను తినడం వల్ల వ్యాధి సంక్రమించడానికి అన్ని మార్గాలను తెరిచినట్లే అవుతుంది. తమ పరిసరాల్లో లభించే వాటిని ఆహారంగా ప్రజలు స్వీకరించకుండా ఉండలేరు. తినడం వల్ల వ్యాధుల బారిన పడతారు. ఈ వ్యాధి లక్షణ ఏమిటి? ప్రధానంగా స్పర్శను కోల్పోవటం. అందునా కాళ్లు చేతులు పట్టు తప్పటం. వాటికి అవి పడిపోవటం. అట్లాగే దృష్టిలోపం ఏర్పడటం జరుగుతుంది. బ్యాటరీల్లోనూ, ఫ్లోరోసెంట్ లైట్లలోనూ దీనిని వినియోగిస్తారు. గాలిని, నీటిని కలుషితం చేసే సాధారణ రసాయన పదార్థమే మిథైల్ మెర్క్యురీ. 1950లోనే జపాన్‌లోని పలు ప్రాంతాలలో ఈ వ్యాధి ప్రబలింది. పారిశ్రామిక వ్యర్థాల వల్ల నదులు, ఇతర సముద్ర తీర ప్రాంతాలలోని నీరు కలుషితం అవుతుంది. మినామట, నీగటలలోనే సుమారు ఆరువందల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మినామటలో అధిక మరణాలు సంభవించిన కారణంగానే ఆ ప్రాంతం పేరుతోనే వ్యాధి ప్రఖ్యాతమైంది. చిస్సో కార్పొరేషన్ యాజమాన్యంతో నడుస్తూ ఉన్న రసాయన కర్మాగారం 1932 నుండి 968 దాకా కొనసాగింది. ఈ అన్నేళ్లూ తన వ్యర్థాలలో మిథైల్ మెర్క్యురీని వదులుతూనే ఉంది. ఎప్పుడో 1960లలో వ్యాధి బారిన పడ్డవారికి అందవలసిన నష్టపరిహారం 1995 దాకా చెల్లించబడలేదు. న్యాయస్థానం తీర్పు ఇచ్చాక కూడా ఇంచుమించు ఇరవైరెండు సంవత్సరాల పాటు జాప్యం చేసింది ఆ కంపెనీ నష్టపరిహారం చెల్లించడానికి. నిజానికి 1956లోనే ఈ వ్యాధి కనుగొనబడింది.

మిథైల్ మెర్క్యురీ ప్రభావానికి గురైన చేపలను తినటం ద్వారా శరీరావయాలను చచ్చుబడేట్లు చేయగలుగుతుంది. మిథైల్ మెర్క్యురీ అత్యంత ప్రమాకరమైన రసాయన విషపదార్థం. వాటర్ బాడీస్‌లోకి కర్మాగారాల వ్యర్థాల ద్వారా చేరటం. ఆ నీటిలో పెరిగే జలచరాలు ఆ నీటిని వినియోగించటం, చేపలు, షెల్‌ఫిష్ లాంటి వాటిల్లోకి చేరాక అది ఒకటికి పదింతలుగా వృద్ధి పొంది తీవ్ర ప్రభావాన్ని ప్రజల ఆరోగ్యం మీద కలిగిస్తుంది. సుమారు 36 ఏళ్ల పాటు మనుషులు, జంతువులు మిథైల్ మెర్క్యురీ విష ప్రభావానికి గురవుతూ చనిపోతూ ఉండటం జరిగింది. ఈ రసాయన పదార్థం చావును కానుక చేసే సంగతి అట్లా ఉంచితే, శరీరం చచ్చుబడటం, మొద్దు బారటం, సాధారణ కండరాల బలహీనత, వినికిడి సమస్య, మాట్లాడలేకపోవటం, పక్షవాతం, కోమా, మతి భ్రమణం లాంటివి కూడా ఈ విష రసాయనం కలిగిస్తుంది. నాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఈ వ్యాధి కారక రసాయన పదార్థాన్ని ఉత్పత్తి చేసే చిస్సో కార్పొరేషన్ ప్రభుత్వంతో లాలూచిపడి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. ఈ వ్యాధి బారిన పడ్డ రోగుల పక్షాన మిచికో షిరాషి అనే ఫ్రీలాన్స్ పాత్రికేయురాలు నిలబడి పోరాడింది. సంవత్సరాల తరబడి న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు నడిచాయి.



తొలుత తనకేమీ బాధ్యత లేదన్న చిస్సో, షిరాషి పోరాటం వల్ల అంతో యింతో నష్టపరిహారం బాధితులు పొందగలిగారు కూడా.

అయితే ఇటువంటి పర్యావరణ సంబంధిత వ్యాధులు ప్రబలినప్పుడు వాటికి గురైన పర్యావరణ బాధితుల గురించి పోరాడేందుకు, పర్యావరణ న్యాయం అందించేందుకు పౌరసమాజాలు చైతన్యం పెంపొందించుకోవలసిన అవసరం ఎంతయినా ఉన్నది.

క్రిష్టఫర్ విలియమ్స్ అనే ఆయన ఎన్విరాన్‌మెంటల్ విక్టియాలజీ అనే వ్యాసం రాస్తూ నాలుగు మంచి మాటలు చెప్పాడు.

నేను బాధితుడిగా మారాలనుకోవటం లేదు. ఒకవేళ నేను బాధితుడ్నే అయ్యే పక్షంలో అన్నిరకాల చర్యలూ నేను బాధుతడ్ని కాకుండా ఉండేందుకు తీసుకోవాలని ఆశిస్తాను.

ఒక వేళ నేను బాధితుడ్నే అయితే, నాకు అన్ని విధాలుగా సాయం కావాలి. ప్రభుత్వం, పరిశ్రమ, సమాజం కలిసికట్టుగా నన్ను ఆదుకోవాలని కోరుకుంటాను.

ప్రభుత్వాలు పునఃపునః నన్ను బాధుతుడిగా మార్చకూడదని భావిస్తాను. ఒక్క ప్రభుత్వమే కాదు, కంపెనీలు, న్యాయస్థానాలు, వైద్య, న్యాయ సంబంధ వృత్తులు నన్ను తిరిగి బాధుతుడ్ని చేయకూడదని భావిస్తాను అంటాడు.

ఈనాడు మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామంటే పర్యావరణం వల్ల మనకేమి హాని జరగనుందో గుర్తించలేని స్థితిలో ఉన్నాం.

అసలు పర్యావరణానికి ఏ హాని మానవాళి వల్ల జరుగుతూ ఉన్నదో గుర్తించకుండా పట్టని తనంతో ఉన్నాం.

పర్యావరణంతో ఎట్లా వ్యవహరించాలో తెలియకుండా ఉన్నాం. ఒక్క ముక్కలో చెవితే పర్యావరణ నిరక్షరాస్యులుగా ఉన్నామేమోననిపిస్తుంది. వ్యాధులు లేని ఉగాదులు చూడాలంటే పర్యావరణ హిత చైతన్యం అవసరం.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com




# చెస్ నెట్ వర్క్

## తెలంగాణలో 15,000 చెస్ బోర్డులను పంపిణీ చేయాలని లక్ష్యం!

ఈ కార్యక్రమం కేరళలోని మారొట్టిచాల్ అనే గ్రామం స్ఫూర్తిగా ప్రారంభించబడింది. ఆ గ్రామం 100% చెస్ సాక్షరత సాధించడమే కాకుండా, జూదం మరియు మద్యం సేవల వంటి సామాజిక సమస్యలను స్థానిక స్థాయి ప్రయత్నాల ద్వారా అధిగమించింది.

భావ పరిపుష్టి మరియు సానుకూల కార్యకలాపాల కోసం చెస్‌ను ఒక సాధనంగా ప్రోత్సహించేందుకు, చెస్ నెట్‌వర్క్ అనే లాభాపేక్ష రహిత సంస్థ తెలంగాణ వ్యాప్తంగా 15,000 చెస్ బోర్డులను పంపిణీ చేయడానికి ఓ పెద్ద కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం ప్రధానంగా గ్రామీణ మరియు అర్ధపట్టణ ప్రాంతాలను, ముఖ్యంగా మాజీ వరంగల్ జిల్లా సముదాయాలను లక్ష్యంగా చేసుకొని, చెస్‌ను గ్రామీణ జీవన శైలిలో ఒక అంతర్భాగంగా మార్చాలని ప్రయత్నిస్తోంది.

శనివారం (2024, డిసెంబర్ 28) చెస్ నెట్‌వర్క్, యు.ఎస్‌లో స్థాపితమైన ఫుట్‌ప్రింట్స్ అండ్ పేజెస్ అనే లాభాపేక్ష రహిత సంస్థతో కలిసి, రంగారెడ్డి జిల్లాలోని రెండు మండలాల్లో ం మడ్గుల్ మరియు ఇర్విన్ చెస్ సెట్‌లను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు 100కుపైగా చెస్ బోర్డులను అందజేయడంతో విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

“చెస్ యువ మేధస్సులకు వ్యూహం, సృజనాత్మకత మరియు జీవిత నైపుణ్యాలను అందిస్తుంది,” అని ఫుట్‌ప్రింట్స్ అండ్ పేజెస్ అధ్యక్షురాలు తరిణి నల్లవోలు పేర్కొన్నారు. ఆమె ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. “చెస్ నెట్‌వర్క్‌తో ఈ భాగస్వామ్యం ద్వారా మేము విద్యా వనరులను అందించడమే కాకుండా, వ్యూహాత్మక ఆలోచన మరియు సానుకూల వినోదాన్ని పెంపొందించే లక్ష్యాన్ని అనుసరించగలుగుతున్నాం.”

చెస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు సుధీర్ కొదాటి, చెస్ సామాజిక సంఘాలకు మార్పును తీసుకురాగల శక్తిని ప్రత్యేకంగా పేర్కొన్నారు. “చెస్ సమస్యల పరిష్కార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం మరియు సంకల్పాన్ని పెంపొందిస్తుంది. గ్రామాలలో ఈ ఆటను పరిచయం చేయడం ద్వారా, మేము సామాజిక మాధ్యమాల వ్యసనాలకు ప్రత్యామ్నాయంగా నిర్మాణాత్మక మార్గాన్ని అందించడమే కాకుండా, యువతలో మద్యపాన దురవ్యసనాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాము,” అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం కేరళలోని మారొట్టిచాల్ అనే గ్రామం స్ఫూర్తిగా రూపొందించబడింది. ఆ గ్రామం 100% చెస్ సాక్షరతను సాధించడమే కాకుండా, జూదం మరియు మద్యం వ్యసనాలను స్థానిక స్థాయి ప్రయత్నాల ద్వారా ఎదుర్కొంది. “మేము ఈ విజయాన్ని తెలంగాణలో, ముఖ్యంగా వరంగల్ నుండి ప్రారంభించి పునరావృతం చేయాలనుకుంటున్నాము,” అని శ్రీ కొదాటి అన్నారు.

హన్మకొండలో వరంగల్‌కు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఎరిగాయిసిని గౌరవించడానికి నిర్వహించిన పౌర స్వాగత కార్యక్రమం తర్వాత ఈ ప్రాధమికత మరింత ఉత్సాహం పొందింది. అర్జున్ ఎరిగాయిసి, కేవలం 21 సంవత్సరాల వయసులో 2800 ఇలో రేటింగ్‌ను దాటిన రెండవ భారతీయుడిగా గుర్తింపు పొందారు. ప్రపంచంలో 4వ స్థానం పొందిన ఆయన, ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చారు. “అర్జున్ విజయాలు తెలంగాణలో యువ ప్రతిభకు స్ఫూర్తినిస్తాయి. మా ప్రచారం ఈ ఉత్సాహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా సాగుతోంది,” అని శ్రీ కొదాటి పేర్కొన్నారు.

చెస్ నెట్‌వర్క్ ప్రధాన కార్యదర్శి రాజా రామ్ భాస్వపాత్రి సంస్థ యొక్క దూరదర్శితిని పంచుకున్నారు: “మేము స్వచ్ఛంద సేవకులు, ప్రాయోజకులు మరియు సంస్థలను మా వెంట చేరమని కోరుతున్నాము. చెస్ బోర్డులను దానం చేయడం నుండి చెస్ నేర్పించడం వరకూ, ఈ మార్పుని తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ పాత్ర పోషించవచ్చు.”

చెస్ నెట్‌వర్క్ ఇప్పటికే దండేపల్లి మరియు వంగర వంటి గ్రామాల్లో చెస్ బోర్డులను పంపిణీ చేసింది. ఈ ప్రచారాన్ని ఇతర జిల్లాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పర్వతగిరి మరియు పరిసర ప్రాంతాల్లో చెస్ బోర్డులను పంపిణీ చేయడానికి తన మద్దతుగా చెస్ బోర్డులను అందిస్తానని ప్రకటించారు.

–చెస్ నెట్ వర్క్, తెలంగాణ

# సాంస్కృతిక పండుగ లోహ్రి



**భా**రత దేశం పండుగుల నేల. భారత దేశంలో, సంవత్సరంలో ఏదైనా నెలలో గాని లేదా ఏదైనా ఋతువులో గాని పండగ జరగకుండా అనమయం గడిచింది అని ఊహించుకోవడమే ఎంతో కష్టతరమైన విషయం. అంతలా భారతీయులను పండగలు పలకరిస్తుంటాయి. ఈ పండగలను చేసుకొనే విధానాలు ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కానీ, పండుగలో ఉన్న సారాంశం, పరస్పర సామరస్యం మాత్రం చెక్కు చెదరకుండా అన్ని పండుగల్లో, అన్ని ప్రదేశాల్లో అలాగే ఉంటాయి.

వ్యవసాయానికి మూల స్తంభాలుగా ఉండే రాష్ట్రాలు లేదా దేశం ఏదైనా, పంటకోత సందర్భంగా పండుగలు చేసుకోకపోతే అది నిజంగా ఆశ్చర్యపడాల్సిన విషయమే. ఎందుచేతనంటే, వ్యవసాయం చేసేవారు పంటకోత సమయంలో వారికి వచ్చే దిగుబడి, రాబడికి గాను ఎంతో కృతజ్ఞతతో వారి ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పండగ చేసుకుంటారు.

ఉత్సహపూరితమైన రాష్ట్రాల్లో ముందుండే పంజాబ్, హర్యానా రాష్ట్రాలు, లోహ్రి అనే వ్యవసాయానికి సంబంధించిన పండుగను జరుపుకుంటాయి. ఈ పండుగ యొక్క విశిష్టతల గురించి తెలుసుకుందాం.

**లోహ్రి యొక్క శబ్దవ్యుత్పత్తి :**

లోహ్రి అనే పదం ఉద్భవించడం వెనుక ఎన్నో కథలు ఉన్నాయి. ఈ పదం 'లోహ్' అనే పదంతో ఉద్భవించిందని ఒక కథ ప్రచారంలో ఉంది. 'లోహ్' అంటే ఇనుము అని అర్థం. మందమైన ఇనుము బాండీలను పండుగ సందర్భంగా రకరకాల మసాలాలు తయారు చేయడంలో భాగంగా ఉపయోగిస్తుంటారు. ఇక్కడి నుండే ఈ పండుగకు ఈ పేరు వచ్చిందని చెబుతారు. జానపద కథలు చెప్పేవారు మాత్రం పూర్వం ఇద్దరు తోబుట్టువులు ఉండేవారని వారి పేరు హోళికా మరియు లోహ్రి. హోళికా హోలీ సందర్భంగా వేసిన మంటల్లో చిక్కుకొని చనిపోయిందట, లోహ్రి బ్రతికిపోయాడట. ఆలా లోహ్రి బ్రతికిపోవడంతో ఆ ఆనందాన్నే ఇలా పండగ రూపంలో జరుపుకుంటున్నారని చెబుతారు.

**వ్యవసాయం విజయవంతమవడం :**

భారతదేశం వ్యవసాయంపై ఆధారపడ్డ దేశం. భూసారవంతమైన నేలలు కలిగిన పంజాబ్ మరియు హర్యానా రాష్ట్రాల్లో ఈ మాట మరింత నిజమైనది అని అనిపించకమానదు. ఇలాంటి ప్రదేశాల్లో తాము పడ్డ కష్టానికి, పెట్టిన పెట్టుబడికిగాను చివరిగా వచ్చే పంట దిగుబడి, పంటకోత సమయంలో వచ్చే రాబడి, ఇక్కడివారికి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఇలాంటి సందర్భంలో జరుపుకొనే పండగనే లోహ్రి అంటారు. అందుచేతనే పంజాబీ ప్రజల గుండెల్లో ఈ పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది.

**తరువాతి తరాలకు సాంస్కృతిక సమగ్రతను అందిస్తున్నారు**

లోహ్రి పండగలో ముఖ్యమైన భాగం ఏమిటంటే, ఈ పండగ సందర్భంగా చిన్నపిల్లలు ఇంటింటికి వెళ్లి జానపద పాటలు పాడుతారు. వీరు ఇలా పాడుతున్నందుకు గాను, ఆ ఇంటివాళ్ళు బెల్లం, గింజలు, డబ్బు, ఈ రోజుల్లో చాకోలెట్స్‌ని వారికి బహుమతిగా ఇస్తున్నారు. ఇలా చేయడం ద్వారా పిల్లలకు ప్రోత్సాహకం లభిస్తుండటంతో వారు కూడా ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇలా చేయడం ద్వారా, వీరు సంస్కృతి, విలువల గురించి ఎంతగానో నేర్చుకుంటున్నారు. వీటి వల్ల వీరి వ్యక్తిత్వం కూడా ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. అందుచేతనే సంప్రదాయకమైన పంజాబీ కుటుంబాలన్నీ ఈ



పండుగకు ఎంతో ప్రాముఖ్యతని ఇస్తాయి.

**బంధాలన్నీ బలపడే సమయం :**

లోహ్రి పండుగ సందర్భంగా కుటుంబంలో ఉన్న స్త్రీ, పురుషులు అందరూ ఇంటి నుండి బయటకు వచ్చి పంజాబీ జానపద నృత్యాలు చేస్తారు. భోగి మంటను మధ్యలో పెట్టి వీరు ఆ నృత్యం చేయడం ఆనవాయితీ. సాధారణంగా స్త్రీలు గిద్ద అనే నృత్యం చేయగా, పురుషులు బాంగ్రా అనే నృత్యం చేస్తారు. పాటలు



పాడటం, నృత్యం చేయడం వంటి ఎన్నో ఉత్సాహవంతమైన కార్యక్రమాల్లో పాల్గొంటూ, రాత్రంతా అక్కడివారంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. ఆ భోగి మంటలు అలా మండుతూ ఉండటం కోసమై పల్లీ పట్టీని, పాప్ కార్న్, వేరు సెనగకాయలను ఇలా మరికొన్ని వాటిని ఆ భోగి మంటలో వేస్తారు. వీరు చేసే ఈ పనులన్నీ పిల్లల్లో, కుటుంబ సభ్యుల్లో, సమాజంలో మతసామరస్యం పెంపొందించడంలో ఎంతగానో కీలక పాత్ర పోషిస్తాయి.

**రుచికరమైన ఆహారాలు తినటం :**

సాధారణంగా భారతీయులు వారు తినే ఆహారం పట్ల చాలా జాగ్రత్త వహిస్తారు. ఏదైతే ఉత్తమంగా ఉంటుందో దానిని తినడానికే ఎక్కువగా ఇష్టపడతారు. ఇక పండుగ సమయంలో వీటి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆహారాన్ని తినటానికి ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ పంటకోత పండుగ సందర్భంగా చేసే సర్సోన్ డా సాగ్, మక్కి ది రోటీ మరియు ఖీర్ గురించి ప్రస్తావించకపోతే అసంపూర్తిగా చెప్పినట్లు అవుతుంది. ఇవి ఈ పండుగ యొక్క సారాంశాన్ని, స్వచ్ఛమైన రూపాన్ని అందరికి తెలియజేస్తాయి.

**సూర్యదేవునికి సమర్పణలు :**

మనందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, సరైన పంట దిగుబడి రావాలంటే సరైన వెలుగు కూడా అవసరం. అందుచేతనే సూర్యదేవునికి సమర్పణలు చేయడం ద్వారా సూర్యుడిని ప్రసన్నం చేసుకోవచ్చని, అందుకు ప్రతిఫలంగా మొక్కజొన్న పొలాలు మరింత దిగుబడిని సాధిస్తాయని ఇక్కడి ప్రజలు బలంగా నమ్ముతారు. చివరకు ఇదంతా మనుష్యులు మరియు జంతువులు ఈ భూమిపై ఆనందంగా ఉండటానికి ఎంతగానో తోడ్పడతాయి.

**చల్లని శీతాకాలాలు :**

జనవరి మాసం మధ్యలో లోహ్రి పండుగను జరుపుకుంటారు. ఈ సమయంలో సూర్యుడు మకరరాశి నుండి తప్పుకొని, ఉత్తరం వైపుకు జరుగుతాడు. ఖగోళ శాస్త్రం ప్రకారం ఈ సందర్భాన్నే ఉత్తరాయన్ అని కూడా పిలుస్తుంటారు. శీతల కాలంలో విపరీతమైన చలి కూడా ఉంటుంది. ఈ అతి చల్లని శీతలకాలం కారణంగానే భోగిమంట కేంద్రంగా లోహ్రి పండగను జరుపుకోవడం జరుగుతుంది. అలా భోగిమంటకు, శీతల కాలానికి ఒక ప్రత్యేకమైన అనుబంధం ముడిపడి ఉంది.


**ఆత్మ సంతృప్తి :**

కావాల్సిన మేర ఆహారాన్ని ఆరగించడం, ఇతరులకు సహాయం చేయడం ద్వారా ఈ లోహ్రి పండుగ జరుపుకున్న అందరిలో ఒకరకమైన ఆత్మ సంతృప్తి కలుగుతుంది. ఇది ఈ పండుగ యొక్క ప్రత్యేకమైన, అతిముఖ్యమైన విశిష్టత. లోహ్రి సందర్భంగా ప్రజలు ఎంతో శాంతంగా వారి వారి కుటుంబ సభ్యులతో, ఒక మంచి భావంతో ఈ పండగను జరుపుకుంటారు. మరొక నిజం ఏమిటంటే, సిక్కులు, పంజాబీలు భోగి మంట చుట్టూ చేరి గురు గ్రంథ్ సాహిబ్ నామస్మరణ చేస్తారు. భోగి మంట ముందు ధ్యానం కూడా చేస్తారు.

– ఎసికె. శ్రీహరి,
m : 9849930145
e : ackvs08@gmail.com

# ఉమ్మడి కడప జిల్లా శిలా మరియు ఖనిజసంపద

ఉమ్మడి కడపజిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోని ముఖ్యమైన భాగం. ఈ జిల్లా 15380 చదరపు కిలోమీటర్లలో విస్తరించియున్నది. ఈ జిల్లాకి దక్షిణంలో చిత్తూరు జిల్లా, తూర్పులో నెల్లూరు జిల్లా, ఉత్తరంలో కర్నూలు, ప్రకాశం జిల్లాలు మరియు పశ్చిమంలో అనంతపురం జిల్లా కలదు. ఈ జిల్లా ఖనిజసంపదకు ప్రసిద్ధి చెందినది. ఎందుకంటే ఈ జిల్లాలో ఆస్‌బెస్టోస్, బెరైటీస్, యురేనియం, లైమస్టోన్, లెడ్, జింక్, టాల్క్ స్టియటైట్, డైమండ్, ఓకర్ మరియు ఐరన్‌ఓర్ నిక్షేపాలు పుష్కలంగా ఉండటం వలన.



ఈ జిల్లాలో ఆర్క్యన్ పీరియడ్‌కు చెందిన గ్రానైట్, నైస్‌ల యొక్క రకరకాల వేరియంట్స్, ధార్వార్ సూపర్‌గ్రూప్‌కు చెందిన వెలిగల్లు శిస్ట్ బెల్టుకు చెందిన శిస్ట్ బి.ఐ.ఎఫ్ మరియు మెటావాల్ కానిక్స్, మీసో ప్రోటిరో జోయిక్ పీరియడ్‌కు చెందిన కడప సూపర్‌గ్రూప్ యొక్క సెడిమెంటరీ శిలలు, ఈ శిలలను మూడు గ్రూప్‌లలో జతపరిచారు. అవి పాపాగ్ని, చిత్రావతి, నల్లమలాయ్ గ్రూప్‌లు. వీటిలో కంగ్లామరేట్, క్వార్ట్జైట్, సాండ్ స్టోన్, చెర్ట్ ఫిలైటు, మడ్ స్టోన్, డొలమైట్ బేసిక్ ఫ్లోస్ మరియు ఇంట్రూసివ్స్. నల్లమలై గ్రూప్ శిలలు హైలీ ఫొలియేటెడ్ సీక్వెన్స్ చూడగలము.

కర్నూలు గ్రూప్ శిలలను పశ్చిమ ప్రాంతంలో చూడగలము. వీటిలో బనగానపల్లి కంగ్లామరేట్, నగరి క్వార్ట్జైట్, ఔక్‌శేల్ పాన్యం, క్వార్ట్జైట్ కోయిల్ కుంట్ల లైమస్టోన్ మరియు నంద్యాల శేల్. ఈ గ్రూప్ శిలలు నియోప్రోటిరోజోయిక్ పీరియడ్‌కు చెందినవి.

ఈ జిల్లాలోని ముఖ్య నదులు పెన్నేరు మరియు దీని ఉపనదులు చెయ్యేరు, కుందేరు, సాగిలేరు వాటి డ్రైనేజ్ నెట్‌వర్క్. ఈ జిల్లాలోని డ్రైనేజ్ ప్యాటర్న్ ప్యారెలెల్ నుండి సబ్ ప్యారెలెల్‌గా ఉంటుంది. చాలా వరకు స్ట్రక్చరల్ కంట్రోల్‌లో ఉంటవి. ప్రముఖమైన ల్యాండ్ ఫారమ్స్ గండికోట వద్ద లోతైన గార్జ్ మరియు నల్లమలై ప్రాంతంలో హై క్వార్ట్జైట్ రిడ్జస్ మరియు డీప్ స్ట్రక్చరల్ లోయలు కలవు. సీస్ మే టెక్‌టానిక్ స్టడీస్ ప్రకారం ఈ జిల్లాలోని ప్రాంతంలో రెండు జోన్స్ అనగా జోన్-1 మరియు జోన్-2గా నిర్ధారించారు.

**ఖనిజసంపద:**

కడప జిల్లాలో ఖనిజ సంపద పుష్కలంగా ఉన్నది. ఈ జిల్లాలో ప్రసిద్ధిచెందిన మంగంపేట బెరైటీస్, పులివెందుల ఆస్‌బెస్టాస్, బనగానపల్లి డైమండ్ బెల్టులతో పాటు గోల్డ్, ఐరన్ ఓర్, లెడ్, జింక్, లైమ్‌స్టోన్, హైగ్రేడ్ ఓకర్ యురేనియం, స్టీయటైట్, టంగ్‌టన్ క్లేన్, మాగ్నసైట్, బిల్డింగ్ స్టోన్స్ యొక్క నిక్షేపాలు కలవు. వీటి గురించి చర్చించుకుందాము.

**బెరైటీస్:**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన మంగంపేట బెరైటీస్ డిపాజిట్ కడప సూపర్ గ్రూప్‌కు చెందిన పుల్లంపేట పార్మేశన్‌లో వున్నది. ఇది నల్లమలై గ్రూప్‌లోని కుంభం ఫార్మేశన్‌తో కొరిలేట్ చేయ బడినది. ఈ బెరైట్ డిపాజిట్ రెండు లెన్సోయి డల్ బాడీస్ రూపంలో టుఫ్ సీక్వెన్స్‌లో దొరుకుతుంది. మంగంపేట వద్ద ఉన్న బెరైట్‌లెన్స్‌ను సథరన్ లేన్స్ అని అందురు. మరి దీనికి 700 మీ. దక్షిణంలో కొంత చిన్న లెన్స్ కలదు. దీన్ని నార్తర్న్ లెన్స్ అని అందురు.

అసలు ఓర్ బెడ్ ఎక్కడైతే ఎక్కువ మొత్తం బెరైటీస్ ఖనిజం ఉన్నదో అది ఒక ట్రిఫ్ ఆకారంలో కలదు. ఇది 1320మీ. నార్త్-సౌత్ దిశలో మరియు 920 మీ. ఈస్ట్-వెస్ట్ దిశలో ఉన్నది. ఈ ఖనిజం యొక్క చాలా మొత్తం తిక్ టాఫ్ ఓవర్ బర్డెన్ క్రింద ఉన్నది. ఇక్కడ బెరైటీస్ పలు రకాలుగా ఉంటుంది. ఉదాహరణకు 1. బెడ్డెడ్ గ్రే గ్రానులర్ 2. లా పిల్లి రొసెట్‌టైప్ 3. వీన్, కాని ఫ్రాక్చర్ ఫిల్లింగ్ టైప్ 4. రిప్లేస్‌మెన్ట్ టైప్ గ్రానులర్



మంగం పేట బైరైట్స్



పాన్యం క్వార్ట్ జైట్

టైడ్ రిజర్వ్స్ 45.91 మిలియన్ టన్స్, 200 మీ. లోతు వరకు ఇక్కడ BaSO4 91.8 శాతం ఉంటుంది. లా పిల్లి రొసెటహోటైప్ బైరైటీస్ 2057 మిలియన్ టన్స్ రిజర్వ్స్ మరియు $BaSO_4$ 60 నుండి 92 శాతం ఉంటుంది. ఇది కాకుండా చిన్న చిన్న బైరైటీస్ నిక్షేపాలు, కమలాపురం, కోదూరు, రాజంపేట, కడప మరియు సిద్దవటం తాలూకాలలో దొరుకుతుంది.

**అస్‌బెస్టాస్:**

ఈ ఖనిజం పులివెందుల మరియు లింగాల మండలాలలో, ఓక్ బెల్ట్‌గా గుర్తించబడింది. ఈ ప్రాంతంలో డొలమైట్ శేల్, చెర్ట్‌తో పాటు బెసాల్ట్ ఫ్లోస్/ డొలరైట్ సిల్స్ శిలలను చూడగలము. ఈ శిలలు వేంపల్లి ఫార్మేశన్‌కు చెందినవి. పులివెందుల క్వార్ట్జైట్, తాడిపత్రి శేల ఫార్మేశన్‌కు చెందినది. ఇది చిత్రావతి గ్రూప్‌కు చెందినవి. పాపాగ్నికి చిత్రావతికి మధ్యన ఉన్న కాంటాక్ట్ ఒక డిస్ కన్ఫర్మిటి.

పులివెందుల ఆస్‌బెస్టాస్ బెల్ట్‌లోని శిలలు WNW-ESE నుండి -NW-SE దిశలలో ట్రెండ్ అవుతాయి. వీటి డిప్స్ $12^{\circ}$ నుండి $18^{\circ}$ మధ్యలో ఉంటవి. ఈ బెల్ట్‌లో పలు ట్రాన్స్‌వర్స్ ఫాల్ట్‌లు కలవు. ఈ బెల్ట్ 25 కి.మీ. పొడవు కలదు. ఇందులో లింగాల-బ్రాహ్మణపల్లికి మధ్యలో ఉన్న 13 కి.మీ. ఆస్‌బెస్టోస్ ఎక్కువగా ఉంటుంది. జి.ఎస్.ఐ. బ్రాహ్మణపల్లిలో 14 బోర్స్, రామనాతపల్లిలో 20 బోర్స్, లింగాలలో 17 బోర్స్ డ్రిల్ చేసారు. మంచి మినరలైనేశన్‌ను రిపోర్ట్ చేసారు. ఈ క్రైసోటైల్ ఆస్‌బెస్టోస్‌ని పేపర్ బ్లాక్స్, సిమెంట్ ప్రొడక్ట్స్, బ్రేక్ లైనింగ్స్, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ పేంట్స్, ఇన్సులేటింగ్ మెటీరియల్స్‌లో ఉపయోగిస్తారు.

**డైమండ్:**

బనగానపల్లి ఫార్మేశన్‌లో వజ్రాలు దొరుకుతవి. ఈ ఫార్మేశన్ 30 మీ. తిక్‌నెస్‌తో కూడి ఉన్నది. బనగానపల్లి, రాచర్ల బెల్ట్‌లో కంగ్లామరేట్ శిలలో బ్యాన్‌డెడ్ రెడ్ జేస్‌పార్, పసుపు, నీలిరంగుల చెర్ట్, శేల్ ట్రాప్, మరియు క్వార్ట్జ్. ఈ ప్రాంతంలో వజ్రాల కొరకు పురాతన మైనింగ్ సైట్స్ సాండ్‌స్టోన్/ క్వార్ట్జైట్‌లో కంగ్లా మరేట్ పొరలో చూడగలము. ఈ పురాతన సైట్స్ చాలా వరకు గ్రావెల్స్‌లో బనగానపల్లి, మునిమడుగు, ఆలహాబాద్ ప్రాంతాలలో పిట్స్, ట్రెంచస్ మరియు షాఫట్స్‌ను పోలియున్నవి. ఈ బ్లాక్‌లో యావరేజ డైమండ్ ఇన్సిడెన్స్ 2Cpht కన్నా ఎక్కువ. మునిమడుగు-రాచర్ల బ్లాక్‌లో 1.53m.t సాంపిల్‌లో 0.03c.t. డైమండ్ దొరికినది. ఇక్కడ డైమండ్ ఇన్సిడెన్స్ ఎర్రాటిక్‌గా దొరుకును. 0.35pht నుండి 2.03 cpht మధ్యలో ఉన్నది. ఇందులో 76 శాతం ఇండస్ట్రియల్ వెరైటీగా ఉన్నది. ఇప్పటి వరకు దొరికిన డైమండ్స్‌లో అన్నిటికన్నా పెద్దది 6.15 క్యారెట్స్ ఉన్నది.

**బంగారం:**

వెలిగల్లు శిస్ట్ బెల్ట్ యొక్క కొంత భాగం కడప జిల్లాలో కలదు. పురాతన మైనింగ్ సైట్స్ చాలానే ఉన్నవి. ఈ ప్రాంతంలో ఈ బెల్ట్‌లో జి.ఎస్.ఐ మూడు బ్లాక్‌లో అనగా తెల్లికొండ తలముకుంట మరియు గూటమీదిపల్లెలో గోల్డ్ వ్యాలూస్ 2.29PPM నుండి 3.3PPM వరకు ఉన్నట్లు నిర్ధారించారు. గోల్డ్ క్వార్ట్జ్ వీన్స్‌లో మరియు మస్కోవైట్ శిస్ట్- బ్యాండెడ్ ఐరన్ ఫార్మేశన్ కాంటాక్ట్‌లో దొరుకుతుంది.

**ఐరన్‌ఓర్:** ఈ జిల్లాలో ఐరన్ ఓర్ కడప సూపర్‌గ్రూప్‌కు చెందిన ఫెరుజినస్ సెడిమెంట్స్‌లో చబాలి, పగడాలపల్లి, రాజంపేట ప్రాంతాలలో కలదు. చబాలి వద్ద ఐరన్‌ఓర్ 54 శాతం 65 శాతం Fe, రాజంపేట వద్ద 58-60 శాతం Fe గా నిర్ధారించారు. వీటి రిజర్వు 20Mt ఉన్నట్లు తెలిపారు.

**బేస్‌మెటల్స్:**

లెడ్-జింక్ మినరలైజేశన్ కాపర్‌తో కూడియున్నది. జంగంరాజుపల్లి-వరికుంట బెల్ట్‌లో ఈ బెల్ట్ నార్త్-సౌత్ దిశలో 50 కి.మీ. పొడవు కలదు. జంగంరాజుపల్లి డిపాజిట్ చాలా ప్రముఖమైనది. ఇక్కడ ఖనిజాలు, గ్యలీనా, స్ఫాలరైట్‌తో కొంత పైరైట్ ఉన్నది. మినరలైజడ్ జోన్ కొన్ని సెంటిమీటర్ల నుండి 3.30 మీ. వరకు ఉంటుంది. ఈ ప్రాంతంలో ఐదు లోడ్స్ కలవు. ఈ మినరలైజడ్‌జోన్ యొక్క ఎక్స్‌ప్లోరేశన్ మొదలు జి.ఎస్.ఐ తరువాత ఎమ్.ఇ.సి.ఎల్. చేశారు. దీని రిజర్వు జి.ఎస్.ఐ రెండు సెక్శెన్స్‌లో 100 మీ. మరియు 150 మీ. లోతువరకు 0.37Mt గా నిర్ధారించారు. ఇక్కడ జింగ్ గ్రేడ్ .08 శాతం నుండి 4.21 శాతం మరియు లెడ్ గ్రేడ్ 1.08 శాతం నుండి 2.9 శాతం వరకు

ఉన్నట్టు నిర్ధారించారు. గొల్లపల్లి డిపాజిట్‌లో మూడు బ్లాక్స్‌ను గుర్తించారు. ఇక్కడ Pb-Zn మినరలైజేషన్ బ్రెక్ శియేటెడ్ డొలమైటిక్ లైమ్‌స్టోన్ కాంటాక్ట్ వద్ద ఉన్నది. ఈ డిపాజిట్‌లో లెడ్ గ్రేడ్ 1.8 శాతం జింక్‌గ్రేడ్ 1.7 శాతం మరియు రిజర్వు 3.47 Mt ఉన్నట్టు నిర్ధారించారు.

**లైమ్‌స్టోన్:**

సిమెంట్ గ్రేడ్ లైమ్‌స్టోన్ నార్జి ఫార్మేశన్‌కు చెందినది. జమ్మలమడుగు, కోడూరు, నిడుజువ్వి, పొన్నటోలా, తలమంచి పట్నం, ఎర్రగుంట్ల, కమలాపురం ప్రాంతాలలో దొరుకుతుంది. ఎర్రగుంట్ల వద్ద వున్న లైమ్‌స్టోన్‌ను CCI వాళ్లు సిమెంట్ ప్లాంట్ కొరకు ఉపయోగిస్తున్నారు.

**ఓకర్:**

రకరకాల రంగులలో హైగ్రేడ్ ఓకర్స్ కర్నూలు గ్రూప్‌కు చెందిన అవుక్‌శేల్స్‌లో దొరుకుతుంది. వీటిని పెంట్‌పిగ్‌మెంట్ పరిశ్రమలో ఎక్కువగా వాడుతారు. వీటి నిక్షేపాలు పాపాయపల్లి, పెద్దవనువుల ప్రాంతాలలో కలవు.

**స్టీయటైట్:**

ఇది మాగ్నిశియం సిలికేట్‌తో హైడ్రాక్సిల్ మాలిక్యుల్ ($Mg_3Si_4O_{10}(OH)_2$). స్వచ్ఛమైన టాల్క్ తెలుపు, వెండి, ఆకుపచ్చ రంగులలో ఉంటుంది. ఇది ఫైర్ ప్రూఫ్ మరియు యాసిడ్ రెసిస్టెంట్ ప్రాపర్టీస్ ఉండటం వల్ల దీన్ని ఎలక్ట్రికల స్విచ్‌బోర్డ్‌లలో, యాసిడ్ ప్రూఫ్ టేబుల్ టాప్స్ తయారీలో వాడతారు. దీన్ని ఎక్కువగా టాల్కం పౌడర్ తయారీలో వాడతారు. ఇది వేంపల్లి ఫార్మేశన్ యొక్క డొలమైట్-బేసిక్ సిల్స్ కాంటాక్ట్ జోన్‌లో దొరుకుతుంది. ఈ జిల్లాలో లింగాల, ప్రనపల్లి, జంగారెడ్డిపల్లి, పులసల నూతపల్లి ప్రాంతాలలో వేంపల్లి డోలమైట్‌లో ల్యామినేషన్స్, బ్యాండ్స్ రూపంలో దొరుకుతుంది. ఈ బ్యాండ్స్ కొన్ని సెంటిమీటర్ల నుండి 10 సెంటిమీటర్ల వరకు వుంటుంది. వీటి రిజర్వ్స్ 7600 టన్నులుగా నిర్ధారించారు.

**టంగ్స్టన్:**

వోల్‌ఫ్రమైట్ ($(FeMn)WO_3$) టంగ్స్టన్ మొక్క ముఖ్యమైన ఖనిజం. దీన్ని ఎలెక్ట్రికల్ బల్బుల ఫిలమెంట్స్‌లో, ఎక్స్-రే మశీన్లలో, టి.వి అప్పరేటిస్‌లో, హైస్పీడ్ స్టీల్, స్టీల్ ఆర్మర్ గన్ బ్యారెల్స్, రెసిస్‌టెంట్ వైర్స్‌లో, రెజర్‌బ్లేడ్స్‌లో ఉపయోగిస్తారు. చాలావరకు కొద్ది మొత్తంలో పెగ్మటైట్ వీన్స్ మరియు క్వార్ట్జ్-ఫైల్స్ పాతిక బ్యాండ్స్‌లో దొరుకుతుంది.

**యురేనియం:**


ఈ జిల్లాలోని యురేనియమ్ మినరలైజేశన్ దేశంలోనే అతిపెద్ద డిపాజిట్‌గా పరిగణించబడినది. ఈ డిపాటిట్ జీ.ఎస్.ఐ జియాలజిస్ట్‌లు 1986లో పి.ఎ.సిన్హా మరియు రవీంద్రబాబు మొట్టమొదట కనుగొన్నారు. తరువాత ప్రభుత్వ పాలసీ ప్రకారం దీన్ని ఎ.ఎం.డి.కి అప్పచెప్పారు.

ఈ మినరలైజేశన్ కడప సూపర్‌గ్రూప్‌కు చెందిన వెంపల్లి సిలిశియస్ డొలమైట్. గువ్వలచెర్వు క్వార్ట్జైట్ కాంటాక్ట్ జోన్‌లో దొరుకుతుంది.

ఈ మినరలైజేశన్ తుమ్మలపల్లి ప్రాంతంలో 0.02 శాతం మరియు వేంపల్లి ప్రాంతంలో 0.04 శాతం యురేనియం ($U_3O_8$) కలదు. రిజర్వు ఎ.ఎం.డి ఈ డిపాజిట్‌ని మైనింగ్ చేస్తున్నారు. ఇది ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద యురేనియమ్ మైన్. దీని రిజర్వు ఎం.ఎం.డి ప్రకారం 5000 టన్స్ $U_3O_8$ తుమ్మలపల్లి వద్ద.



వోల్కా నిక్ యాష్



క్వార్ట్ జైటీ

**క్లేస్:**

ఈ జిల్లాలో క్లే నిక్షేపాలు పుష్కలంగా ఉన్నవి. ముఖ్యంగా కోడూరు, రాజంపేట, కడప ప్రాంతాలలో గోడేల వద్ద కుంభం శేల్‌లో రకరకాల రంగులలో ఇంప్యూర్ క్లే నిక్షేపాలు ఉన్నవి. హస్తవరం, తాళ్లపాక ప్రాంతాలలో తెలుపు రంగు క్లే నిక్షేపాలు పష్కలంగా ఉన్నవి.

**మాగ్నసైట్:**

లోగ్రేడ్ క్రిస్టలైన్ మాగ్నసైట్ వేంపల్లి టౌన్‌కు 3 కి.మీ. దక్షిణంలో మరియు కుమారపల్లికి 2.5 కి.మీ. ఆగ్నేయంలో దొరుకుతుంది.

**బిల్డింగ్‌స్టోన్స్:**

ఈ జిల్లాలో బిల్డింగ్ మెటీరియల్ పుష్కలంగా లభిస్తుంది. క్వార్ట్జైట్స్, లైమ్‌స్టోన్, డొలమైట్స్ రూపంలో వీటిని విస్తృతంగా క్వారీ చేస్తున్నారు. కడప, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల ప్రాంతాలలో నార్జి లైమ్‌స్టోన్‌ను విస్తృతంగా క్వారీ చేస్తున్నారు. రాయచోటి ప్రాంతంలో గ్రానైట్, నైస్ క్వారీ చేస్తున్నారు. కన్‌స్ట్రక్షన్స్‌లో ఉపయోగిస్తున్నారు.

**వాలకానిక్ ఏ ష్:**

ఇది మొట్ట మొదలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని సాగిలేరు బేసిన్‌లో గుర్తించారు. ఇది సుమాత్రా దివికి చెందిన టోబా వాల్కా నిజం తో కోరీ లేట్ చేశారు. ఇది 75000 సంవత్సరాల క్రితం జరిగినట్టు నిర్ధారించారు. దీనిని సబినా పౌడర్‌లో ఉపయోగిస్తున్నారు.


– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com





# దేశ ఆర్థిక అభివృద్ధిలో టూరిజం

పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో పర్యాటక రంగ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం జనవరి 25న భారతదేశంలో జాతీయ పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, ఆర్థిక విలువలపై పర్యాటక రంగం ప్రభావం చూపుతుంది. భారతదేశం అద్భుతమైన పర్వతాలు, అడవులు, సముద్ర తీరాల నిధి అయినందున ఇది అందమైన పర్యాటక ప్రాంతం. ప్రకృతిని రక్షించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి ఈ దినోత్సవం ఒక అద్భుతమైన మార్గం.




భారత ఉపఖండం పర్యాటకుల కోసం అనేక అంశాలను కలిగి ఉంది. మెరిసే ఇసుకతో విస్తారమైన బీచ్‌లు, మంచుతో కప్పబడిన అద్భుతమైన పర్వతాలు, అరుదైన, అందమైన వృక్షజాలం, జంతుజాలం, సాహసోపేత అడవులు, జలపాతాలు, పర్వత శిఖరాలు, ఎడారులు ఇలా ఎన్నో ప్రత్యేకమైన అందాలు భారత్ సొంతం.

## తెలంగాణలో పర్యాటక ప్రాంతాలు

పురాతన కట్టడాలనే కాకుండా.. సంప్రదాయ ఉత్సవాలను ఆస్వాదించేందుకూ ఇక్కడకు వచ్చేవారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుంది.

నల్లమల అందాలు, ప్రాణహిత అభయారణ్యం, అనంతగిరి కొండలు, నాగార్జున సాగర్, కాళేశ్వరం ప్రాజెక్ట్, కోట్‌పల్లి, లక్నాపూర్, కాగ్నానది, ఎగువ మానేరు, మంజీరా నది, టేక్రియాల్ చెరువు, పాకాల చెరువు, కాకతీయులు కట్టించిన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ కోట, రామప్ప దేవాలయం, ప్రతాపరుద్ర నక్షత్రశాల, త్రికూటాలయం, రంగశాయిపేట, జలవిద్యుత్ కేంద్రం, ఎత్తిపోతల పథకం, బుద్ధవనం, నాగార్జున కొండ, డిండి ప్రాజెక్టు, భీముని పాదం జలపాతం, కొరవి వీరభద్రస్వామి, కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం, శివారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, బుగ్గ రాజేశ్వరాలయం, సత్యనారాయణస్వామి ఆలయం, గుట్ట మల్లన్న స్వామి-వేలాల, లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఏకశిల, ఖుష్ మహల్ ఇలా అనేకం తెలంగాణ ప్రాంతంలో చూడవచ్చు. ఇవి పర్యాటకలకు కనువిందు చేస్తాయి.

## హైదరాబాద్ నగరంలో చారిత్రక కట్టడాలు

- కుతుబ్‌షాహీలు, ఆసఫ్‌జాహీల కాలం నాటి చారిత్రక కట్టడాలు నగరానికి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. చార్మినార్, మక్కామసీదు, గోల్కొండ, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్ నగర చారిత్రక వైభవానికి దర్పణంగా నిలుస్తున్నాయి.
- లుంబినీ పార్క్, కేబీఆర్ పార్కు, సంజీవయ్య పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, సాలార్జంగ్ మ్యూజియం, స్టేట్ మ్యూజియం, జీఎస్ఐ వంటి సంగ్రహాశాలలు, జూ పార్కు నగర ప్రత్యేకతను చాటుతున్నాయి.
- చౌమొహల్లా ప్యాలెస్ శిల్పకళ అద్భుతం. అరణ్యంలో సంచరించే అనుభవం కలిగించే జూపార్కు, నిజాంల రాజప్రసాదాలు, మ్యూజియంలు, హుస్సేన్ సాగర్‌లో బోటు షికారు... ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు ఇలా అంతా మనోహరమే.
- నగరానికి వచ్చిన స్వదేశీ, విదేశీ యాత్రికులకు గోల్కొండ కోట చూడందే పర్యాటక దాహం తీరదు. రోజంతా తనివి తీరా చూసి మురిసిపోతారు. గైడ్లు ఇక్కడి అందాలను వివరించిన తీరుకు మంత్రముగ్ధులవుతారు.

– కె. సచిన్, m : 86866 64949
e: desk.deccan@gmail.com

UNESCO

వరల్డ్ హెరిటేజ్ సైట్



# మహాబలిపురం చారిత్రక వారసత్వ కట్టడాలు

**ప్రాంతం:** తమిళనాడు

**జాబితాలో చేర్చిన సం.:** 1984

**వర్గం:** సాంస్కృతికం (కట్టడం)

మహాబలిపురంలోని చారిత్రక వారసత్వ కట్టడాలు సంప్రదాయ భారతీయ వాస్తుశిల్పంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాయి. మహాబలిపురం ఒకప్పుడు పల్లవ రాజవంశపు ప్రసిద్ధ ఓడరేవు నగరం. ఇక్కడి చారిత్రక వారసత్వ కట్టడాలలో రాతి గుహ దేవాలయాలు, ఏకశిలా దేవాలయాలు, బాస్-రిలీఫ్ శిల్పాలు ఇతర దేవాలయాలు అలాగే పురాతన దేవాలయాల తవ్వకాల అవశేషాలున్నాయి. ఈ కట్టడాలన్నీ ఏడు, ఎనిమిదవ శతాబ్దాలలో కోరమాండల్ తీరం వెంబడి రాతితో చెక్కబడ్డాయి. ఈ ప్రదేశం ప్రత్యేకించి రథాలు (రథాల రూపంలోని దేవాలయాలు), మండపాలు, భారీ బహిరంగ ప్రదేశాలు, అనేక అందమైన దేవాలయాలు, వేలకొద్దీ శివుడి శిల్పాలతో ప్రసిద్ధి చెందింది.



**ప్రమాణాలు:** (i) (ii) (iii) (iv)

(i): అర్జునుడి తపస్సు, గంగానది భూమి పైకి రావడాన్ని సూచించే బాస్ రిలీఫ్ శిల్పాలు ఒక ప్రత్యేక కళాత్మకతను కలిగిఉంటాయి.

(ii): ఈ శిల్పాల ప్రభావం, వాటి మోడలింగ్‌లోని మృదుత్వం, వంపుసొంపులు కాంబోడియా, అన్నమ్, జావా వంటి ప్రదేశాలకు విస్తరించింది.

(iii): మహాబలిపురం ఆగ్నేయ భారతదేశపు పల్లవ నాగరికతకు ప్రబల సాక్ష్యం

(iv): ఈ ప్రదేశం శివుని ఆరాధన ప్రధాన కేంద్రాలలో ఒకటి.

మహాబలిపురం వద్ద ఉన్న షోర్ టెంపుల్ భారతదేశంలోని పురాతన నిర్మాణ రాతి దేవాలయాలలో ఒకటి.

చెన్నైకి దక్షిణాన తమిళనాడు తూర్పు తీరంలో ఉన్న ఒక ముఖ్యమైన వ్యూహాత్మక ఓడరేవు మహాబలిపురం. ఒక గ్రీకు





నావికుడు తన రచన 'పెరిప్లస్ ఆఫ్ ది ఎర్త్రేరియన్ సీ' లో 'కావేరికి ఉత్తరాన ఉన్న ఓడరేవు'గా పేర్కొన్నాడు. చైనీస్ యాత్రికుడు యువాన్ త్సాంగ్ కూడా మహాబలిపురం ఓడరేవు స్థావరం గురించి ప్రస్తావించాడు. అయితే ఆయన దానిని 'కంచి' అని తప్పుగా పేర్కొన్నాడు. రోమన్ నాణేలు, కుండల వంటి పురావస్తు ఆధారాలు కూడా మహాబలిపురం ప్రాముఖ్యతను చాటాయి. దాన్ని ఒక ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ధ్రువీకరించాయి. పల్లవ రాజులు శ్రీలంక, ఆగ్నేయాసియాలతో వాణిజ్య, దౌత్య కార్యకలాపాలను నిర్వహించడానికి మహాబలిపురం ఓడరేవును ఉపయోగించారు. మార్కోపోలో బహుశా మహాబలి పురానికి వచ్చిన తొలి యూరోపియన్ సందర్శకులలో ఒకరు అతని తర్వాత చాలా మంది ఈ ప్రదేశాన్ని ఒకప్పుడు ఒడ్డుకు సమీపంలో ఉన్న ఏడు దేవాలయాల కారణంగా 'సెవెన్ పగోడాస్' గా పేర్కొన్నారు.



మహాబలిపురం లేదా మామల్లపురం సామాన్య శకం ఏడవ శతాబ్దంలో నర్సింహ వర్మన్-I చేత స్థాపించబడింది. ఇది తీరం వెంబడి ఉన్న చారిత్రక వారసత్వ కట్టడాలకు, సమీపంలోని కొండకు ప్రసిద్ధి చెందింది. వీటిని పంచ రథాల వంటి మోనోలిత్స్ గా, అర్జునుడి తపస్సు వంటి రాక్ రిలీఫ్స్ గా, ప్రసిద్ధ షోర్ టెంపుల్ వంటి గుహలు, దేవాలయాలుగా వర్గీకరించవచ్చు.

పంచ రథాలు అనేది ఒకే రాతితో చెక్కబడిన ఐదు ఏకశిలా దేవాలయాల చిన్న సమూహం. దేనికదేగా ఉండే నిర్మాణాలు బహుశా భారతదేశంలోని ప్రారంభ నిర్మాణాలు (ఎల్లోరాలోని కైలాస దేవాలయం కంటే కూడా ముందువి) కావచ్చు. ఈ దేవాలయాలు వివిధ పరిమాణాలు, ఎత్తులలో, వివిధ రకాల పైకప్పులను కలిగి ఉన్నాయి.

అర్జునుడి తపస్సు శిల్పం బహుశా సామాన్య శకం ఏడో శతాబ్దపు ప్రారంభంలో చెక్కబడి ఉండవచ్చు. ఇది భారతదేశంలోని అత్యంత ప్రత్యేకమైన రాక్ రిలీఫ్స్ లలో ఒకటి, బహుశా అతి పెద్దది కూడా. గంగానది అవరోహణ అని కూడా వ్యవహరించే ఈ ప్యానెల్ (సుమారు 29.5x13 మీటర్ల వరకు ఉంటుంది) రెండు పెద్ద గ్రానైట్ బండరాళ్లపై చెక్కబడింది. ఇది రెండు ఇతివృత్తాలను చూపుతుంది-అర్జునుడి తపస్సు, గంగానది భూమిపైకి రావడం. అందుకే ఈ ప్యానెల్ ను ఈ రెండు రకాల పేర్లతో వ్యవహరిస్తుంటారు. ప్రతీకాత్మకతతో నిండిన ఈ ప్యానెల్ పై ఏనుగులు, సింహాలు, పులులు, పంది వంటి అడవి, పెంపుడు జంతువులు, గణాలు, (అటెండెంట్లు), కిన్నరులు, గంధర్వులు, అప్సరసలు మరియు నాగులు వంటి చక్కగా అమర్చబడిన పౌరాణిక బొమ్మలను కలిగిఉంటుంది. అర్జునుడు తపస్సు చేస్తున్న శిల్పంలో యోగ భంగిమలోని వ్యక్తిని, అలాగే కొన్ని కోతులు, పిల్లి వంటి వాటిని చూడవచ్చు.

షోర్ టెంపుల్ సముద్ర తీరంలో నిర్మించబడింది. దూరం నుండి చూస్తే అద్భుతంగా కనిపిస్తుంది. అందు బాటులో ఉన్న పాత పెయింటింగ్స్, లితోగ్రాఫ్‌ల ప్రకారం, ఈ ఆలయం తీరం వెంబడి ప్రయాణించే నావికులందరికీ మనోహర దృశ్యంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రధాన ఆలయం ఐదు అంచెల పిరమిడ్ పైకప్పు, అలాంటి శిఖర ప్రొఫైల్‌తో ముందు భాగంలో వాకిలితో ఉంటుంది. ఇది దాదాపు 18 మీటర్ల ఎత్తు వరకు ఉంటుంది, గ్రానైట్ రాతి బ్లాక్ లతో తయారు చేయబడింది. దీని వెలుపలి గోడలు సముద్రం నుండి వచ్చే ఉప్పుతో కూడిన గాలులతో నిరంతర రాపిడి కారణంగా వాటి రూపురేఖలను కోల్పోయిన చిత్రాలతో ఉంటాయి. ఆలయ సముదాయం భాగాలు ఇసుక కింద కూరుకు పోయాయి. అవి ఇటీవల తవ్వకాలలో బయట పడ్డాయి.


మహాబలిపురంలో అర్జునుడి తపస్సు ప్యానెల్‌కు ఆనుకుని ఉన్న స్థానిక కొండలో అనేక గుహలు, చిన్న ఆలయ నిర్మాణాలు, శ్రీకృష్ణుని వెన్నముద్దగా ప్రసిద్ధి చెందిన ఒక పెద్ద, ప్రమాదకర స్థితిలో ఉన్న రాతి బంతి ఉన్నాయి. ఈ గుహలు, దేవాలయాలలో వరాహ గుహ, ఒలక్కనాథ ఆలయం, కృష్ణ మండపం, ధర్మరాజ మండపం, గణేశ రథం ప్రముఖమైనవి.

- జాన్విజ్ శర్మ
అనువాదం : ఎన్. వంశీ

# హైదరాబాద్ లింక్ ఆకృతిలో బెనగల్ కథలు

"శ్యామ్ బెనగల్ యొక్క వినయమైన మాధుర్యం అతని ప్రత్యేకత – ప్రఖ్యాత దర్శకుడిగా ఉన్నప్పటికీ, ఆయన ప్రతి ఒక్కరిని సమానంగా చూసేవారు," అన్నారు సినిమా దర్శకురాలు ఎలాహే హిప్టూలా, ప్రముఖ దర్శకుడు బెనగల్ గూర్చి గురుస్వామి కేంద్రంలో జరిగిన హృదయపూర్వక నివాళి కార్యక్రమంలో.

ఈ కార్యక్రమం, ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్ జీవితానికి మరియు సినిమాకు చేసిన అపారమైన సేవలకు సన్మానం చేయడానికి ఏర్పాటు చేయబడింది. ఇందులో నాటక రంగ ప్రముఖులు, సినిమా దర్శకులు మరియు అభిమానులు, బెనగల్ యొక్క వృత్తి పరమైన మరియు వ్యక్తిగత వారసత్వం గురించి వివిధ దృక్కోణాలను చర్చించారు.



వక్తలు, ప్రసిద్ధ చిత్ర దర్శకుడు బి. నర్సింగరావు, సినీ కమెడియన్ శంకర్ మెల్కోట్, మరియు ఎలాహే హిప్టూలా, శ్యామ్ బెనగల్ హైదరాబాద్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన అల్వాల్‌లో బాల్యాన్ని గడిపినట్టుగా, ఆయన తండ్రి ఫోటోగ్రఫీ స్టూడియో, లాల్‌బజార్‌లో ఉండటంతో పాటు నిజాం కాలేజీలో గడిపిన సమయాన్ని వివరించారు.

శంకర్ మెల్కోట్ చెప్పారు, "శ్యామ్ బెనగల్ యొక్క హైదరాబాద్ అనుబంధం అతని కథ tellingని రూపొందించింది. ఆయన పనిలో ఎప్పుడూ ఒక ప్రామాణికత, ఒక సాకారం ఉండేది, ఇది ప్రేక్షకులతో అనుసంధానం అయ్యేది."

వక్తలు, బెనగల్ యొక్క భారతీయ సినిమాకు చేసిన పోకడలు, ముఖ్యంగా అతని క్రమశిక్షణ గురించి గౌరవించారు. ఎలాహే హిప్టూలా తన తొలి చిత్రం 'హైదరాబాద్ బ్లూస్' ను విడుదల చేసిన తరువాత, బెనగల్ తో చేసిన సమావేశాన్ని పంచుకున్నారు. ఆయన ముచ్చటగా "మీరు దర్శకురాలు, నేను దర్శకుడు," అని నవ్వుతూ చెప్పారు.

ఈ సాయంత్రం బెనగల్ యొక్క దయ మరియు మనోహరత గురించి తెలియని కొన్నిసంఘటనలను కూడా వెల్లడించింది. కొండపల్లి పావన్, పర్సా సీతారామరావు యొక్క మగుడు, శ్యామ్ బెనగల్ సినిమా ఉత్సవం ఏర్పాటు చేయాలని సూచించారు, ఇది ఆయన విస్తృతమైన సృష్టికి గౌరవార్థం. "ఆయన ప్రత్యేకత తగ్గట్టు తెరపై మాత్రమే కాకుండా, ఇతర ప్రాంతాల్లో కూడా విస్తరించిందని తెలియజేస్తూ ఆయనకు అర్థమైన నివాళిగా ఒక స్మారకపుస్తకం లేదా పోటీ ఏర్పాటును రూపొందించడం మంచి ఆలోచన" అన్నారు.

ప్రేక్షకులు, సహచరులు మరియు స్నేహితులు, బెనగల్ యొక్క చింతనాశీలత గురించి హృదయ పూర్వక కథలను పంచుకున్నారు. "ఆయన ఏకార్యక్రమానికైనా హాజరుకాకపోయినా, ఎందుకు రాలేకపోయారో ఒక పొడవైన, వివరమైన లేఖ రాసేవారు," అని మరొకరు పంచుకున్నారు.

మరో స్నేహితుడు గుర్తు చేసుకున్నారు, "ఆయన మొబైల్ ఫోన్ ఉన్నప్పటికీ, ఎప్పుడూ తన ల్యాండ్‌లైన్ ఫోన్‌కి మాత్రమే స్పందించేవారు. ఈ చిన్నచిన్న పనులు ఆయన్ని ఇంతగా అభిమానించడానికే కారణమయ్యాయి."

వక్తలు, 'అంకుర్' వంటి బెనగల్ యొక్క ప్రతిష్ఠాత్మక చిత్రాలను కూడా చర్చించారు, షూటింగ్ కోసం ఒక పల్లె వెళ్లిన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. "ఆయన యొక్క సున్నితమైన దృష్టి అసమానమైనది," అని హేమంత్ రావు అన్నారు. " నా పాత్ర లాంటి చిన్న వాటి మీద కూడా, ఆయన చాలా ధ్యానంతో పని చేశారు."

### బెనేగల్ – ఆల్వాల్ బాలుడు

శ్యామ్ బెనేగల్‌ని ఎప్పుడూ సిగరెట్ లేదా పుస్తకాలతో నిండిన సూటకేసు లేకుండా చూడటం అరుదు, అతని ప్రయాణాలు ఎక్కడైనా తీసుకెళ్లినప్పటికీ. కలలు కనే వ్యక్తి, కథలపై ఆసక్తి కలిగిన అతను, ఆల్వాల్ రోడ్లపై సైకిల్ నడిపిస్తూ, ఆల్వాల్ కుండల్లో ఈత కొడుతూ, పరేడ్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతూ పెరిగాడు. "అతను పూర్తిగా ఆల్వాల్ బాలుడే," అని బి. నర్సింగ్ రావు, ఫైవ్ టైమ్ నేషనల్ ఫిల్మ్ అవార్డు విజేత మరియు 'దాసి', 'మట్టి మనుషులు' వంటి సినిమాల దర్శకుడు పేర్కొన్నారు. "బహుముఖ ప్రతిభలున్న,




వినయంగా ఉండే, ఈ నగరంతో లోతుగా సంబంధం ఉన్న వ్యక్తి.” శ్యామ్ బెనేగల్ యొక్క మరణం సోమవారం కథనాల ప్రపంచంలో ఖాళీని వదిలించింది, కానీ హైదరాబాద్‌లో అది వ్యక్తిగతంగా అనిపిస్తోంది. 1934లో సికింద్రాబాద్‌లోని ఆల్వాల్‌లో జన్మించిన బెనగల్, నగరంలోని నిజాం కాలేజీలో ఇంగ్లీష్ సాహిత్యం తరగతులకు సైకిల్‌తో వెళ్లేవాడు. మరోసారి, అతను కాలేజీ పత్రిక ‘కలేజియన్’ను ఎడిట్ చేస్తుండేవాడు లేదా క్రీడలు ఆడేవాడు, ఎందుకంటే అతను రాష్ట్ర సైక్లింగ్ మరియు ఈత చాంపియన్‌గా ఉన్నట్లు అతని దీర్ఘకాలిక స్నేహితులు చెప్పారు. బెనేగల్ తన చిన్నతనాన్ని ఆల్వాల్‌లో కుటుంబంతో గడిపాడు, లాల్ బజార్, తిరుమల ఘెరి ప్రాంతంలో తన తండ్రి నిర్వహించే ఫోటో స్టూడియోలో పనిచేసి. 1958లో హైదరాబాద్‌ను వదిలి, ముంబైలో తన బంధువు గురుదత్తు కుటుంబంతో చిన్నదిగా ఉండి, తరువాత ప్రకటన రంగం మరియు సినిమా రంగంలో తన స్వంత గుర్తింపును సృష్టించాడు. 1986లో అమ్ముడైన ఆల్వాల్‌లోని అతని తల్లిదండ్రుల ఇల్లు ఇప్పుడు కూలిపోయింది, కానీ అతని జ్ఞాపకాలు ఇప్పటికీ అంగిట్లు, క్రీడా మైదానాలు, కుండల్లో మిగిలి ఉన్నాయి. “అతను హైదరాబాద్‌ను తొలగించాడు, కానీ నగరం అతనితో మిగిలింది, అతను మానసికంగా దీంటితో బంధింపబడినట్లు మరియు చాలా నాస్టాల్జిక్‌గా ఉండేవాడు,” అని నర్సింగ్ రావు చెప్పారు, వారు బెనగల్‌తో స్నేహితులుగా ఉన్నారు, అయితే బంతి పన్నెండు సంవత్సరాలు చిన్నవారు, “శ్యామ్ నాకు నా కొడుకును చిత్రకళ నేర్చుకోవడానికి పంపాలని అడిగాడు” అని చేర్చారు.

హైదరాబాద్‌కు అతని బంధం ఆయన సినిమాలలోనూ ప్రతిబింబించింది. అతని మొదటి చిత్రం ‘అంకూర్’ (1974) హైదరాబాద్ సబ్‌అర్బ్ అయిన యల్లారెడ్డి గూడలో చిత్రీకరించబడింది, ఇది అతని స్నేహితుడు సూర్యంతో సాకారమైన నిజజీవిత కథ. ఇది మూడు నేషనల్ ఫిల్మ్ అవార్డులు గెలుచుకుంది మరియు బర్లిన్ అంతర్జాతీయ సినిమా ఉత్సవంలో గోల్డెన్ బేర్ కోసం నామినేట్ అయ్యింది. అతని రెండవ చిత్రం ‘నిషాంత్’, 1940ల మధ్య తెలంగాణ సాయుధ పోరాటాలను విశ్లేషిస్తుంది, ఇది గుండ్ల పోచంపల్లి గ్రామంలో చిత్రీకరించబడింది. ‘సుస్మాన్’, ఇది భారతదేశ గ్రామీణ పారిశ్రామికీకరణను చూపుతుంది, పోచంపల్లి ప్రాంతంలోని వస్త్ర బౌతికులను చిత్రించింది. “అతను విజయ తేందుల్కర్ వంటి రచయితలతో సహకరించేవాడు, మరియు అతని కథనాలు ప్రెస్ కట్‌లతో, నిజజీవిత సంఘటనలతో ఆధారపడి ఉండేవి,” అని రావు చెప్పారు. “అతను కేవలం సినిమాలు చేయలేదు అతను అసమానత్వం, శ్రమ, మరియు గుర్తింపు గురించి సంభాషణలు సృష్టించాడు.”

బెనేగల్‌హైదరాబాద్‌తో తన క్రీడా ఎంపికల్లో తన బంధాన్ని కొనసాగించారు. అతని చిత్రం ‘మండీ’లో మఖదూమ్ మోహియుద్దీన్ కవితలు మరియు హైదరాబాద్‌కు చెందిన తలత్ ఆజీజ్ పాటలు ఉన్నాయి. అతని తర్వాతి చిత్రం ‘వెల్ డన్ అబ్బా’ (2009) జీలాని బానో యొక్క ‘నర్సయ్యన్ కీ బావడి’పై loosely ఆధారపడి ఉంది. “అతను సంబంధంలో ఉండడం ఇష్టపడేవాడు,” అని నర్సింగ్ రావు అన్నారు. “అతను బలహీనమయిన తరువాత గూడా ప్రతి సందేశానికి స్పందించేవాడు. అయితే ఈ సంవత్సరం, గత నాలుగు నెలలుగా, స్తబ్దలుఉంది, దానితోనే నాకు అదోలా అనిపించింది.”

అతని సినిమాల వెలుపల, బెనేగల్ ఒక ఉపాధ్యాయుడు మరియు గురువు పాత్రలో కూడా తన ముద్రను వేశాడు. అతను ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో (FTII) బోర్డు సభ్యుడిగా పనిచేసి, శబానా అజ్మి మరియు స్మితా పటేల్ వంటి ప్రతిభలకు పరిచయాన్ని ఇచ్చాడు. పుస్తకాలతో నిండిన సూటకేసు, సిగరెట్ చేతిలో, మరియు భారతీయ సినిమాని ప్రపంచవ్యాప్తంగా చర్చించే దృష్టితో బెనేగల్ ప్రపంచ స్థాయిలో పేరును గెలుచుకున్నాడు, కానీ హైదరాబాద్ ఎప్పటికీ అతని హృదయంలో ఇంటిగా ఉండింది. “అతను ఈ కుంటల్లో ఈత కొట్టాడు, ఈ రోడ్లపై సైకిల్ తొక్కాడు, ప్రపంచాన్ని గెలవడానికి వెళ్లాడు, కానీ హైదరాబాద్ ఎక్కడా వెళ్ళినా అతని హృదయంలో మిగిలింది,” అని నర్సింగ్ రావు అన్నారు.

– డెస్క్

m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# శక్తివంతమైన స్త్రీ పాత్రల రూపశిల్పి
# డైరెక్టర్ శ్యామ్ బెనగల్ ఇకలేరు

భారతీయ సినిమా పరిశ్రమలో తీరని విషాదం నెలకొంది. భారతీయ పార్లల్ సినిమాకు దశదిశలా ఖ్యాతిని తెచ్చి పెట్టిన తొలితరం దర్శకులు శ్యామ్ బెనగళ్ (90) ఇకలేరు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగి ముంబైలో స్థిరపడిన బెనగళ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ముంబైలోని ఓ ఆసుపత్రిలో నవంబర్ 23న తుదిశ్వాస విడిచారు.

ఆయన పూర్తి పేరు బెనగళ్ళ శ్యామ్ సుందరరావు. సికింద్రాబాద్‌లో డిసెంబరు 14, 1934న జన్మించారు. సరిగ్గా 90 సంవత్సరాల 9 రోజులు ఈ భూమి మీద బతికారు. భారతీయ సినిమా రంగంలో ఇకపై ఎన్ని వందల ఏళ్ళు శ్యామ్ బెనగళ్ జీవించి ఉంటారనేది చరిత్ర చెబుతుంది.



తెలంగాణ- ఆయనకి ఊహ తెలిసేటప్పటికి ఇంకా నిజాం పాలనలోనే ఉంది. అప్పటి దొరల దౌర్జన్యాలు, పెత్తందారీతనాలు- అట్టడుగు ప్రజల, ముఖ్యంగా స్త్రీల కన్నీటి కథలు- శ్యామ్ బెనగళ్ గుండెలపై చెరగని జ్ఞాపకాలు అయ్యాయి. అందుకే తన మొదటి సినిమా అంకుర్ - ఇదే తెలంగాణ నేపథ్యంలో తీశారు. అప్పటిలో నిజాం రాజ్యంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్నిప్రాంతాలు కలిసి ఉండేవి. ఈ మూడుప్రాంతాల సంస్కృతులు, నేపథ్యాలు - శ్యామ్ బెనగళ్‌ని వెంటాడాయి. యాడ్ ఏజన్సీలో కాపీ రైటర్‌గా కెరీర్‌ని ఆరంభించినా - ఆయన దృష్టి సినిమాల మీదే ఉండేది.

### స్త్రీ పాత్రల రూపశిల్పి శ్యామ్ బెనగళ్.. అల్విదా!

బెనగళ్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'ముజీబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం 2023 అక్టోబరు 13న విడుదలైంది. శ్యామ్ బెనగళ్‌కు భార్య నీరా బెనగళ్, కుమార్తె పియా బెనెగళ్ ఉన్నారు. లెజెండరీ దర్శకుడిగా పేరొందిన శ్యామ్ బెనగళ్ మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. జన్మతః కన్నడిగ అయినప్పటికీ తెలంగాణలో పుట్టి పెరగడం వల్ల తెలంగాణ చైతన్యం ఆయనలో చివరికంటా ఉంది.

శ్యామ్ బెనగళ్ తన సినిమాల్లో శక్తిమంతమైన స్త్రీపాత్రలకు రూపకల్పన చేశాడు. 'అంకుర్' (1974)తో మొదలెట్టి 'జుబేదా' (2001) వరకు దాదాపుగా ప్రతి సినిమాలో స్త్రీ పాత్రలకు చైతన్యాన్ని, శక్తిని ఇచ్చిన దర్శకుడు శ్యామ్ బెనగళ్. సత్యజిత్ రే వాస్తవిక సినిమాను ప్రవేశపెట్టి ఆ పరంపరను మృణాళ్ సేన్ అందుకున్నాక శ్యామ్ బెనగళ్ ఆ ఛత్రాన్ని గట్టిగా పట్టుకుని నిలబెట్టాడు. 1973లో విడుదలైన రెండు సినిమాలు 'అంకుర్', 'గరమ్ హవా' నవ సినిమాల పతాకాన్ని పట్టుకున్నాయి. అయితే 'గరమ్ హవా' తీసిన ఎం.ఎస్.సత్యు ఎక్కువ సినిమాలు చేయలేదు. శ్యామ్ బెనగళ్ నిరంతరం పని చేశాడు. 'సినిమా కచ్చితంగా సామాజిక మాధ్యమం. అది సమాజాన్ని పట్టించుకోవాల్సిందే. నేను సికింద్రాబాద్‌లో పుట్టి పెరగడం వల్ల రైతాంగ పోరాటం, విప్లవ పోరాటాల ప్రభావం నా మీద ఉంది. ప్రజల పక్షం నిలబడాలి సినిమా అనుకున్నాను' అంటారాయన.

కంటోన్మెంట్ ఏరియాలోని టెంట్ హాలులో వారానికి మూడు ఇంగ్లిష్ సినిమాలు చూస్తూ తన అన్నయ్యతో కలిసి సినిమాలు తీసేందుకు ప్రయోగాలు చేసిన శ్యామ్ బెనగళ్ యాడ్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీల తర్వాత ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ అయ్యాడు. ఇంకా చెప్పాలంటే పార్లల్ సినిమా అంటే చిత్రోత్సవాల్లో ప్రదర్శించేది కాదు నేరుగా హాల్లో రిలీజ్ చేసి హిట్ చేయదగ్గది అని నిరూపించిన తొలి భారతీయ దర్శకుడు శ్యామ్ బెనగళ్. 'అంకుర్' హైదరాబాద్‌లో 100 రోజులు ఆడటమే ఉదాహరణ. భూస్వాముల దోపిడిని ఆ సినిమాలో చూపి కొనసాగింపుగా 'నిషాంత్' తీశాడు బెనగళ్. ఇక 'మంథన్' చిన్న మనుషులు ఒక్కటైతే సహకార వ్యవస్థ ద్వారా ఎలా స్వయం సమృద్ధి సాధించ వచ్చో ఆ రోజుల్లోనే తీశాడు బెనగళ్. దీని నిర్మాణానికి పాడిరైతులు తలా



ఓల్డ్ అల్వాల్‌లో శ్యామ్ బెనగల్ జన్మించిన ఇల్లు



ఇటీవల ఆయన జన్మదినోత్సవం సందర్భంగా..

రెండురూపాయల వాటా వేయడం నభూతో నభవిష్యతి.

**ఎన్నో ప్రయోగాలు:**

శ్యామ్ బెనగళ్ తన సినిమాల్లో ఎన్నో ప్రయోగాలు చేశాడు. కొత్త నటీనటులకు అవకాశం ఇచ్చాడు. బెనగళ్ సినిమాలతో షబానా, స్మితా పాటిల్ గొప్ప పాత్రలు పోషించదగ్గ నటీమణులుగా గుర్తింపు పొందారు. షబానాకు మొదటి సినిమాతోటే జాతీయ పురస్కారం వచ్చింది. ఔట్‌డోర్‌కు తన యూనిట్‌తో వెళ్లి అక్కడే ఉండిపోయి సినిమా తీసే పరంపరను బెనగళ్ ప్రవేశపెట్టాడు. అందరూ కలిసి ఆలోచనలు పంచుకోవడానికి ఇది మంచి మార్గం అంటాడాయన. ఆయన దర్శకత్వ ప్రతిభ తెలిసి కేవలం ఆయన దర్శకత్వంలో నటించాలనే అభిలాషతో 'అనుగ్రహం'లో వాణిశ్రీ నటించింది. వ్యభిచార వ్యవస్థ మీద 'మండి', వ్యాపార సామ్రాజ్యాల ఎత్తుగడల మీద 'కల్‌యుగ్', గోవాలో పోర్చుగీసు పాలన సమాప్త సమయంలో చెలరేగిన భావోద్వేగాలను 'త్రికాల్' లో, నాలుగు కాలాల



అంతరంలో ఒక సినీ నాయిక జీవితం, సినిమా జీవితం ఎలా మారిందో చూపిన 'భూమిక'... ఇవన్నీ ప్రయోగాత్మక కథలు. 'త్రికాల్'లో రాత్రి సన్నివేశాలు క్యాండిళ్ల వెలుతురులో తీసి ఒక గాంభీర్యం తెచ్చాడు బెనగళ్.

**దేశం కోసం:**

దేశం కోసం దేశ వాసుల కోసం బెనగళ్ పని చేస్తూనే వెళ్లాడు. ఎన్నో డాక్యుమెంటరీలు తీశాడు. వాటిలో సత్యజిత్ రే మీద తీసిన డాక్యుమెంటరీ ముఖ్యమైనది. ఇక నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను 'భారత్ ఏక్ ఖోజ్' పేరుతో ఇచ్చిన దృశ్యరూపం కష్టతరమైనది. దూరదర్శన్‌లో దీనికి విపరీతమైన ఫాలోయింగ్ ఉండేది. అదే సమయంలో సుభాష్ చంద్రబోస్ మీద పరిశోధన చేసి 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' తీశాడు. 'మేకింగ్ ఆఫ్ మహాత్మా'కు దర్శకత్వం వహించాడు. జీలాని బానో రాసిన 'నర్సయ్య కీ బావ్‌డీ' (నర్సయ్య బావి)ని చాలా కాలం తర్వాత 'వెల్‌డన్ అబ్బా'గా తీశాడాయన.ఆయన నిష్క్రమణంతో గొప్ప వెలుగు వీడ్కోలు తీసుకున్నట్టయ్యింది.

**సమాంతర సినిమా సృష్టికర్త శ్యామ్ బెనగళ్**

శ్యామ్ బెనగళ్- ఈ పేరు ఈ తరం ప్రేక్షకులకి తెలిసి ఉండవచ్చు. కానీ సినిమాలు తెలిసి ఉండక పోవచ్చు. భారతీయ సినిమా భాషా భేదాలు లేకుండా కమర్షియల్ సినిమాల ప్రవాహంలో కొట్టుకుపోతున్న రోజుల్లో ప్రవాహానికి ఎదురీదిన వాడు, సమాంతర (పారలల్) సినిమాకి ఊపిరి పోసిన వాడు శ్యామ్ బెనగళ్. కొత్త కథలు చెప్పాలి, జనం మస్తిష్కాలు కదిలించాలని శ్యామ్ బెనగళ్‌లో 'అంకుర్' సినిమాతో భారతీయ సినిమా తెరపై తన సంతకాన్ని పెట్టారు.

అయితే శ్యామ్ బెనగళ్ చెప్పిన కథా విధానం అప్పటి ప్రేక్షకులకి రుచించ లేదనే చెప్పాలి. ఆ రోజుల్లో అభిరుచి ఉన్న ప్రేక్షకులు అంకుర్, నిషాంత్, మంథన్, భూమిక - ఏ ఫిలిమ్ సొసైటీల్లో చూపిస్తారా అని తిరుగుతుండేవారు. సగటు ప్రేక్షకులేమో ఈయనేంటి - వేరే కథలు చెబుతున్నారు - మనకి తెలియని జీవితపు కోణాలు పట్టుకుంటున్నారు అని డిస్టర్బ్ అవుతుండే వారు. ఎదిగిన కొద్దీ ప్రేక్షకులకు శ్యామ్ బెనగళ్‌ను ఇంకొంచెం అర్థం చేసుకునే అవకాశం దొరికింది.

**అవార్డులు:** శ్యామ్ బెనగళ్ భారత ప్రభుత్వం నుంచి 8 జాతీయ చలన చిత్ర అవార్డులు అందుకున్నారు. అవి 'అంకుర్'(1975), 'నిశాంత్' (1976), 'మంథన్'(1977), 'భూమిక: ది రోల్' (1978), 'జునూన్' (1979), 'ఆరోహణ్'(1982), 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' (2005), 'వెల్‌డన్ అబ్బా' (2009). అలాగే సినీ రంగంలో కనబరచిన అత్యుత్తమ ప్రతిభకుగానూ 1976లో పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్, 2003లో ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత పురస్కారం, 2013లో ఏఎన్ఆర్ జాతీయ అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా 2005 సంవత్సరానికిగాను 2007 ఆగస్టు 8న అత్యంత ప్రతిష్ఠాత్మమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అందుకున్నారు. తెలుగు సినిమా 'అనుగ్రహం'కు నంది అవార్డు అందుకున్నారు.

బెనగల్ మృతిపై పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

## కొయ్య బొమ్మలాట

# మోతె జగన్నాథం మృతి

తెలంగాణలోని జనగామ జిల్లా అమ్మాపురం మోతె జగన్నాథం ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బొమ్మలోల్లు" అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, కొయ్య బొమ్మలాట ద్వారా శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించాడు. వీరి ప్రదర్శనలు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ప్రాణం పోశాయి. ఈ బృందం యొక్క కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఒకే మోతె కుటుంబానికి చెందిన రెండు బృందాలు మాత్రమే మిగిలాయి.



జగన్నాథంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వేదకుమార్ మణికొండ 2006లో ఢిల్లీలోని నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ మరియు చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమి హైదరాబాదు జగన్నాథం బృందంతో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీరంతా కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 3 ప్రాంతాలలోని 11 జిల్లాల్లో పర్యటించారు. నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ అవేర్‌నెస్ ప్రచారం జగన్నాథం బృందం కొయ్య బొమ్మలాట ప్రదర్శనలు విద్యాసంస్థలు మరియు ప్రజలలో సాంస్కృతిక వారసత్వ మరియు మాన్యుస్క్రిప్ట్ పరిరక్షణ ప్రాముఖ్యతకు దోహదపడ్డాయి. వేదకుమార్‌తో దేశంలో సాంస్కృతిక అవగాహనను పెంపొందించే జగన్నాథం కొయ్య బొమ్మల బృందంతో అనేక వర్క్ షాప్‌లు మరియు ప్రదర్శనలు కూడా నిర్వహించారు. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనలు ఇప్పించాము.

ప్రముఖ చలన చిత్ర నిర్మాత అజిత్‌నాగ్ కొయ్య బొమ్మలాటకు వారి ప్రత్యేక సాంస్కృతిక విలువను వర్ణించే "బొమ్మలోల్లు" అనే డాక్యుమెంటరీ చిత్రంలో జగన్నాథం మరియు బృందం జీవితం మరియు కళా రంగానికి ఆయన సేవలు చక్కగా తెలియపరిచారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సిఫార్సులతో సహా వేదకుమార్ యొక్క నిరంతర ప్రయత్నాల ద్వారా, జగన్నాథం మరియు అతని బృందం భారతదేశంలోని 12కి పైగా రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇస్తూ జాతీయ వేదికలపై గుర్తింపు పొందారు. దురదృష్టవశాత్తూ, కొయ్య బొమ్మలాట ఇప్పుడు అంతరించిపోయే దిశలో ఉంది. సామాజిక-ఆర్థిక సవాళ్ల కారణంగా యువతరం పరిమిత ఆసక్తిని చూపుతోంది.

తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసిన సంప్రదాయ సాంస్కృతిక రూపాన్ని గుర్తించాలని, అంతరించిపోతున్న ఈ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, ఈ కళను సజీవంగా ఉంచడంలో మిగిలిన కొయ్య బొమ్మల కుటుంబ కళాకారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంతరించిపోతున్న కళారూపాన్ని తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాను అని తెలిపారు.

జగన్నాథంకు పద్మశ్రీ దక్కేలా ప్రయత్నం జరుగుతున్న సందర్భంలో ఆయన ఆకస్మిక మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు. కళారంగానికి ఆయన మృతి వల్ల ఏర్పడిన నష్టం పట్ల వేదకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మోతె జగన్నాథం కుటుంబానికి వేదకుమార్ మణికొండ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గొప్ప కళాకారుడి మృతికి సంతాపం తెలిపారు.

– టి.స్వామి, m : 8374 99 5555
e: desk.deccan@gmail.com







# 'ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలు' వేడుకలు

## (నెక్లస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్)

ప్రజాపాలన - ప్రజా విజావిజయోత్సవాల ముగింపు వేడుకలను డిసెంబర్ 07వ తేది నుండి 09వ తేది వరకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలలో ప్రజలు కూడా పాలు పంచుకుని సంబరాలు జరుపుకునే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేశారు. ట్యాంక్‌బండ్, నెక్లస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రముఖ సంగీత కళాకారులు వందే మాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లీగంజ్, తమన్‌ల సంగీత కచేరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. సందర్శకుల కోసం సాంస్కృతిక, ఫుడ్, హస్తకళల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్గ్ వద్ద బాణా సంచా ప్రదర్శన, ట్యాంక్ బండ్ వద్ద డ్రోన్ షో, భారత వాయు దళం చే ఎయిర్ షో ఆహుతులను ఆకట్టుకోనున్నాయి. పూర్తి కార్యక్రమాల వివరాలు తేదీల వారీగా ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| క్రమ సంఖ్య | తేదీ /సమయం | కార్యక్రమం | వేదిక |
|---|---|---|---|
| 1. | 07.12.2024 | 1.సాంస్కృతిక కార్యక్రమాలు - మూడు వేదికలు (5 - 9PM) | నెక్లెస్ రోడ్ |
| | | 2.సంగీత కచేరీ - శ్రీ వందేమాతరం శ్రీనివాస్ (7 - 8.30 PM) | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 3.ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |
| 2. | 08.12.2024 | 1.ఎయిర్ షో | ట్యాంక్ బండ్ వద్ద |
| | | 2.సంగీత కచేరీ - శ్రీ రాహుల్ సిప్లీగంజ్ (7PM to 8.30 PM) | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 3.సాంస్కృతిక కార్యక్రమాలు – (5 PM to 9 PM) | 3 వేదికలు - నెక్లెస్ రోడ్ |
| | | 4.ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | 5.నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |
| 3. | 09.12.2024 | 1.తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ (5.00 PM) | సచివాలయంలో |
| | | 2.బహిరంగ సభ – గౌరవ ముఖ్యమంత్రి (5PM to 5.45PM) | సచివాలయంలో |
| | | 3. డ్రోన్ షో (5.45 PM to 6 PM) | |
| | | 4. బాణసంచా (6.05 PM to 6.20 PM) | |
| | | 5. గౌరవ ముఖ్యమంత్రి - కల్చరల్ వేదికకు చేరుకుంటారు. (6.10 PM) | |
| | | 6. సంగీత కచేరీ - శ్రీ ఎస్ తమన్ (7 PM to 8.30 PM | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 7. సాంస్కృతిక కార్యక్రమాలు – (5 PM to 9 PM) | |
| | | 8. ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | 9. నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |

# కవిత్వం కూడా శిక్ష తగ్గిస్తుందా..?

మరణ శిక్షను రద్దు చేయాలని ప్రపంచవ్యాప్తంగా చాలా మంది కోరుచున్నారు. కానీ చాలా దేశాలు రద్దు చేయలేదు. మన దేశంలో మరణశిక్షని రద్దు చేసే పరిస్థితి కన్పించడంలేదు. చాలా నేరానికి మరణ శిక్షని శిక్షగా శాసనకర్తలు నిబంధనలని మారుస్తున్నారు. జీవితకాలం శిక్షను అనుభవిస్తున్న ఖైది ఎవరినైనా హత్య చేస్తే అతనికి కోర్టులు విధిగా మరణశిక్షని విధించాల్సి వుంటుంది. ఈ పరిస్థితి చాలా అరుదుగా వుంటుంది. మిగతా కేసుల్లో మరణ శిక్షని కోర్టులు అరుదైన వాటిల్లో, అరుదైన కేసుల్లోనే విధిస్తాయి. అరుదైన వాటిల్లో అరుదైనవి ఏవో సుప్రీంకోర్టు చాలా కేసుల్లో ప్రకటించింది.

మరణశిక్షని కోర్టులు విధించినప్పటికీ అవి అప్పీలులో జీవిత ఖైదుగా మారిపోతాయి. స్థానికంగా వున్న పరిస్థితులు చాలాసార్లు న్యాయమూర్తులని మరణశిక్ష విధించే విధంగా ప్రభావితం చేస్తూ వుంటాయి. ఈ విషయాన్ని చాలా మంది న్యాయమూర్తులు అంగీకరించరు. కానీ ఇది వాస్తవం. అమానవీయంగా హత్య చేసినప్పుడు, హేతుపూరితంగా వున్నప్పుడు, ముద్దాయిని సంస్కరించడానికి వీల్లేదని కోర్టు భావించినప్పుడు మరణశిక్షని విధించాల్సి వుంటుంది. సమాజానికి విభ్రాంతి కలిగించే విధంగా నేరం చేసిన సందర్భంలో మరణశిక్షని విధించడం సబబు. అయినా కూడా కోర్టులు కొన్ని కేసుల్లో ఈ సందర్భాలు లేనప్పటికీ మరణశిక్షని విధిస్తూ వుంటాయి. అలాంటిదే - ధ్యానేశ్వర్ సురేశ్ చోర్కర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు. ఈ కేసులో మరణ శిక్షను కోర్టు రద్దు చేసింది. కవిత్వం కూడా అందుకు ఒక కారణం అయ్యింది.



కవిత్వం రాయడం వల్ల కష్టాల పాలైన వాళ్లని చూశాం. జైలుకి వెళ్ళిన వాళ్లను చూశాం. అది దాశరథి కావొచ్చు. వరవరరావు కావొచ్చు. కానీ కవిత్వం రాయడం వల్ల ఉరిశిక్షని తప్పించుకున్న కవి గురించి గతంలో మనం వినలేదు. ఈ మధ్యే అతని పేరు బయటకు వచ్చింది. ఆయన పేరు సురేశ్ చోర్కర్. అతను ఓ హత్య కేసులో శిక్షను అనుభవిస్తున్న ముద్దాయి. అతని కేసులోని చాలా విషయాలను పరిగణనలోకి తీసుకొని సుప్రీంకోర్టు అతనికి సెషన్స్ కోర్టు విధించి హైకోర్టు ధృవీకరించిన మరణశిక్షను రద్దు చేసి జైలు శిక్షను ఖరారు చేసింది. అందుకు సుప్రీంకోర్టు చూపించిన కారణాల్లో ఒకటి అతను కవిత్వం రాస్తున్నాడని, అందులో అతని ప్రశ్చాత్తాపం వుందని, అతను మంచి మనిషిగా మారే అవకాశం కన్పిస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

ఫిబ్రవరి 20, 2019 రోజున సుప్రీంకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచి ఈ తీర్పుని ప్రకటించింది. మైనర్ అమ్మాయి 'రిషికేశ్'ని కిడ్నాప్ చేసి హత్య చేసి, సాక్ష్యాలను మాయం చేసిన కేసులో అతను ముద్దాయి. పూణాలోని అదనపు జిల్లా జడ్జి అతనికి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్లు 302, 264, 201 ప్రకారం మరణ శిక్షని విధించారు. హైకోర్టు ఆ మరణశిక్షని ధృవీకరించింది. ఈ తీర్పుపై ముద్దాయి ధ్యానేశ్వర్ సురేశ్ చోర్కర్ సుప్రీంకోర్టులో అప్పీలుని దాఖలు చేశాడు.


అతని న్యాయవాది కేసు రుజువు కాలేదని వాదించలేదు. శిక్షను తగ్గించాలని మరణశిక్ష విధించే కేసు కాదని సుప్రీంకోర్టుకి విన్నవించాడు.

నేరం జరిగినప్పుడు ముద్దాయి వయస్సు 22 సంవత్సరాలని నేర చరిత్ర లేదని, అతనికి విధవరాలైన తల్లి వుందని, ఇప్పటికి 18 సంవత్సరాల జైలు జీవితం గడిపాడని, రెమిషిన్‌ని కలిపితే అతను 23 1/2 సంవత్సరాల జైల్లో వున్నాడని ముద్దాయి న్యాయవాది సుప్రీంకోర్టుకి విన్నవించాడు. జైల్లో అతని నడవడిక బాగుందని, నేరం జరిగినప్పుడు అతను యుక్త వయస్సులో వున్నాడని, 18 సంవత్సరాల జైలు జీవితంలో అతనిలో మార్పు తీసుకొని వచ్చిందని, తనకి తాను, అదే విధంగా సమాజానికి ఉపయోగపడే విధంగా ఇప్పుడు ముద్దాయి వున్నాడని కోర్టుకి విన్నవించాడు. జైల్లో వున్నప్పుడు అతను బి.ఎ. పూర్తి చేశాడని, గాంధీ ఆలోచనా విధానం మీద శిక్షణ కూడా పొందాడని కోర్టుకి చెప్పాడు. డబ్బు కోసం ప్రణాళిక వేసి చిన్న పిల్లని చంపాడని అందుకని శిక్ష తగ్గించకూడదని 'రాజ్యం' తరపున న్యాయవాది కోర్టుకి విన్నవించాడు.

శిక్షా కాలాన్ని, శిక్షని నిర్ణయించడానికి కోర్టులు అప్పుడు వున్న పరిస్థితులని పరిగణనలోకి తీసుకుంటాయి. శిక్ష తగ్గించడానికి, అదే విధంగా శిక్షను పెంచడానికి మధ్య సమతుల్యతని కోర్టు పరిగణిస్తుంది. ఈ కేసులో కూడా ఆ విషయాలని పరిగణనలోకి తీసుకొంది. శిక్షని తగ్గించడానికి కోర్టు పరిగణనలోకి తీసుకున్న అంశాలు ఇవి.

- నేరం జరిగినప్పుడు ముద్దాయి వయస్సు 22 సంవత్సరాలు.
- ఇప్పటి వరకు అతను 18 సంవత్సరాలు జైల్లో వున్నాడు.
- జైల్లో అతను ప్రవర్తన కలిగి వున్నాడు.

- నాగరికమైన వ్యక్తిగా సమాజంలోకి ప్రవేశించడానికి అతను కృషి చేస్తున్నాడు. బియ్యే కూడా పూర్తి చేశాడు. తనను తాను సంస్కరించుకోవడానికి కృషి చేస్తున్నాడు.
- జైల్లో వున్నప్పుడు అతను రాసిన కవితల్లో ప్రశ్చాత్తాపం, అదే విధంగా మంచిగా మారడానికి అతను చేస్తున్న ప్రయత్నం కూడా కన్పిస్తుంది.



ఈ అంశాల వల్ల అతను మంచివాడుగా మారే అవకాశం కన్పిస్తుందని, అతను మళ్ళీ ఇలాంటి నేరాలు చేస్తాడు అన్పించడం లేదని, సమాజానికి అతని వల్ల ఆపద వుందన్న అభిప్రాయం కలుగడం లేదని కోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా కేసులోని అన్ని విషయాలను గమనిస్తున్నప్పుడు అతను చేసిన నేరం 'అరుదైన వాటిల్లో అరుదైనది'గా అన్పించడం లేదని, అందుకని మరణ శిక్ష విధించాల్సిన అవసరం లేదని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. అతను చేసిన నేరం క్రూరమైనది, హేయమైనది. అయితే అతను గతంలో శిక్షపడిన వ్యక్తి కాదు, వృత్తిరీత్యా నేరస్తుడు కూడా కాదు. అందుకని మరణశిక్ష విధించాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. న్యాయహితం కోసం అతనికి విధించిన మరణశిక్షను జీవిత ఖైదుగా మారుస్తున్నాం. శిక్షని తగ్గించడం కోసం అతను సంబంధిత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వం అమల్లో వున్న నియమాల ప్రకారం అన్నింటిని పరిగణనలోకి తగు చర్య తీసుకోవాల్సి వుంటుందని సుప్రీంకోర్టులోని త్రిసభ్య బెంచి అభిప్రాయపడింది.

శిక్ష తగ్గించడానికి గల చాలా కారణాలని సుప్రీంకోర్టు ఈ కేసులో పరిగణనలోకి తీసుకుంది. మరణ శిక్ష విధించాలంటే ఆ నేరం అరుదైన వాటిలో అరుదైనదిగా వుండాలి. శిక్ష తగ్గించడానికి ఎన్నో కారణాలు వున్నాయి. అరుదైన కేసులో అరుదైనది ఈ నేరం కాదు. అన్ని కారణాలతో బాటూ కవిత్వం అనేది కూడా ఒక కారణం కావడం చాలా మందికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు దేశమంతా ఈ తీర్పుని పొగుడుతున్నారు. మరణశిక్ష విధించడానికి అవసరమైన కేసు అది కాదు అన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. ఏమైనా కవిత్వాన్ని కూడా సుప్రీంకోర్టు శిక్ష తగ్గించడానికి పరిశీలించడం ఆనందించాల్సిన విషయమే!

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

# బ్లాక్ మూన్



హైదరాబాద్‌లోని Casual Star Gazer మరియు ఔత్సాహిక ఖగోళ శాస్త్రవేత్తలు రాత్రిపూట ఆకాశం వైపు చూసి నల్ల చంద్రుడిని గుర్తించే సమయం వచ్చింది! అవును, మీరు విన్నది నిజమే! ఇది 'Once in a Blue Moon' యొక్క సాధారణ ఇడియమ్ కాదు, రాబోయే రెండు రోజుల్లో చల్లగా ఉండే హైదరాబాదీ ఆకాశంలో కనిపించే బ్లాక్ మూన్ అని ముందే ధ్వనిస్తుంది. "ఈ బ్లాక్ మూన్ చాలా అరుదు.

సాధారణంగా, ఒక నెలలో రెండు అమావాస్యలు వస్తాయి. రెండవ అమావాస్యని బ్లాక్ మూన్ అంటారు. అలాగే, రెండు పౌర్ణమి (పూర్ణిమ) ఒకే ఒక్క నెలలో వస్తే. నెలలో, రెండవ చంద్రుడిని బ్లాక్ మూన్స్ అని పిలుస్తారు. చంద్రుని చక్రం మరియు దాని వివిధ దశల ద్వారా వెళ్ళడానికి పట్టే సమయం చాలా అరుదైన సంఘటనలని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా (PSI) బ్లూ మూన్, వ్యవస్థాపక కార్యదర్శి రఘునందన్ కుమార్ వివరించారు. ప్రతి సంవత్సరం 2024 క్యాలెండర్‌లో డిసెంబర్‌లో రెండు అమావాస్యలు, అంటే డిసెంబర్ 1వ తేదీ ఉదయం 11.51 గంటలకు మరియు డిసెంబర్ 31 ఉదయం 3.57 గంటలకు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఔత్సాహిక ఖగోళ శాస్త్రవేత్త అన్నారు. ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి, రెండు అమావాస్యలతో ఒక నెల ఉంటుంది. రెండవ అమావాస్యను బ్లాక్ మూన్ గా పిలుస్తారు.

– ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా




# భారతదేశంలో పట్టనంత చరిత్ర తెలంగాణలో ఉంది

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తన తాజా మూడు పుస్తకాలను విడుదల చేసింది. ఈ ఘన కార్యక్రమం ఈ రోజు, 2024 డిసెంబర్ 29, ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎన్‌టిఆర్ స్టేడియంలో, ఇందిరా పార్క్ ఎదురుగా ఉన్న "సాదిక్ అలీ స్టేజ్" వద్ద జరిగింది.

**విడుదల చేసిన మూడు పుస్తకాలు ఇవీ:**

**"కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు"**
*– డాక్టర్ మంగరి రాజేంద్ర (జిమ్బో) రచన*

**"తెలంగాణ శిథిలాలు... వ్యథాభరిత కథనాలు"**
*– డాక్టర్ ఎమని శివనాగిరెడ్డి రచన*

**"తెలంగాణ చరిత్ర తొవ్వల్లో"**
*– శ్రీ రామోజు హరగోపాల్ రచన*

ఈ పుస్తకాలు తెలంగాణ సాహిత్యం, చరిత్ర, మరియు సంస్కృతిని విశదీకరిస్తూ, పాఠకుల మనసులను ఆకట్టుకునేలా రూపొందించబడ్డాయి.

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డీఏటీ) చైర్మన్ వేదకుమార్ మణికొండ స్వాగతం పలికి పుస్తకాల్లోని చారిత్రక అంశాలను వివరించారు.


ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ ఏయూ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రముఖ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి హాజరయ్యారు. డాక్టర్ మంగరి రాజేంద్ర (జింబో), విశ్రాంత న్యాయమూర్తి, "కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు" రచయిత పుస్తకాలను లాంఛనంగా ఆవిష్కరించి సమీక్షించారు. తెలంగాణ వారసత్వాన్ని పరిరక్షించడంలో వాటి పాత్రను నొక్కి చెబుతూ పుస్తకాల చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వానికి వారు చేసిన కృషిని నొక్కిచెబుతూ పుస్తకాల ప్రాముఖ్యతపై తమ ప్రసంగాలతో కార్యక్రమాన్ని సుసంపన్నం గారు.

**"కోర్టు తీర్పుల్లో సాహిత్య మెరుపులు"** అనే రచనను మంగారి రాజేందర్ రచించారు. ఈయన కలం పేరు జింబో. ఈయన వృత్తి రీత్యా న్యాయవాది. న్యాయస్థానాల్లో జరిగే సన్నివేశాలను, సందర్భాలను, తీర్పులను తీసుకొని అనేక రచనలు చేశారు. ఈ రచనలు న్యాయస్థానాల్లో జరిగే సన్నివేశాలను తీసుకొని వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాల సంపుటి ఈ రచన. అలాగే

తెలంగాణకు చరిత్ర ఉన్నట్లే తెలంగాణ న్యాయ వ్యవస్థలకు చరిత్ర ఉందని రచయిత అంటారు. తెలంగాణ న్యాయవ్యవస్థ అనేక సంవత్సరాల నుంచి అన్యాయానికి గురవుతూ వస్తుందని తెలియజేస్తున్నారు. ఇంకా మన న్యాయవ్యవస్థలు ఫ్యూడల్ స్వభావాన్ని కలిగి ఉన్నాయని అంటారు.

అలాగే **తెలంగాణ చరిత్ర తొవ్వలో-2**లో కనుమరుగైన, కనుమరుగవుతున్న తెలంగాణ చరిత్రను రచయిత శ్రీ రామోజు హరగోపాల్ తెలియజేశారు. అట్లాగే తెలంగాణ చరిత్ర తొవ్వలో -1 లో తెలంగాణ చరిత్రను తెలియజేశారు. ఈ రెండు రచనల్లోని వ్యాసాలన్నీ దక్కన పత్రికలో క్రమంగా అచ్చయిన వ్యాసాలు. రచయిత చాలా కాలం పాటు తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచి తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణ చరిత్ర మీద, సాహిత్యం మీద విస్తృతంగా పరిశోధించి, పరిశోధానాత్మకమైన వ్యాసాలు రాస్తూ వస్తున్నారు. రచయిత తెలంగాణలోని పల్లె పేరు వెనుక ఒక చరిత్ర దాగి ఉందని అంటారు. తెలంగాణలోని ఏ పల్లెను తాకిన చరిత్రను చెప్తుందని అంటారు. అలాగే ఏ చెట్టును, పుట్టను, గుట్టను, గుళ్లను తాకిన తెలంగాణ చరిత్రను చెప్తుందని అంటారు. తెలంగాణ చరిత్ర అంతా అద్భుతమైనదని అంటారు. భారతదేశంలో పట్టనంత చరిత్ర తెలంగాణలో ఉందని అంటారు. తెలంగాణలోని అదిలాబాదులో లావా స్తంభాలు ఉంటాయని చాలామందికి తెలియదని అంటారు. ప్రపంచ మానవ విశ్వాస దశలన్నిటిని తెలంగాణ చరిత్రలో, సాహిత్యం చూడవచ్చని రచయిత అంటారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రచయిత హరగోపాల్ తెలంగాణలోని అనేక ప్రాంతాలను, చారిత్రక ప్రదేశాలను, గుహలను, కట్టడాలను సందర్శించి తెలంగాణ చరిత్రను వెతికి తీశారు. తెలంగాణకు కేంద్రమైన హైదరాబాదులో మూలమూలాన తెలంగాణ చరిత్ర దాగి ఉందని, దానిని వెతుకోచ్చని అంటారు. అలాగే తెలంగాణలోని గ్రామ గ్రామాన తెలంగాణ చరిత్రను కూడా ఎతుకోవచ్చని రచయిత అంటారు.




**"తెలంగాణ శిథిలాలు -వ్యతాభరిత కథనాలు"** దీనిని ఈమని శివనాగిరెడ్డి రచించారు. ఇది చాలా చిన్న రచన. కానీ ఇందులో తెలంగాణకు సంబంధించిన అనేక చారిత్రక, సామాజిక, సాహిత్య అంశాలు ఉన్నాయి. తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలను నిర్లక్ష్యం చేయడం వల్లే తెలంగాణ చరిత్ర రోజురోజుకు కాలగర్భంలో కలిసిపోతుందని రచయిత అంటున్నారు. తెలంగాణ చరిత్ర ఎలా కాలగర్భంలో కలిసి పోతున్నదో ఈ రచనలో వివరించారు. ఎట్లా కనుమరుగవుతున్నదో తెలియజేశారు. అది గుడి కావచ్చు, గోపురం కావచ్చు. శాసనం కావచ్చు. కోటలు కావచ్చు. వనరులు కావచ్చు. ఇవన్నీ మన చరిత్ర అని చెప్పి ఆనవాళ్లు, చారిత్రక అంశాలు. రచయిత శివనాగిరెడ్డి తనదైన శైలిలో తెలంగాణ చరిత్రను ఈ రచనలు ఆవిష్కరించారు.

వేదకుమార్ మణికొండ తెలంగాణ సమాజమంతటికి సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేయడంలో గాని, సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించడంలో గాని తన వంతు కృషి ఎంతో చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరుగుతున్న సమయంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన "తెలంగాణ రిసోర్స్ సెంటర్"ను స్థాపించి అనేక సమావేశాల్లో చర్చలను, సదస్సులు నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 'దక్కన్‌ల్యాండ్' పత్రిక స్థాపించారు. ఈ పత్రిక నేటికీ కొనసాగుతుంది. ముఖ్యంగా ఈ పత్రికలో వచ్చిన వ్యాసాలను అనేక పుస్తకాలుగా ప్రచురించారు. 1) కోర్టుతీర్పులు సాహిత్య వెలుగులు, 2) తెలంగాణ చరిత్ర తువ్వలో-2, 3) తెలంగాణ శిథిలాలు వ్యథాభరిత కథనాలు' ఈ మూడు రచనలోని వ్యాసాలు దక్కన్ పత్రికలో అచ్చయిన వ్యాసాలు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ రచనలు ఆవిష్కరించబడ్డాయి. ఈ మూడు రచనలు తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ చరిత్రను తెలియజేస్తున్నాయి.

కార్యక్రమంలో రచయితలు బీవీ భద్రగిరీష్ (తెలంగాణ చరిత్రకారుడు) మరియు డాక్టర్ డి.ఆర్. శ్యాంసుందర్ రావు (చరిత్రకారుడు) కూడా పాల్గొన్నారు. ప్రధాన అతిథులు ఆవిష్కరించిన మూడు పుస్తకాల విశేషాలను తెలియజేశారు. ఇలాంటి ప్రచురణలు తెలంగాణ గాథ వారసత్వానికి జీవం పోస్తాయని చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరినీ ప్రఖ్యాత ఫోటో గ్రాఫర్ రవీందర్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఖైజర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఈ కార్యక్రమం రచయితలు, చరిత్రకారులు, విద్యావేత్తలు మరియు పుస్తక ఔత్సాహికులతో సహా ఉత్సాహభరితమైన ప్రేక్షకులను ఆకర్షించింది.

- ఎ. మల్లేష్,
రీసెర్చ్ స్కాలర్, ఒ.యు,
m : 9603870734

# పుల్లూరు బండ

*'జాతరంటె జాతర పుల్లూరుబండ జాతర*
*పుల్లూరు బండజాతర, పోదాము పదే జాతర'*

ఈ జానపదగీతం పుల్లూరుబండ జాతరను గొప్పగా కీర్తిస్తుంది. పుల్లూరుబండ మీద వెలసిన 'నరసింహస్వామి'కి ప్రతి సంవత్సరం పుష్యబహుళ అమావాస్య, మాఘశుద్ధ పాడ్యమి, విదియల్లో మూడురోజులు జరిపే ఉత్సవాలే పుల్లూరుబండజాతర.

సిద్ధిపేట జిల్లాకేంద్రానికి 6కి.మీ.ల దూరంలోనే ఉన్న పుల్లూరు పురాచారిత్రక ప్రదేశం. పుల్లూరుబండను ఆనుకునే చరిత్రపూర్వయుగ విశేషాలు, మధ్యయుగాలనాటి గుడులు, గోపురాలు విస్తరించివున్నాయి.

ఇపుడు పుల్లూరు గుట్ట తొవ్వకు కట్టిన కొత్త కమాన్ కాదు, గుట్టమీద ఒక నిరాలంకారమైన ద్వారతోరణముంది. తెలంగాణ అంతటా దేవాలయాల ముందర కనిపించే వైవిధ్య భరితమైన, శిల్పసంపన్నమైన ద్వారతోరణాలలో ఈ ద్వారతోరణం నిరాడంబరంగా వున్నది. ఈ తోరణం నుంచి లోపలికి ప్రవేశించగానే ఎదురుగా కనిపించే ధ్వజస్తంభం నిర్మాణశైలినిబట్టి జైనమాన స్తంభం. నరసింహస్వామి గుడిలోపల మంటప స్తంభాలన్నీ రాష్ట్రకూటశైలికి చెందినవే. గుడి అర్ధమంటప నిర్మాణ పద్ధతిలో నిర్మించింది.


పుల్లూరు శివాలయం

బయట నుంచి దేవాలయాల అధిష్ఠానంమీద రాష్ట్రకూటశైలి కుడులు (గవాక్షాలు) అగుపిస్తాయి. అంటే ఇక్కడ రాష్ట్రకూటులకాలంలోనే దేవాలయాలు నిర్మించబడ్డాయని,తర్వాతికాలంలో గుడులు పునరుద్ధరించ బడ్డట్లు తెలుస్తున్నది.


పుల్లూరు తోరణద్వారం

**పుల్లూరు గుడులు-గోపురాలు:**

గుట్టమీద రెండు పురాతన దేవాలయాలున్నాయి. మొదటిది వేంకటేశ్వర ఆలయం. రెండవది ప్రసన్నకేశవ, వైజేశ్వరాలయమనే త్రికూటాలయం. ఆరడుగుల ఎత్తైనా లేని మంటపం, ఉపాలయాలు. వైజేశ్వరుని గుడిలో శివలింగం, వెనక పార్వతీసమేత శంకరుని విగ్రహశిల్పం, పక్కన వినాయకుడున్నారు. వైజేశ్వరుడు చతుర్భుజుడు. నిజహస్తాలలో కుడిచేయి అభయహస్తంగా, ఎడమచేయి పార్వతిని ఆలింగనం చేస్తున్నది. పరహస్తాలలో త్రిశూలం, ఢమరుకాలున్నాయి. సకలాలంకారశోభితుడైన వైజేశ్వరుడు వక్షబంధంతో, జంధ్యంతో కనిపిస్తున్నాడు. సుఖాసనంలో కూర్చున్న శివుని ఎడమ తొడమీద పార్వతి అభయహస్తం, తామరమొగ్గలతో కనిపిస్తున్నది. నందివాహనాన్ని చెక్కివున్న ఈ దేవతాధిష్ఠానపీఠం చక్కటి శిల్పం.

ఈ త్రికూటాలయంలో వుండాల్సిన ప్రసన్నకేశవుడు విరిగి, శిథిల రూపంలో మరొక ఆలయంలో వున్నాడు. కటికముద్రలో శంఖం, చక్రం ధరించివున్నాడు. నిజహస్తం కుడిచేతిలో ఫలమగుపించడం విశేషం. ఆ తోడుగుడిలో... వేర్వేరు కాలాలకు, వేర్వేరు శైలులకు చెందిన ఇద్దరు ఆదిత్యులున్నారు. ప్రభావళితో కనిపించే సూర్యునికి హార, గ్రైవేయయాలు, జూకాలు, వక్షబంధం, జంధ్యం, కటిమేఖలతో కనిపిస్తున్నాడు. చాళుక్యశైలి. రెండవ సూర్యుడు కాకతీయశైలిలో చెక్కిన స్థానకమూర్తి. చాళుక్యశైలిలో లలితాసనంలో ఒక గణపతి, రెండే చేతులతో మరొక వినాయకుడు అగుపించాడు. ఆరడుగుల ఎత్తున్న రాతిస్తంభం మీద చెక్కిన రాష్ట్రకూటశైలి 5 పడగల నాగరాజు, షణ్ముఖి, రాష్ట్రకూటశైలి మహిషాసురమర్దిని విగ్రహా లున్నాయి. ఒక దేవాలయ విమానం అపూర్వంగా వుంది. చెక్కిన రాతిపలకల అమరిక పైనుండాల్సిన శిఖర శిలలు లేవు. రెండు విమానాలున్నాయి త్రికూటాలయానికి. మరొక ఆలయగోపురం పాతకాలపు పెద్ద ఇటుకలతో నిర్మించబడి వుంది. ఆలయ ద్వారశాఖలమీద కలశాలున్నాయి. ఒక గుడి ద్వారశాఖమీద స్తంభికలున్నాయి. శైవద్వార పాలకులు న్నారు. రెండు ఆలయాల మధ్యన గుండం (పుష్కరిణి) వుంది. గుడికి తూర్పు, ఉత్తర ద్వారాల ముందు రెండు నందులున్నాయి. ఉత్తర ద్వారం దగ్గర సప్తమాతృకల శిలాఫలకం వుంది. ఉత్తరం వైపున గుడికవతల గుట్ట అంచున అందమైన 9 అడుగుల గరుడ విగ్రహం వుంది. ఆ ప్రాంగణంలోనే నడుంవరకు విరిగిన భైరవుని శిల్పమున్నది.

**గుడిలో కాకతీయ శాసనం:**

తెలంగాణ శాసనాలలో పులగనూరు-70 కంపణంగా పేర్కొనబడిన పుల్లూరు వైజేశ్వరాలయంలో కాకతీయ శాసనముంది. అక్కడి ఆలయస్తంభాల్లో ఒకదానిపై శాసనం చెక్కబడివుంది. పరిష్కృతమైన ఈ శాసనం గణపతిదేవచక్రవర్తి కాలం( సంవత్సరం లేదు)నాటిది. 'భోగం దాని గుడి'గా పిలువబడే ఈగుడిలోని ఇద్దరు దేవరలకు తీర్థం చేయడానికి ఒకరు(?) వ్రిత్తులిచ్చినట్లు తెలుపుతున్న దానశాసన మది.

స్తంభానికి 1,2 వైపుల కాకతీయ వంశం ప్రస్తావన, గణపతిదేవ చక్రవర్తి పేరున్నది...

స్తంభానికి 3డో వైపున

'మటప్రోల......


వైజేశ్వరాలయం


వైజేశ్వరుడు



రుషభ తీర్థంకరుడు


ప్రసన్న కేశవుడు


సూర్యులు


జైనయక్షుడు చామరధారి


మహిషాసుర మర్ధిని


సూర్యులు

గా పద్మ....రాయ
కొడ్కు రామనాథ
ఎత్తించిన దేవ
లు భలు....ర....' అని వుంది...

గుడి ఆవరణ చుట్టు నిర్మించిన ప్రాకారపు గోడ లోపల, బయటా దీపాలు వెలిగించడానికి దీగూళ్ళున్నాయి. సత్రపు గదులు, ఇతర కట్టడాలు కూలిన ఆనవాళ్ళున్నాయి.

**వైష్ణవుల పరమపద 'చరమస్థలం':**

గుట్టకు ఉత్తరాన దిగుడంచుల్లో చర్మస్థలం అని పిలువబడే వైష్ణవాచార్యుని సమాధి వున్న చిన్న సొరంగం వంటి నిర్మాణం. లోపల దేవుని పాదాలు రెండుచోట్ల, శంఖ, చక్రాలతో కూడిన తిరునామాలున్నాయి. మరొక చర్మస్థలి పూర్తిగా ధ్వంసస్థితిలో వుంది.

**పుల్లూరు గ్రామ శివాలయం:**

సిద్ధిపేట జిల్లా కేంద్రానికి దగ్గరగా వున్న పుల్లూరు గ్రామంలో తూర్పున పునర్నిర్మించిన శివాలయం వుంది. 2014లోని రూపురేఖలు ఇవి. దేవాలయ స్తంభాలు, స్తంభాల కింది దిమ్మెలు రాష్ట్రకూటుల నాటివి. దేవాలయ ద్వారబంధాలు కాకతీయం. గర్భగుడిలోని ఎత్తైన పానవట్టంమీద కాకతీయశైలి సమలింగం అమరివుంది. నందిమంటపం అప్పటికి పూర్తికాలేదు. గుడిముందర కొత్తనందిని ప్రతిష్ఠించారు. అక్కడే ఒక వీరగల్లు వుంది.

గర్భాలయ ద్వారం ముందర శంఖలతాతోరణం వుంది. ఇది జైనదేవాలయ లక్షణం. గ్రామంలో బాట అవతల పొదల్లో పడివున్న జైనశిల్పం, చామరధారి విగ్రహాలు అక్కడ పూర్వం జైనబసది వుండేదనడానికి ఆనవాళ్ళు. ఒకప్పటి జైన దేవాలయాలు శైవాలయాలుగా పరివర్తన చెందాయనడానికి నిదర్శన గుడి.

**పుల్లూరులో జైనబసది అవశేషాలు:**

గ్రామంలో రోడ్డు పక్కన పొలంలోని దిబ్బమీద పొదల్లో జైనవిగ్రహాలు రెండున్నాయి. ఒకటి జైన తీర్థంకరులలో ఆదినాథుడైన ఋషభుని శిల్పం. ముఖం శిథిలమైపోయింది. భుజాలమీద గిరజాలజుట్టు కనబడుతున్నది. నడుమువరకు భూమిలోనే మునిగిపోయివుంది. రెండవది తీర్థంకరులకు పరిచారకుడైన యక్షుని శిల్పం. కుడిచేత చామరం, ఎడమచేత నిమ్మజాతిఫలం ధరించివున్నాడు. ఇది కూడా భూమిలో దిగబడేవున్నది. అక్కడ మరికొన్ని దేవాలయ శిథిలాలు అగుపించాయి. ఈ శిల్పాల ఆధారంగా ఇక్కడ ఒక జైనబసది వుండివుంటుంది. నిర్మాణశిథిలాలు మాత్రం మిగిలున్నాయి. అక్కడ లభిస్తున్న కుండపెంకులు, పెద్దగాజుల ముక్కలు అక్కడ పుల్లూరు పాటిగడ్డ వుందని తెలిపే ఆధారాలు.

**పుల్లూరుగుట్టమీద పురాతన శిలారూపాలు...**

ఇక్కడ ఈ రాతిగుండ్లమీద ప్రాకృతిక సహజమైన లైకిన్స్ అంటే శైవలాలు, శిలీంధ్రాలు వివిధ రంగులలో ఎక్కువగా కనిపిస్తుంటాయి. వాటిదేం పెద్దచరిత్రకాదు. లైకిన్స్ సర్వసాధారణం. రాతిసిరలు కూడా అంతే. అయితే రాతిసిరలు భూమ్మీద రాళ్ళు ఏర్పడేకాలానికి సంబంధించిన భూపరిణామాల గుర్తులు.

పుల్లూరుగుట్ట గ్రానైట్ బండ. ఈ గ్రానైట్ రాయి మీద అక్కడక్కడ గాఢమైన రంగు మచ్చలతో కనిపిస్తుంది. దానిని టెక్నికల్ గా ఎంఎంఇ(మాఫిక్ మైక్రోగ్రాన్యులార్ ఎంక్లేవ్) అంటారు. ధార్వార్ శిలలలో గ్రానైట్ లలో ముందే ఎంఎంఇలను కలిగివున్న క్సెనోలిథ్స్ అంటే మాగ్మా వెలువడ్డప్పుడు ఏర్పడే రాళ్ళల్లో విశేష శిలారూపాలు. తనకు హొస్ట్ రాయి కరిగిన స్థితిలో ఉన్నపుడు దానితోపాటు సమానంగా పుట్టుకొచ్చేది ఎంఎంఇ. చల్లబడే గ్రానైట్ మాగ్మాలో ఇరుక్కున్న ప్రత్యేక శిలారూపాలివి. ఎంఎంఇ, క్సెనోలిథ్స్ రెండు వేర్వేరు. క్సెనోలిథ్ పాక్షికంగా వాతావరణంతో శైథిల్యం చెంది రాతిగుంట ఏర్పడుతుంది. క్సెనోలిథ్ నెమ్మదిగా చెదిరిపోతుంది. ఒక గుంట, లేదా కుండంలెక్క ఏర్పడుతుంది. వాటిలో వర్షపునీరు నిండిపోతుంది. ఏడాదంతా నీరుంటుంది. అక్కడ దేవాలయాలు నిర్మించినపుడు అది దేవుని గుండమౌతుంది. అటువంటి ఆనవాళ్ళు పుల్లూరు మీద కనిపిస్తున్నాయి.

**పుల్లూరు బండలో మెగాలిథిక్ సమాధుల తవ్వకం:**


2014-15 జూలైలో ప్రస్తుత తెలంగాణ వారసత్వశాఖ పుల్లూరు గ్రామంలో మెగాలిథిక్ బరియల్ తవ్వకాలను చేపట్టింది.


జైనమాన స్తంభం


నరసింహస్వామి వ్యక్తరూపం


పుల్లూరు శివాలయం



పుల్లూరు నందులు



పుల్లూరు చరిత్రపూర్వయుగం-ఇనుపవస్తువులు


పెదరాతియుగం సమాధులతవ్వకం


చరిత్రపూర్వయుగం ఆనవాళ్ళు


చరమస్థలి


చరమస్థలి


సప్తమాతృకలు


కాకతీయ శాసనం


నరసింహస్వామి ఆలయమంటపం

తెలంగాణా రాష్ట్రంలో మెగాలిథ్స్ ప్రత్యేకమైనవి. తెలంగాణా గ్రామాల్లో మెగాలిథ్ మాన్యుమెంట్స్‌లో వందలాది నిలువురాళ్ళు, బంతిరాళ్ళు, డోల్మన్లు, డోల్మనాయిడ్ సిస్టులున్నట్టు నివేదికల వల్ల తెలుస్తున్నది. స్త్రీ, పురుష విగ్రహరూప నిలువురాళ్ళు, శిలువరూప ఏకశిలలు మల్లూరుగుట్ట, గలాభా, కాంచనపల్లివంటి మధ్యగోదావరిలోయలో కన్పిస్తాయి. ప్రత్యేకమైన మెగాలిథిక్ సంస్కృతి ఇక్కడి విశేషం. తెలంగాణాలో కనిపించే ఈ మెగాలిథిక్ మాన్యుమెంట్స్ క్రీ.పూ. 2000 సం.ల నుంచి క్రీ.శ. 400 సం.ల మధ్యవి.

భౌగోళికంగా 18°10'34"డిగ్రీల ఉత్తర అక్షాంశాలు, 78°48'41"డిగ్రీల తూర్పు రేఖాంశాల మీద సిద్దిపేట జిల్లా, పుల్లూరు బండలో దాదాపు 50కి పైగా పెదరాతియుగం సమాధులున్నాయి. వాటిలో నిలువురాళ్ళు, కుప్ప సమాధులు(కైరన్లు), డోల్మన్లు రకాలున్నాయి. పుల్లూరు మెగాసమాధుల సంప్రదాయాలు, సంస్కృతి అర్థం చేసుకోవడానికి తవ్వకాల నిమిత్తం మూడు సమాధులను ఎంపిక చేసింది పురావస్తుశాఖ. పెదరాతియుగం సమాధుల తవ్వకాలపై ప్రత్యేక నివేదికనిచ్చింది వారసత్వశాఖ.

**నిలువురాళ్ళు:**

వారసత్వశాఖ తవ్వకాలకు ఎంపిక చేసిన మొదటి పెద్ద సమాధికి ఉత్తరాన 5.4మీ.ల ఎత్తైన నిలువురాయి వుంది. దాని మీద పెట్రోగ్లైఫ్స్ వున్నాయి. ఇంకా ఆ ప్రదేశంలో వున్న నిలువురాళ్ళు ఎన్నోవున్నాయి. వాటిలో ఒకదానిని గ్రామస్తులు 'మైసమ్మ'గా పూజించడం విశేషం. పురామానవ సంస్కృతి అవశేషం కొనసాగింపు.

**పుల్లూరు అమ్మదేవత:**

పుల్లూరులో వారసత్వశాఖ తవ్వకాలలో ఒక మెగాలిథిక్ సమాధి నుంచి బయటకు తీసిన పురావస్తు సముదాయంలో ఒక రాతి కడ్డీ వుంది. అంతా అంగుళంన్నర మందం వున్న చతురస్రాకారపు రాతికడ్డి 11, 12 అంగుళాల ఎత్తుంది. పైభాగంలో కొంచెం భాగం వదిలేసి రాతికడ్డీచుట్టు చెక్కిన గాడి వుంది. తర్వాత 3అంగుళాల కింద పక్కల్లో మరొక ఏటవాలు గాడి చెక్కివుంది. పిదప కింద నుంచి ముందు 1అంగుళం నుంచి వెనక 2అంగుళాల ఎత్తులో రెండుగాడులు వున్నాయి. బొమ్మలా కనిపించే ఈ రాతికడ్డీ ముందుభాగంలో కింద కడ్డీ కింద నుంచి పైకి 1అంగుళం గాడి కనిపిస్తున్నది. ఆ గాడి పైన కొంచెం ఖాళీతో ఆ పైన చిన్న గాడి వుంది.

వీటన్నిటిని క్రమంగా గమనిస్తే ఈ రాతికడ్డీ ఒక స్త్రీ రూపాన్ని చెక్కిన అతిప్రాచీన శిల్పం అనిపించింది. పైన 1అంగుళం లోపుననే వున్న గాడి తలభాగానికి ప్రాతినిధ్యంగా అనుకుంటే, దాని కింది భాగం నడుం నుంచి శరీర పైభాగం, మధ్యలో చెక్కిన రెండువరుసల గాడుల కింద చుక్కలెక్క పెట్టిన గాడి స్త్రీ జననేంద్రియాన్ని సూచిస్తున్నది. దాని కింద చెక్కిన గాడి శరీర శిల్పంలో కాళ్ళను వేరుచేస్తున్న శిల్పభాగం.

పుల్లూరులో మెగాలిథిక్ (పెదరాతియుగం) సమాధులను పురావస్తుశాఖవారు తవ్వినపుడు పెద్ద మెన్హర్ నిలిపివుంచిన సమాధిలో ఈశాన్యభాగంలో లభించిన అస్థిపంజరం పక్కన ఈ రాతికడ్డీశిల్పం వున్నది. ఆ అస్థిపంజరం అక్కడి ఆవాసంలోని పురామానవుల నాయకుడిదో, పూజారిదో అయివుంటుంది. ప్రముఖులకే మెన్హర్ నిలుపడం, పెద్ద రాతిబండ క్యాప్ స్టోన్(మూతరాయి)గా వేయడం ఆచారమైవుంటుంది.

ఈ రాతికడ్డీ బొమ్మ...ఒక అమ్మదేవతాశిల్పం. హరప్పా నాగరిక ముద్రలు, శిల్పాలలో కూడా టెర్రకోట బొమ్మలే దొరికాయి కాని, రాతిశిల్పాలు తక్కువ. ఈ పుల్లూరు అమ్మదేవత ప్రాచీన దేవత. నగ్నకబంధ వంటిదే.

ఈ పుల్లూరు అమ్మదేవత ప్రత్యేకంగా పరిశోధించాల్సిన పురాయుగ శిల్పం.

**పుల్లూరు భద్రపరచవలసిన చరిత్రపేటిక:**

పుల్లూరు గుట్ట చుట్టూ, బాటవెంట వందలాది ఆదిమానవుల సమాధులను చూసాం. వీటిలో మెన్హర్లు, గూడుసమాధులు, కుప్పసమాధులు, కైరన్లు, సిస్టులున్నాయి. అక్కడ ఈ సమాధులను ఎక్కడా లేనివిధంగా పేర్లు పెట్టి పిలుచుకుంటున్నారు గ్రామస్తులు. మెన్హర్ ను కొచ్చెగుండు అని, డోల్మన్‌లను పాతమైసమ్మ అని పేర్లు పెట్టుకున్నారు. చాలా చోట్ల వ్యవసాయం కోసం తవ్వేయడం వల్ల చాలా సమాధులు ఉపత్తమై పోతున్నాయి. రాతివనిముట్లు చెల్లాచెదురైపోతున్నాయి. తవ్వేసిన సమాధుల్లోంచి బయటపడిన కుండపెంకుల అంతటా పరుచుకుని వున్నాయి. మాకు కొత్తగా ఒక రాతిపలక అంచున రాతలవంటి పెట్రోగ్లైఫ్స్ లభించాయి.

వీటిని త్వరగా పరిరక్షించే ప్రయత్నాలు చేయకపోతే గొప్ప చారిత్రకసాక్ష్యాలను కోల్పోతాం.

**ధన్యవాదాలు:**

పుల్లూరుగుట్టమీది పురాతన శిలారూపాల గురించి వివరించిన కొత్త తెలంగాణచరిత్రబృందం సలహాదారులు, గౌరవనీయులు చకిలం వేణుగోపాలరావు గారికి, 18.02.15న సిద్దిపేట మండలం పుల్లూరును నాతో కలిసి సందర్శించిన వేముగంటి మురళీకృష్ణ, వేముగంటి రఘునందనన్న, కరుణాకర్ లకు, ఇంకా ఇటీవలికాలంలో పుల్లూరులో చారిత్రక ప్రదేశాలను గుర్తించిన చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డిగారికి, మహమ్మద్ నసీరుద్దీన్‌లకు, మా చరిత్రబృందం సభ్యులు కొలిపాక శ్రీనివాస్, సిరిపురం నరేందర్‌లకు, ధన్యవాదములు.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com



# బయోస్పియర్ పార్క్!

- చింతూరు, రంపచోడవరం ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదన
- 2 లక్షల హెక్టార్లలో ఏర్పాటుకు అవకాశం
- అటవీ, జంతు సంరక్షణతో పాటు పరిశోధన, శిక్షణకు యునెస్కో నిధులు

**ఆం**ధ్రప్రదేశ్‌లోని చింతూరు, రంపచోడవరం ప్రాంతాల్లోని సుమారు 2 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో బయోస్పియర్ పార్కు (జీవావరణ పార్క్) ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో యునెస్కోకు ప్రతిపాదనలు పంపాలని భావిస్తున్నారు. ఇప్పటికే శేషాచలం అటవీ ప్రాంతాన్ని 2010లోనే యునెస్కో జీవావరణ పార్కుగా గుర్తించింది.

4,756 కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన శేషాచలం పార్కు రాష్ట్రంలో మొదటిది కాగా, తాజాగా 2 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో రెండో పార్కును ప్రతిపాదిస్తున్నారు. ప్రధానంగా అటవీ ప్రాంతాన్ని సంరక్షించడంతో పాటు వివిధ జీవరాశులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో బయోస్పియర్ పార్కును అటవీశాఖ ప్రతిపాదిస్తోంది. దీనికి ఆమోదం లభిస్తే అటవీ, జంతు సంరక్షణతో పాటు పరిశోధనలు, శిక్షణ కార్యకలాపాలకు యునెస్కో సహాయం అందించనుంది.

### బయోస్పియర్ రిజర్వ్‌గా మర్రిపాకల అటవీ ప్రాంతం

మర్రిపాకల అటవీప్రాంతాన్ని బయోస్పియర్ రిజర్వ్‌గా ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నట్లు చింతపల్లి డీఎఫ్‌వో వైవీ నర్సింగరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం కాకరపాడు డిపోలో ఆయన మాట్లాడుతూ.. చింతూరు, రంపచోడవరం డీఎఫ్‌వోలను సంప్రదించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

దట్టమైన అడవి ఉన్న మర్రిపాకల ప్రాంతాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కొందరు విద్యుత్ తీగలు అమర్చి జంతువులను వేటాడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### జీవావరణ పార్కులో 3 జోన్లు

**కోర్ జోన్:** ఈ ప్రాంతంలో ఎటువంటి కార్యకలాపాలను అనుమతించరు.

**బఫర్ జోన్:** పరిమితంగా స్థానిక ప్రజలను మాత్రమే అవసరమైన వనరుల సమీకరణకు అనుమతిస్తారు.

**ఫ్రీ జోన్:** ఇది పార్కు వెలుపలి ప్రాంతం. ఇక్కడ ఎటువంటి నియంత్రణ లేకుండా సాధారణ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుంది.

### దేశవ్యాప్తంగా 18 పార్కులు..

జీవావరణ పార్కుల అభివృద్ధి కార్యక్రమాన్ని 1971లో యునెస్కో చేపట్టింది. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాల్లో 18 జీవావరణ పార్కులు ఏర్పాటయ్యాయి.

– దక్కన్‌న్యూస్

m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ

భారతదేశం, సంస్కృతి, నాగరికత యొక్క మూలాధారం, సాంప్రదాయ కళలు, చేతిపనుల యొక్క గొప్ప మూలం. ఇది శతాబ్దాలుగా కొనసాగుతూ, ప్రామాణికమైన, వినూత్నమైన, సృజనాత్మకంగా మిగిలిపోయింది. వారి అద్భుతమైన నైపుణ్యం, విలువైన ప్రాచీనతకు బహుమతిగా ఉంది. కళాత్మక వ్యక్తీకరణల రూపంలో అసాధారణమైన సంపద, వైవిధ్యమైన శైలులతో పాటు, భారతదేశంలోని ప్రతి ప్రాంతం కలప మరియు లోహం వంటి సహజ పదార్థాల లభ్యతపై ఆధారపడి ప్రత్యేకమైన చేతిపనులను కలిగి ఉంటుంది. సాంప్రదాయ హస్తకళలు వాటి స్వాభావిక విలువ, డిజైన్ యొక్క పరిపూర్ణత, ప్రతి నిర్దిష్ట ప్రాంతానికి ప్రత్యేకమైన విలక్షణమైన శైలి కారణంగా సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్నాయి. అటువంటి ప్రాచీన కళలలో ఒకటి తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ఉన్న ఒక సుందరమైన గ్రామమైన పెంబర్తి యొక్క మెటల్ ఆర్ట్.



పండితులు మనకు ఇనుము తెలియని పూర్వ యుగం గురించి చెబుతారు మరియు లోహపు పనిముట్లు మరియు రోజువారీ ఉపయోగించే వస్తువులను తయారు చేయడానికి రాగి మరియు మిశ్రమాలను ఉపయోగించారు. ఆ వయస్సులో కొంత భాగం ఇప్పటికీ మనతోనే ఉంది కానీ ఎక్కువగా కళ వస్తువులలో ఉంది.

కొన్ని కారణాల వల్ల ఈ విస్తృతమైన క్రాఫ్ట్ చిన్న గ్రామమైన పెంబర్తిలో మాత్రమే మిగిలి ఉంది.

పెంబర్తి మెటల్ క్రాఫ్ట్ అనేది తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలోని పెంబర్తిలో తయారు చేయబడిన ఒక ప్రసిద్ధ మెటల్ హస్తకళ, ఇది సున్నితమైన షీట్ మెటల్ కళాకృతులకు విస్తృతంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారు చేయబడిన క్లిష్టమైన షీట్ మెటల్ ఇత్తడి చెక్కడం మరియు కళాఖండాలు 800 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నాటివి.

పెంబర్తి హైదరాబాద్ నుండి 80 కి.మీ దూరంలో ఉన్న గ్రామం. 500 సంవత్సరాల పాటు సాగిన కాకతీయ సామ్రాజ్య కాలంలో ఈ ప్రాంతం వైభవాన్ని సంతరించుకుంది. పెంబర్తికి మెటల్ కార్మికులు లేదా 'విశ్వకర్మల' యొక్క అత్యుత్తమ పనితనం యొక్క గొప్ప చరిత్ర ఉంది.

అందువల్ల, అనేక హిందూ దేవాలయాల విగ్రహాలు (విగ్రహాలు) అలాగే వాహనాలు (రథాలు) అలంకరించబడినందున షీట్ మెటల్ పని ప్రక్రియ ప్రజాదరణ పొందింది. కాకతీయ రాజ్యంలో దేవాలయాలకు గొప్ప ఆదరణ లభించడంతో, పెంబర్తి షీట్ మెటల్ పని దేశం నలుమూలల నుండి దృష్టిని ఆకర్షించింది.

తెలంగాణ ప్రాంతంలోని చాలా పురాతన దేవాలయాలు కాకతీయ పాలకుల ఆధ్వర్యంలో నిర్మించబడినందున, ఈ దేవాలయాలు పెంబర్తి కళాకారుల సంతకం శైలిని కలిగి ఉన్నాయి. మాస్టర్ హస్తకళాకారులు ప్రదర్శించిన ఉన్నత స్థాయి నైపుణ్యాలను అనుసరించి మెటల్ క్రాఫ్ట్ పరిపూర్ణత యొక్క పరాకాష్టకు చేరుకుంది. ఈ ప్రాంతంలోని విశ్వకర్మలు ఈ రకమైన లోహ శిల్పంలో వారి అరుదైన నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు. దీనిని పెంబర్తి బ్రాస్‌వేర్ అని కూడా





పిలుస్తారు. ప్రతి హస్తకళ ప్రదర్శనలో ఇది ఒక ముఖ్యమైన కళాఖండంగా మారింది మరియు తెలంగాణ కళాత్మక వారసత్వానికి పర్యాయపదంగా కూడా మారింది.

ముస్లిం పాలన వచ్చిన తర్వాత, పెంబర్తి హస్తకళాకారులు తమ కళా శైలిని అభివృద్ధి చేసుకున్నారు. తమలపాకులు లేదా పాండాన్‌లు, పరిమళ ద్రవ్యాల పాత్రలు లేదా ఇత్తర్ కుండలు, వేలాడే మెటల్ షాండ్లియర్‌లు లేదా జుమ్మర్లు, కుండీలు, ప్రత్యేక ఫలకాలు, మెమెంటోలు వంటి వ్యక్తిగత వస్తువులను అలంకరించారు.



ఈ నైపుణ్యం రాజకీయ పరిస్థితుల ఎదురుదెబ్బల నుండి బయటపడింది, అయితే స్వాతంత్ర్యానంతర యుగం మారిన డిమాండ్ విధానాలకు అనుగుణంగా ఈ కళ యొక్క పునరుజ్జీవనాన్ని చూసింది. అన్యదేశానికి అదనంగా ప్రయోజనాత్మక అంశం మీద ఎక్కువ ప్రాధాన్యత ఉంది. పెంబర్తి బ్రాస్‌వేర్, సంవత్సరాలుగా హిందూ మరియు ముస్లిం ప్రభావాల యొక్క ముఖ్యమైన సూక్ష్మ నైపుణ్యాలను సంగ్రహించింది, ఇది రెండు సంస్కృతులలో సజావుగా మిళితం చేయబడింది. క్రాఫ్ట్ ఫారమ్ ప్రతిష్ఠాత్మకమైన భౌగోళిక సూచికను పొందింది. ఇది నిజంగా క్రాఫ్ట్‌కు గౌరవం.

### మెటల్ ఆర్ట్‌వేర్– ది ప్రైడ్ ఆఫ్ పెంబర్తి

మెటల్ క్రాఫ్ట్ అత్యుత్తమమైనది మాత్రమే కాదు, 5,000 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నాటి భారతీయుల అత్యంత ప్రాచీనమైన చేతిపనులలో ఒకటి. లోహం, కాంస్య – ఇత్తడి వంటి మిశ్రమాలు పురాతన సమాజాలలో నిల్వ చేయడానికి లేదా అలంకరణ కోసం పాత్రలను తయారు చేయడానికి ఉపయోగించబడ్డాయి. ఇవి సాధారణ పాత్రల నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళల వ్యసనపరులు ఇష్టపడే అత్యంత సంక్లిష్టంగా రూపొందించిన కళాఖండాల వరకు మొత్తం శ్రేణి వస్తువులను కవర్ చేస్తాయి. తెలంగాణలోని పెంబర్తి గ్రామం దాని లోహ కార్మికులు లేదా 'విశ్వకర్మల' యొక్క అత్యుత్తమ పనితనం ఒక చరిత్రను కలిగి ఉంది. ఇది కాకతీయ రాజ్యం యొక్క వైభవం, వైభవాన్ని గుర్తించవచ్చు. మాస్టర్ హస్తకళాకారులు ప్రదర్శించిన ఉన్నత స్థాయి నైపుణ్యంలో మెటల్ క్రాఫ్ట్ పరిపూర్ణత యొక్క పరాకాష్టను సాధించింది. పెంబర్తిలోని విశ్వకర్మలు రాతి, లోహ శిల్పాలలో అరుదైన నైపుణ్యానికి ప్రసిద్ధి చెందారు. ఆలయ నిర్మాణం, 'విగ్రహాలు' – దేవతల విగ్రహాలు, 'వాహనాలు' – రథాలు, ఆలయ శిల్పకళకు సంబంధించిన ఇతర కళాత్మక ఉపకరణాలను రూపొందించడంలో పాలకులచే ఆదరణ పొందారు. దక్షిణ భారతదేశంలోని అనేక ప్రసిద్ధ దేవాలయాలను అలంకరించే అచ్చు హస్తకళలు, 'కీర్తి ముఖ', 'ప్రభ' – పినాకిల్స్‌కు ఉదాహరణగా ఉన్న అద్భుతమైన విగ్రహాలలో వారి కళాత్మకత యొక్క ప్రకాశం స్పష్టంగా కనిపిస్తుంది.

### కళాత్మక సృజనాత్మకతకు మరింత విలువను జోడించడం.

కాకతీయుల కాలం నాటి వైభవం క్రమంగా నిజాం ఆధిపత్యానికి దారితీసింది. పెంబర్తి కళారంగంలో మార్పు వచ్చింది. నిజాం కాలంలోని విశ్వకర్మలు, పాండర్డీ లు, నగర్దార్డీ లు, ఇత్తర్ కుండలు, శంగర్దార్డీ లు, వెండి – బంగారంతో తయారు చేసిన గృహోపకరణాలు, గృహ వినియోగానికి సంబంధించిన వస్తువులను రూపొందించారు. ఈ అద్భుతమైన కాలంలో పెంబర్తిలో కళాకారుల కుటుంబాల సంఖ్య 600కు పైగా పెరిగిందని చెబుతారు. హస్తకళాకారులు మెటల్ క్రాఫ్ట్‌లో వారి ప్రతిభావంతులైన పనితనానికి ప్రసిద్ధి చెందారు. మరియు గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతర యుగం కళ యొక్క పునరుజ్జీవనానికి



సాక్ష్యమిచ్చింది. ఇది అన్యదేశానికి బదులుగా ప్రయోజనాత్మకతను నొక్కిచెప్పిన, మారిన డిమాండ్ నమూనాను తీర్చడానికి తనను తాను లక్ష్యంగా చేసుకుంది.

**విశ్వకర్మ బ్రాస్, కాపర్ అండ్ సిల్వర్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ ఒక యునైటెడ్ అచీవ్‌మెంట్**

ఒకే కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయడం, ఒక ఉమ్మడి సౌకర్యాల కేంద్రం, అద్భుతమైన పెంబర్తి కళాఖండాల ప్రదర్శన కోసం ఒక అద్భుతమైన షోరూమ్ ఏర్పాటు చేయడం ఒక ముఖ్యమైన మైలురాయి. సహాయం కోసం ప్రభుత్వాన్ని సంప్రదించడంలో శ్రీ అయిలా ఆచారి యొక్క నిజాయితీ ప్రయత్నాలే ఈ కళను ప్రస్తుత వైభవంలో వర్ధిల్లేలా చేసింది. సిల్వర్ - గోల్డ్ నుండి బ్రాస్ మెటల్ వేర్‌కు మారడం ఈ మాస్టర్ క్రాఫ్ట్‌మ్యాన్ ద్వారా ప్రారంభించబడింది. పెంబర్తి ఇత్తడి చేతిపనులను అలంకార, గృహ, ప్రయోజనాల కోసం పరిచయం చేయడంలో మార్గదర్శకుడు.

సంఘం యొక్క ఉమ్మడి బలం, సహకార పనితీరు 60 కంటే ఎక్కువ మంది హస్తకళాకారుల కుటుంబాలకు



ఆదర్శవంతమైన పని పరిస్థితులను అందించగలిగింది. వారి ఆర్థిక పురోభివృద్ధికి, కళ మరింత అభివృద్ధి చెందడానికి గణనీయంగా దోహదపడింది. నేడు సృజనాత్మక, గొప్ప వినూత్న కళగా అభివృద్ధి చెందుతోంది. ఆధునిక పోకడల ప్రాధాన్యతలకు అనుగుణంగా, విశ్వకర్మ కళాఖండాల యొక్క విస్తారమైన శ్రేణి విస్తృత శ్రేణిని కలిగి ఉంది. వీటిలో వేలాడే దీపపు ఛాయలు, అలంకార మొక్కల కుండలు, దశావతార ప్యానెల్‌లు, నవగ్రహ - అష్టలక్ష్మి ప్యానెల్‌లు, దీర్ఘచతురస్రాకార మరియు గుండ్రని ఆకారాలు, క్లిష్టమైన చెక్కిన ఇలస్ట్రేటెడ్ ప్యానెల్‌లను వర్ణిస్తాయి. మహాభారతం, రామాయణం నుండి దృశ్యాలు, అత్యంత చిత్రించ బడిన నక్షి పనితో సృష్టించబడ్డాయి. చిహ్నాలు, ఉత్సవ విగ్రహాలు, వాహనాలు, ఆలయ అలంకరణ వస్తువులు కూడా ఘనమైన ఇత్తడి యొక్క క్లిష్టమైన అచ్చులలో రూపొందించబడ్డాయి.

విశ్వకర్మ మెటల్ హస్తకళలు తెలంగాణలోని గోల్కొండ హస్తకళల ఎంపోరియంలు, దేశ వ్యాప్తంగా హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా విక్రయించబడుతున్నాయి.

-సువేగా, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# నాణ్యత పాటిస్తూ లక్ష్యాలు సాధించాలి

## రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా ఉత్పత్తి: సీఎండీ ఎన్.బలరామ్

ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మార్చి 31 వరకు ఇకపై రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 12న హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తి, నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. లక్ష్యాల మేరకు ఉత్పత్తి సాధిస్తున్న గనులను, ఏరియాలను ఆయన అభినందిస్తూ, వెనుకబడి ఉన్న ఏరియాలు ఇప్పుడు పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాణ్యత తగ్గినట్లయితే వినియోగదారుల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏరియాలో పై అధికారుల నుంచి కిందిస్థాయి వరకు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు.

ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా 108 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఈ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదే మోతాదులో బొగ్గు రవాణా నిర్వహించాలన్నారు. బొగ్గు రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా, ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో సంప్రదిస్తూ వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందచేయాలని సూచించారు. విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా తగినంత బొగ్గును అందజేసే బాధ్యత మనపై ఉందని



ఆయన తెలియజేశారు.

కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, జి.వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవిప్రసాద్, మరియు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

**-చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్**

దిసింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ సంస్థ), ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL



# వ్యవ'సాయ' వర్సిటీ..

## అరవై ఏళ్లుగా రైతులకు సేవలందిస్తూ...

## అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాల సృష్టి

## కళాశాల నుంచి వ్యవసాయ పరిశోధనల వరకూ..

వ్యవసాయంలో నిత్య పరిశోధనలు.. వివిధ పంటలకు సంబంధించి కొత్త వంగడాల సృష్టి, సూక్ష్మనీటి సేద్యం, వ్యవసాయంలో యాంత్రీకరణ, పశువైద్య శాస్త్రం దిశగా పురోగమనం, వ్యవసాయ విద్య ద్వారా రైతులకు మేలు చేస్తూ, శాస్త్రవేత్తలను అందించడం.. ఇలా అనేక రకాలుగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోంది. యూనివర్సిటీ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు జరిగాయి.

### వ్యవసాయ కళాశాల నుంచి జయశంకర్ వర్సిటీ దాకా..

దేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మార్గదర్శకంలో వ్యవసాయ విద్య ఆలోచనలకు తొలిబీజం పడింది. 1955 జనవరి 6న అప్పటి భారత ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజేంద్రనగర్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 1964 జూన్ 12న వ్యవసాయ కళాశాల ప్రారంభం కాగా, 1965 మార్చి 20న అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీదుగా వర్సిటీని రైతులకు అంకితం చేశారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా ప్రారంభమై.. 1996లో ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీగా పేరు మార్చుకుంది. రాష్ట్ర విభజన తర్వాత 2014 సెప్టెంబర్ 3 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా అవతరించింది.

'ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 11 కళాశాలలు, 12 వ్యవసాయ పాలిటెక్నిక్, మూడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలు, 12 వ్యవసాయ పరిశోధన స్థానాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాలు, 9 ఏరువాక కేంద్రాలు కొనసాగుతున్నాయి.

'అరవై ఏళ్ల వర్సిటీ ప్రస్థానంలో వ్యవసాయవిద్యలో సుమారు 32,300 మంది విద్యార్థులు డిగ్రీలు, 12,300 మంది పాలిటెక్నిక్ పట్టాలు సాధించారు. ఇంకా 9,500 మంది విద్యార్థులు వ్యవసాయశాస్త్రంలో పీజీ, 1500 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### నూతన వంగడాల సృష్టి.. పరిశోధనలు

వరి, మొక్కజొన్నతోపాటు 50కిపైగా పంటల్లో దాదాపు 500 నూతన రకాలను వర్సిటీ అభివృద్ధి చేసింది. 1968లో వర్సిటీ

భాగస్వామ్యంతో అఖిల భారత వరి సమన్వయ పరిశోధన సంస్థ ద్వారా తొలిసారిగా వరిలో అధిక దిగుబడి ఇచ్చే 'జయ'అనే సంకర జాతి తొలి వంగడాన్ని అందుబాటులోకి తెచ్చారు.

నాటి నుంచి స్వర్ణ, బీపీటీ-5204, ఎంటీయూ-1010, ఎంటీయూ-1001, తెలంగాణ సోనా ఇలా వరి ఎన్నో రకాలను వర్సిటీ అభివృద్ధి చేసింది. ఈ ఏడాది అధిక దిగుబడి ఇచ్చే ఎక్స్‌ట్రా ఎర్లీ రకం కంపసాగర్ వరి 6251 (కేపీఎస్ 6251)ని విడుదల చేసింది.

- దేశవ్యాప్తంగా వరిసాగులో ఈ వర్సిటీ అభివృద్ధి చేసిన వరి రకాలు 25 శాతం దాకా ఉన్నాయి. 12 రాష్ట్రాలలో 12 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో ఇక్కడి వరి వంగడాలే సాగవుతున్నాయి.
- దేశవ్యాప్తంగా మొక్కజొన్న విస్తీర్ణంలో 10-12శాతం వరకూ ఇక్కడి సంకర రకాలే సాగవుతున్నాయి. వర్సిటీ అభివృద్ధి చేసిన దాంట్లో హైబ్రిడ్ రకాలైన డీహెచ్ఎం-115, 117, 121 ఉన్నాయి.
- వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో చేసిన 23 ఆవిష్కరణలకు పేటెంట్లు సైతం సొంతం చేసుకుంది.

### కలుపు తీస్తుంది.. ఎరువు జల్లుతుంది!

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఈ స్టాళ్లను ప్రారంభించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతోపాటు పశు వైద్య విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు తమ పరిశోధనలను ప్రదర్శించారు.



ఆగ్రో, బయోటెక్, ఫెర్టిలైజర్ కంపెనీలు తమ ఉత్పత్తులు, యంత్రాలను ప్రదర్శించాయి. సంప్రదాయ చిరుధాన్యాలే కాకుండా వివిధ రకాల పండ్లు, వివిధ పంటల్లో వచ్చిన కొత్త వంగడాలు, యంత్ర పరికరాలతోపాటు కోళ్లు, కుందేళ్లు, పందులు, గొర్రెలు, పక్షుల పెంపకానికి సంబంధించిన స్టాళ్లు కూడా కొలువుదీరాయి.

### 'ఈ కెనాన్'తో కోతులు పరార్

కోతులు, పందులు, ఇతర జంతువుల నుంచి పంటలకు విముక్తి కల్పించేందుకు 'సోలార్ ఆటోమేటిక్ ఈ కెనాన్'తోపాటు ఈ కెనాన్ (మంకీగన్)ను ప్రదర్శనలో ఉంచారు. సోలార్ ఆటోమేటిక్ ఈ కెనాన్ ధర రూ.26 వేలు. ఇది సోలార్ బ్యాటరీతో పనిచేస్తుంది.

జంతువులు, పక్షులు పంటలపై దాడి చేయకుండా ఆటోమేటిక్‌గా సౌండ్స్ చేస్తాయి. ఈ సౌండ్స్ భయానికి అవి పారిపోతాయి. మంకీగన్ ధర రూ.3,500. క్యాల్షియం కార్బైడ్ దీనిలో నింపి, కొంచెం నీటిని వేయడం వల్ల గన్‌లోపల గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ట్రిగ్గర్ నొక్కిన వెంటనే బాంబు పేలిన శబ్దం బయటకు వస్తుంది. ఈభారీ శబ్దానికి కోతులు, పందులు పారిపోతాయి.

### ఆహార వ్యర్థాల నుంచి వంటగ్యాస్

ఇంట్లో సహా హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో ఆహార పదార్థాలు, కూరగాయలు ఇతర వ్యర్థాలను వృథాగా పడేస్తుంటారు. ఇవి ఒకటి రెండు రోజుల్లోనే కుళ్లి, దుర్వాసన వెదజల్లుతాయి. పర్యావరణ కాలుష్యానికి కారణమవుతాయి. ఈ ఆహార వ్యర్థాల నుంచి 'నానో బయోగ్యాస్ ప్లాంట్'ద్వారా వంట గ్యాస్ ఉత్పత్తి చేసుకోవచ్చు.

ప్రస్తుతం కేరళలో విరివిగా వాడుతున్న ఈ నానో బయోగ్యాస్ ప్లాంట్‌ను కిసాన్ మేళాలో ప్రదర్శించారు. దీనికి పెద్ద శ్రమ అవసరం లేదు. ఖర్చుకూడా తక్కువే. దీని ధర రూ.28 వేలు. ఐదు లీటర్ల సామర్థ్యంతో ఏకధాటిగా రెండు గంటల పాటు వంట చేసుకోవచ్చు.

### 'ఫార్మ్‌రోబో ఆర్-1'తో గొర్రు, గుంటుక

పొలంలో గొర్రుకు ఎద్దులను వాడుతుంటారు. రైతు కూడా రోజంతా పని చేయాలి. దీనికి ప్రత్యామ్నాయంగా 'ఫార్మ్ రోబో ఆర్-1' అందు బాటులోకి వచ్చింది. ఇది మనిషితో పనిలేకుండా పూర్తిగా రిమోట్ కంట్రోల్‌తో పని చేస్తుంది. కేవలం విద్యుత్ చార్జింగ్ బ్యాటరీల ద్వారా పనిచేస్తుంది. గుంటక, గొర్రు, రోటావేటర్‌గా పనిచేస్తుంది.

ఎరువులను కూడా వెదజల్లుతుంది. చేలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను కూడా తొలగిస్తుంది. రూ.4.25 లక్షలు దీని ధర. డ్రైవర్‌తో పనిలేదు. బ్యాటరీలను ఒకసారి చార్జింగ్ చేస్తే 3-4 గంటల పాటు పని చేస్తుంది. గంట వ్యవధిలోనే ఎకరం భూమిలో గుంటుక కొడుతుంది. పటాన్‌చెరుకు చెందిన సంస్థ దీన్ని ప్రదర్శనలో ఉంచింది.

### స్మార్ట్ వ్యవసాయానికి 'స్మార్ట్ డ్రోన్లు'

చీడపీడల నివారణకు రైతులు చేతి పంపులు, పెట్రోల్ పంపులను వాడుతారు. ఇది అనేక వ్యయ ప్రయాసలతో కూడినది. రైతు శ్రమ, ఖర్చు తగ్గించేందుకు పవ్‌మెన్ ఏవియేషన్ కంపెనీ సహా మారుతి డ్రోన్స్ ఏజీ 335హెచ్, వ్యవసాయ డ్రోన్ స్ప్రేయింగ్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఇవి 120 మీటర్ల ఎత్తులో ఎగురుతాయి. క్రిమిసంహారక మందులను నేరుగా పంటపై వెదజల్లుతాయి. వీటి ధర రూ.4.15 లక్షలు. బ్యాటరీ బ్యాకప్‌తో పనిచేస్తుంది. పైలెట్‌కు సదరు సంస్థే శిక్షణ సహా లైసెన్స్‌ను కూడా ఇప్పిస్తుంది. పది లీటర్ల ట్యాంకు సహా రోజుకు కనీసం 25 నుంచి 30 ఎకరాలు పిచికారీ సామర్థ్యం ఉంది.

- కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com

# సాగులో సాంకేతికత పెంచాలి

## ఏఐ, రోబోటిక్ టెక్నాలజీలను విరివిగా వాడాలి
## దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
## ఉద్యాన పంటల సాగు పెరగాలి: మంత్రి తుమ్మల

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక లాంటిదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. వ్యవసాయ విద్య, పరిశోధనల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.. రైతులకు మరింత చేరువయ్యేలా సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ ప్రారంభించారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్యతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 2047 నాటికి వ్యవసాయ రంగంలో విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



గడిచిన 60 ఏళ్లుగా వర్సిటీ అసమాన సేవలందిస్తూ.. సోనామసూరి, తెలంగాణ సోనా వంటి ఎన్నో కొత్త వంగడాలను అభివృద్ధి చేసిందని కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన సాంకేతికతలను వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మారేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు.

**ఉద్యానవన పంటల సాగు పెరగాలి: తుమ్మల**

రాష్ట్రంలో వరి, పత్తి, మిరప పంటల సాగును తగ్గించి.. కూరగాయలు, ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటల సాగు పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతాంగానికి సూచించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలో ఆయన ప్రసంగించారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో వ్యవసాయ పట్టభద్రులు రావాలని ఆకాంక్షించారు. శాస్త్రవేత్తలు వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు పంటల సాగును సూచించాలని కోరారు.

ప్రతి వ్యవసాయ కళాశాల పరిధిలో ఒక 'మోడల్ అగ్రికల్చర్ ఫార్మ్'ను అభివృద్ధి చేయాలని సూచించారు. నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ మాట్లాడుతూ.. తెలంగాణలో నీటి పారుదల సౌకర్యం పెరగటంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పెరిగిందని.. అదే సమయంలో కూరగాయలు, ఉద్యాన పంటలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రులు నాదెండ్ల భాస్కర్‌రావు, సమరసింహారెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టీకల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజిరెడ్డి, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై. వెంకటేశ్వర్‌రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవరెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

– కె. సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com



# అండు కొర్రలు - ఆరోగ్య ప్రయోజనాలు

అండు కొర్రలను ఇంగ్లీష్‌లో BrownTop Millets అని అంటారు. ఇవి సంప్రదాయ వంటలో ఒకటి. చిరుధాన్యాలు ఏవైనా కానీ కనీసం 5 నుండి 6 గంటల వరకు నానబెట్టిన తరువాతనే వాడుకోవడం మంచిది.

అండు కొర్రలు మన ఆహారంలో చేరే ఒక విలువైన ధాన్యం. ఇది ఆరోగ్యానికి మంచిది మరియు పర్యావరణానికి కూడా అనుకూలం. వంటకాల్లో దీన్ని ఉపయోగించడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది మరియు బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అదేవిధంగా, ఇది గ్లూటెన్-ఫ్రీగా ఉండటం వల్ల డయాబెటిక్ వున్నవారు కూడా సౌకర్యంగా తినవచ్చు. అద్భుతమైన రుచి, పోషకాలు మరియు ఆరోగ్య ప్రయోజనాలతో, మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం.



అండు కొర్రలు అనేవి చిరుధాన్యాలలో ఒకటి. చిరుధాన్యాలు రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తాయి.

మిగతా చిరుధాన్యాలతో పోలిస్తే ఈ తృణధాన్యాలలోనే ఎక్కువగా పీచు పదార్థం ఉంటుంది. ఈ చిరుధాన్యాలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

**100 గ్రాముల అండు కొర్రల చిరు ధాన్యాలలో పోషక విలువలు ఈకింది విధంగా ఉంటాయి.**

| | |
|---|---|
| Niacin (mg) (B3) | 18.5 |
| Rivoflavin (mg) (B2) | 0.027 |
| Thiamine (mg) (B1) | 3.2 |
| Carotene (ug) | 0 |
| Iron(mg) | 0.65 |
| Calcium(g) | 0.01 |
| Phosphorous (g) | 0.47 |
| Protein(g) | 11.5 |
| Minerals(g) | 4.21 |
| CarboHydrate(g) | 69.37 |
| Fiber(g) | 12.5 |
| CarboHydrate/Fiber Ratio | 5.54 |

**ఆరోగ్య ప్రయోజనాలు:**

ఈ చిరుధాన్యాలు ముఖ్యంగా థైరాయిడ్ (Thyroid), క్యాన్సర్ (Cancer), ఊబకాయం (Obesity), కీళ్లనొప్పులు (Arthritis), రక్తపోటు (Hypertension), జీర్ణ వ్యవస్థ (Digestive System), మలబద్ధకం (Constipation), నాడీ వ్యవస్థ (Nerve), కళ్ళు (Eyes) నాడీ సమస్యలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుంది.

ప్రస్తుతం భారతదేశంలో ఊబకాయ సమస్య పెద్ద సమస్యగా మారింది. రోజురోజుకీ బరువు పెరిగే వారి సంఖ్య పెరిగిపోతోంది. అందుకే, ఆహారంలో కార్బోహైడ్రేట్లను తగ్గించుకోవాలని చాలామంది డైటీషియన్లు సూచిస్తున్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. అలాగే రోగాలను నిరోధించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల, ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలు ఉపయోగకరంగా ఉంటాయని చెప్తున్నారు.

- దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com





# వనపర్తి శ్రీరంగం

తమిళనాడులోని శ్రీరంగం రంగనాయకుడిని వనపర్తి సంస్థానాధీశులు ఇంటి దైవంగా కొలుస్తూ పూజించేవారు. తమ సంస్థానంలోని కొర్విపాడు (పెబ్బేరు మండలం శ్రీరంగాపురం) గ్రామంలోని రంగసముద్రం చెరువు ఒడ్డున ఉన్న గరుడకొండపై శ్రీరంగాన్ని పోలిన రంగనాథస్వామి ఆలయాన్ని 345 ఏళ్ల క్రితం అప్పటి సంస్థానాధీశుడు గోపాలరావు నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. అనంతరం కొర్విపాడు పేరును శ్రీరంగాపురంగా మార్చారు.



ద్వీపకల్పంగా దర్శనమిచ్చే ఈ దేవాలయానికి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉంది. పురాతన ఆలయాల మాదిరిగా నేలమాలిగలను సైతం నిర్మించి.. అందులో పురాతనమైన తంజావూరు పెయింటింగ్స్‌ను భద్రపరిచారు. దేవాలయాన్ని, అందులో కొలువుదీరిన స్వామివారి మూలవిరాట్‌ను తమిళనాడులోని శ్రీరంగం ఆలయంలో మాదిరిగానే ప్రతిష్ఠించారు. సంస్థానాధీశుల కాలంలో శ్రీరంగాపురం క్షేత్రం కవి, పండితులకు ఆస్థాన కేంద్రంగా భాసిల్లింది. సభలు, సమావేశాలకు ఆతిథ్యమిచ్చింది.

ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల సమయంలో చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. తిరుపతి వేంకటకవులు లాంటి మహోన్నత వ్యక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శించి.. ఆతిథ్యం తీసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఇటీవల కాలంలో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి తెలుగు మహాసభలను ఇక్కడ నిర్వహించారు.

వనపర్తి–పెబ్బేరు ప్రధాన రహదారిలోని కంచిరావుపల్లి గ్రామం నుంచి శ్రీరంగాపురం ఆలయానికి చేరుకోవచ్చు. పెబ్బేరులోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఈ ఆలయం 11 కి.మీ. దూరంలో ఉంటుంది. ఏటా ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నుంచి ఉగాది పండుగ వరకు సుమారు 15 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

### ఉట్టిపడే శిల్పసంపద

శ్రీరంగనాయకస్వామి ఆలయంలో నిర్మించిన అద్భుతమైన శిల్పసంపద భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. వివిధ శిల్ప సంప్రదాయాలతోపాటు ద్వారపాలక శిల్పాలతో ఆకాశాన్నంటే అంతస్తులతో ఆలయ గోపురం భక్తులకు స్వాగతం పలుకుతోంది. శేషశయనుడై అభయహస్తం చూపుతూ స్వామివారు, ఆయనకు ఎడమవైపున చతుర్భుజ తాయారు ఆలయంలో శ్రీలక్ష్మీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.


ఆలయం పక్కనే ఏడాది పొడవునా నీటితో కళకళలాడే రంగసముద్రం రిజర్వాయర్ ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులకు కనువిందు చేస్తాయి. ఈ ఆలయంలో పలు సినిమాల షూటింగ్ నిర్వహించారు. ఆలయం పర్యాటక కేంద్రంగా ఎంతో అనుభూతినిస్తుంది.

– సత్యప్రసన్న
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# నెమ్మదించిన భూ మండల వేగం

**భూ**మి ఉపరితలం నుంచి కిందకు వెళ్లే కొద్దీ సగటున ప్రతి 32 మీటర్లకు 1 డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుతుంది. అంటే, భూ ఉపరితలంపై ఉష్ణోగ్రత 13 డిగ్రీలు ఉంటే.. భూ కేంద్రం వద్ద ఏకంగా 6 వేల డిగ్రీలు ఉంటుంది. అంటే, ఇది సూర్యుడి ఉపరితలం వద్ద ఉష్ణోగ్రతకు సమానం. భూమిపైకి ప్రవహించే లావా, గీజర్ల ఆధారంగా లోపలి ఉండే ఉష్ణోగ్రతను అంచనా వేశారు. అయితే, కొన్నాళ్లుగా భూ కేంద్ర మండలం వేగం నెమ్మదించింది.

భూమి కూర్పు మనం అనుకున్నదానికంటే చాలా క్లిష్టంగా ఉంటుంది. ఇది నిరంతరం మారుతూ ఉంటుంది. భూ అంతర్భాగాన్ని భూపటలం (క్రస్ట్), భూప్రావారం (మాంటెల్), భూ కేంద్ర మండలం (కోర్) అనే మూడు జోన్లుగా ఖగోళ శాస్త్రవేత్తలు విభజించారు. అయితే, వీటిలో భూకేంద్ర మండలం మాత్రం స్వతంత్రంగా తిరుగుతున్నట్టు (భ్రమణం) పలు సిద్ధాంతాలు రుజువు చేశాయి. కానీ, ప్రస్తుతం అంతర్గత భూకేంద్ర మండలం వేగం అనూహ్యంగా నెమ్మదించి, అపసవ్య దిశ (రివర్సు)లో తిరుగుతున్నట్టు ఓ పరిశోధన వెల్లడించింది.



భూ కేంద్ర మండలం అనేది భూమిలో అత్యంత వేడి ప్రదేశం. ఇక్కడ ఉష్ణోగ్రత సూర్యుడి ఉపరితలంతో సమానంగా ఉంటుంది. భూ అంతర్భాగంలో 5,180 కి.మీ. లోతులో ఉండే ఈ ప్రదేశం ఐరన్, నికెల్ వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. లోపలి కోర్ చుట్టూ ద్రవరూప ఖనిజాల బాహ్య కోర్ ఉంటుంది. ఇది భూమికి మిగిలిన భాగాలతో ఒక అవరోధంగా పనిచేస్తుంది. ఈ అవరోధం వేడి లోహపు బంతిని పోలి ఉంటుంది. అయితే, భూకేంద్ర మండలం స్వతంత్ర భ్రమణానికి మిగిలిన గ్రహంతో సమానంగా ఉండాల్సిన అవసరం లేదు. మనం నివసించే భూమి బయట పొరను భూపటలం అంటారు. ఈ పొర భూ ఉపరితలంపై 30 నుంచి 100 కి.మీ. మేర విస్తరించి ఉంటుంది. ఇక్కడ అధికంగా ఉండే మూలకం ఆక్సిజన్.

డెన్మార్క్‌కు చెందిన భూగర్భ శాస్త్రవేత్త యాంజ్ లెహ్‌మాన్ 1936లో తొలిసారిగా ఎర్త్ కోర్ అంతర్గత భాగాన్ని గుర్తించారు. అప్పటి నుంచి భూ కేంద్ర మండలం భ్రమణ వేగం, తిరిగే దిశపై శాస్త్రవేత్తల్లో చర్చ జరుగుతూనే ఉంది. కానీ, ఎవరూ కచ్చితంగా నిర్ధారించలేకపోయారు. ఎందుకంటే తమ అభిప్రాయాన్ని.. సిద్ధాంతాలను నిరూపించడానికి శాస్త్రవేత్తలకు పరిమిత ఆధారాలు ఉండటమే కారణం. భూ అంతర్గత నమూనాలను ప్రత్యక్షంగా పరిశీలించడం లేదా సేకరించడం అసాధ్యం. చాలా పరిశోధనలు, అధ్యయనాలు వేర్వేరు సమయాల్లో కోర్ గుండా వెళ్లే సారూప్య బలాల తరంగాల మధ్య వైవిధ్యాలపై ఆధారపడి ఉంటాయి.

'భూమిపై పదేపదే భూకంపాలు, పేలుళ్ల సమయంలో వచ్చిన సీస్మోగ్రామ్‌ల డేటా గత కొన్ని సంవత్సరాలుగా భూమి ఉపరితలంతో పోలిస్తే ఘన అంతర్గత కోర్ భ్రమణ వేగం నిరంతరం క్షీణిస్తున్నట్లు సూచిస్తుంది' అని నేచర్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయన ఫలితాల్లో పరిశోధకులు పేర్కొన్నారు. ఈ పరిశోధన భూ భ్రమణ వేగాన్ని ధ్రువీకరించడమే కాకుండా.. కోర్ క్షీణత కొన్ని దశాబ్దాలుగా మందగించి నట్టు 2023లో శాస్త్రవేత్తల చేసిన వాదనకు బలాన్ని ఇస్తోంది. గతేడాది ప్రతి పాదించిన మోడల్ భూమి కోర్ భ్రమణ వేగం దిశను వివరించింది.

కోర్ అంతర్గత భాగం భూమి క్రస్ట్ కంటే వేగంగా తిరుగుతుందని, కానీ ఇప్పుడు నెమ్మదిగా తిరుగుతోందని ఆ మోడల్ పేర్కొంది. కొంతకాలం కోర్, భూమి భ్రమణం సరిపోలాయి. తరువాత కోర్ భ్రమణ వేగం రివర్స్ దిశలో కదలడం ప్రారంభించిన తర్వాత మరింత తగ్గిందని తెలిపింది. ఇక, భూమి ఉపరితలం నుంచి లోపలికి వెళ్లే కొద్దీ క్రమంగా ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది. ఇప్పటి వరకూ మానవులు కేవలం 11 కిలోమీటర్ల లోతు వరకు మాత్రమే వెళ్లగలిగారు. అలాగే, ప్రపంచంలో అత్యంత లోతైన గని 12 కి.మీ.మాత్రమే. ఇక, భూమి ఉపరితలం నుంచి 100 కిలోమీటర్ల లోతు వరకు ప్రతీ కిలోమీటరుకు 12 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

పర్యావరణం అంటే అర్థం భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి. ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. పరిశోధకులు పర్యావరణాన్ని రెండు రకాలుగా అభివర్ణించారు. ఒకటి మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవాలి.

పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది.

నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. దీనికి కారణం కాలుష్యం. కాలుష్యానికి కారణం పర్యావరణంలో అసమతుల్యతలు సంభవించడమే. భారతదేశంలో పర్యావరణ పరిరక్షణ చరిత్ర ప్రాచీనమైనది.

- హరప్పా నాగరికత సంస్కృతి పర్యావరణహితమైనదిగా ఉంది. వైదిక సంస్కృతి పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్దేశించబడింది.
- తీజ్ లాంటి పండుగలు పర్వదినాలు జరుపుకోవడం హిందూ సంస్కృతి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి, రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియచేస్తాయి.
- భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపంగా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది.
- భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు.
- మధ్యయుగపు, మొగలు పరిపాలన కాలపు భారతదేశంలో పర్యావరణంపై ప్రేమపూర్వక వాతావరణమే నెలకొని ఉండేది.
- భారత రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చింది. కానీ అందులో పూర్తి స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అధికరణలు జోడించబడలేదు. 1972లో జరిగిన స్టాక్ హోమ్ సమ్మేళనం కారణంగా భారతదేశం పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించడం ఆరంభించింది. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలో అధికరణం 48ఎ, 51ఎ లను జోడించారు.
- అధికరణం 48ఏ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు, వాటిలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలి.
- అధికరణం 51ఏ/6 పౌరులు పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధికి తోడ్పడుతూ వన్య జీవుల పట్ల సహానుభూతిని కలిగి

ఉండాలని తెలుపుతుంది.

**ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యానికి ముఖ్య కారణాలు..**

**జల కాలుష్యం**

**వాయు కాలుష్యం**

**భూ కాలుష్యం**

**జల కాలుష్యం**

భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా



ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి మనకు తెలియంది కాదు. నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నాయి. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి.

పర్యావరణ పరిశోధకుల కథనం ప్రకారం వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి.

**వాయు కాలుష్యం**

ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. 2016లో వెలువడ్డ ఒక సర్వే రిపోర్ట్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 90% ప్రజలు కలుషితమైన వాయువులు పీలుస్తున్నారు. దీని కారణంగా అనేక రకాలైన శ్వాస రోగాలు, క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సంభవిస్తున్నాయి. వేగంగా విస్తరిస్తున్న ఈ కాలుష్యం వల్ల సహజంగానే సమస్త ప్రాణికోటి, వృక్షజాతులు ప్రమాదంలో పడ్డాయి. దేశంలో ఉన్న శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు ఈ సమస్యను అధిగమించడానికి అనేక రకాల ప్రాజెక్టులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**భూ కాలుష్యం**

మనిషి పుణ్యదాయిని, పవిత్రమైన భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బతింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. ప్లాస్టిక్ కాలుష్యం ప్రమాదానికి సంకేతం

వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం భారత్‌లో ఏటా యాభై ఆరు లక్షల టన్నుల చెత్త పోగు పడుతోంది. ఇలా 2020 నాటికి పేరుకున్న 12 బిలియన్ టన్నుల చెత్తని శుభ్రపరచడానికి వందల సంవత్సరాలు పట్టవచ్చు.

**ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి వివిధ మార్గాలు**

పెరుగుతున్న ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించడానికి చైనా ప్లాస్టిక్ ఉత్పత్తులపై నియంత్రణ చేపట్టింది. కెనడాలో ఏకంగా ఎమర్జెన్సీ విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫ్రాన్స్‌లో 2016లో ప్లాస్టిక్ నియంత్రణ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ప్రకారం సాధారణ అవసరాలకు వినియోగించే ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు మొదలైనవాటిపై 2020 వరకు పూర్తిగా నిషేధం విధించారు. ప్లాస్టిక్‌పై నిషేధం విధించకుండానే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలిగిన దేశం ఐర్లాండ్. భారీగా జరిమానాల మూలంగా ఆ దేశంలో ప్లాస్టిక్ వినియోగం 94 శాతం తగ్గిపోయింది. మలేషియా కూడా వివిధ దేశాల నుండి ప్లాస్టిక్ నియంత్రించింది.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

# తెలుగు సాహిత్యానికి యువ రచయితల అక్షరాభిషేకం

## పుస్తక ప్రదర్శనలో విభిన్న ఇతివృత్తాలతో వైవిధ్యభరిత రచనలు

పుస్తకం కొత్త పుంతలు తొక్కుతోంది. యువతరం సృజనాత్మకతకు పట్టం కడుతోంది. కథ, నవల, చరిత్ర, ప్రక్రియ ఏదైనా సరే కొత్త తరం ఆలోచనలకు, భావజాలానికి ఊపిరిలూదుతోంది. సామాజిక మాధ్యమాల ఉద్ధృతిలో.. పుస్తక పఠనం ప్రమాదంలో పడిపోయిందనే ఆందోళన వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఠీవీగా దర్శనమిస్తోంది. వైవిధ్యభరితమైన సాహిత్యంతో పాఠకులను ఆకట్టుకొంటోంది. సామాజిక జీవనంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సరికొత్త ఇతివృత్తాలతో పాఠక ప్రపంచాన్ని తట్టి లేపుతోంది. పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



ఒక్కో పుస్తకం వందలు, వేల సంఖ్యలో అమ్ముడవుతోంది. ఈ క్రమంలోనే నవ తరం పాఠకుల అభిరుచికి ప్రాతినిధ్యం వహించే కొత్తతరం రచయితలు ముందుకు వస్తున్నారు. తమదైన ప్రాపంచిక దృక్పథంతో, భావజాలంతో అద్భుతమైన రచనలు చేస్తున్నారు. హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో యువ రచయితల పుస్తకాలు, స్టాళ్లు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ రచయితల కోసం స్వయంగా 7 స్టాళ్లను ఏర్పాటు చేసింది. మరోవైపు పలు ప్రచురణ సంస్థలు సైతం యువ రచయితలకు సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తున్నాయి. ఇంచుమించు అన్ని స్టాళ్లలోనూ కొత్త తరం రచయితల పుస్తకాలు కనిపిస్తున్నాయి. దీంతో పుస్తక ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది.

**కొత్తగా.. పొత్తమొచ్చెనా..**

హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ప్రతి సంవత్సరం కొత్త రచయితలను పరిచయం చేస్తోంది. ఏటా లక్షలాది మంది పాఠకులు పుస్తక ప్రదర్శనకు తరలి వస్తున్నారు. వేలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. సమస్త ప్రపంచం మొబైల్ ఫోన్‌లోనే ఇమిడి ఉందని భావిస్తున్న పరిస్థితుల్లోనూ పుస్తకమే సమస్తమై పాఠకులకు చేరువవుతోంది. కొత్తగా రాయాలనుకొనే ఎంతోమందికి ఇది స్ఫూర్తినిస్తోంది. 'ప్రతి సంవత్సరం బుక్‌ఫెయిర్‌కు వస్తాను. మొదట్లో పెద్దగా పుస్తకాలు చదివే అభిరుచి కూడా లేదు.. కానీ క్రమంగా అలవాటైంది. ఓ 20 పుస్తకాలు చదివిన తర్వాత నేను కూడా రాయగలననే ఆత్మస్థైర్యం వచ్చింది. ఇప్పుడు రాస్తున్నాను' అని ఓ యువ రచయిత చెప్పారు. సామాజిక దృక్పథంతో రాస్తున్న వాళ్లు కూడా వినూత్నంగా తమ ఆలోచనలను ఆవిష్కరిస్తున్నారు. 'తాము సైతం' అంటూ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో భాగస్వాములవుతున్న పలువురు యువ రచయితలు తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకున్నారు. వారిని అభినందిద్దాం.

– ఖైజర్ భాష
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# మాట చాతుర్యం

వజ్రగిరిరాజు వజ్రపాలుడు. అతడి పట్టపు రాణి వజ్రేశ్వరి. వజ్రగిరి పొరుగునే మణిగిరి ఉంది. మణిగిరి రాణి మణిమేఖల. ఆమె అందరి రాణులకు విందు ఇవ్వదలచి ఆ సౌహార్ద్ర విందుకు అందరికి ఆహ్వానం పంపింది. వజ్రేశ్వరి ఆ విందుకు వెళ్ళడానికి ఇష్టపడలేదు. రాజుగారు తరచి తరచి అడుగగా ఆ రాణికి అగం జాస్తి. ప్రతి మాటకు తప్పు తీస్తుంది అంది. ఇరుగు – పొరుగు రాజ్యాలతో మంచిగా ఉండాలి. నీకు తోడుగా బట్లక్కని పంపిస్తాను. ఆమె నీకు మాట రాకుండా చూస్తది అన్నాడు. అర్ధాంగీకారంతోనే వజ్రేశ్వరి విందుకు వెళ్ళింది. చక్కని పొన్నపూలవనంలో వెన్నెల విహారం. పొన్నపూల వాసన ఎంత బాగుంది అంది వజ్రేశ్వరి. మణిమేఖల వెంటనే పంది బురద మెచ్చుతుంది అంది. వజ్రేశ్వరి మొహం చిన్నబోయింది. వెంటనే బట్లక్క అమ్మా! గాడిదకు ఏం తెలుసు గంధం వాసన అన్నారు.

జగద్గురువు కృష్ణపరమాత్మ మెచ్చిన చెట్టు ఇది. వారికి సేవ పొన్నవాహన చేస్తారు. లోకో భిన్న రుచి అంది. మణిమేఖల వజ్రేశ్వరిని తను పంది అంటే, ఆమె చెలికత్తె తనను గాడిద అంది అని అర్థం చేసుకొని అక్కడి నుండి తన నోటి దూల తగ్గించుకుంది.

– వి. మంజురాణి

రామచంద్రాపురం, తెల్లాపూర్



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

## ప్రచురణలు

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోదానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'.



చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా : BALA CHELIMI**
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.Mob: 9030626288,
Email:desk.chelimi@gmail.com, www.balachelimi.com

**చందా వివరాలు :**
**విడి ప్రతి : రూ. 40, వార్షిక చందా : రూ. 400, 2 సం॥లకు : రూ. 750**
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా మొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

### తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300

### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300

### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph.+91 90599 50055

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 31st - December 2024
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

## జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం...



# తెలంగాణ తల్లి

ప్రారంభకులు :
గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ. ఎ. రేవంత్ రెడ్డి గారు

తేదీ : 09 డిసెంబర్, 2024
సమయం : సాయంత్రం 6 : 05 గం.లకు,
స్థలం : డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar